




శ్రీ మొవ్వ వేంకటదాస స్వామి



శ్రీ మొవ్వ శ్రీనివాస పెరుమాళ్ళు



శ్రీ మొవ్వ దాశరథి సూరి

తపఃఫలము

తన్నీరు కమలాదేవి

తపఃఫలము

(కవిభట్టారక మొవ్వ దాశరథిసూరి (విష్ణుదాసు)గారి దివ్య స్మృతి)

'రచయిత్రీ తిలక'

తన్నీరు కమలాదేవి

ప్రమాది - వసంతము

ప్రతులు : 500

హక్కులు : గ్రంథకర్త్రివి

వెల : 30-00

ప్రతులకు :
వేణుగోపాల సేవాశ్రమము
పూడివాడ (P.O.)
నగరం మండలం
గుంటూరు జిల్లా.

భావనీరాజనం

అది ఒక విషాద సన్నివేశం. దుర్భర వేదనావేశం. సర్వశాస్త్ర పారంగతులు - అనేక కావ్యకర్తలు - విశిష్టాద్వైత మత సిద్ధాంత ప్రవర్తకులు - దేశికాగ్రగణ్యులు - కవిభట్టారక దాశరథి సూరి (విష్ణుదాసు) గురువరేణ్యుల స్తమించిరి. జనము తండోపతండములుగా తరలివచ్చి అశ్రుజలనయన పూర్ణమై గురుదేవులను దర్శించి వేడికన్నీటి నివాళులర్పించి తరించింది. అందరి హృదయములందును వేదనాతిమిరము నిబిడమై నిర్భరమై వ్యాపించింది.

వారి దివ్య కళేబరముకడ భక్తులు - గురుదేవుల సతీమణి, వారి సోదరీమణులు - వారిపుత్రులు - కోడండ్రు పరివేష్టించి కన్నీరు మున్నీరుగా విలపించుచున్నారు. ఎవరికివారు తమ పెన్నిధిని కోల్పోయినట్లు, ఒక రక్షకుని పోగొట్టుకొన్నట్లు ఆర్తరావములు కావిస్తున్నారు. ప్రకృతి దుఃఖవివశమైంది. ఆకైన కదలుటలేదు. ప్రకృతి స్తంభించింది.

మా పెద్దమేనత్త శ్రీమతి రామబాణమ్మగారును, చిన్న మేనత్త శ్రీమతి తన్నీరు కమలాదేవిగారును పొందుచున్న దుఃఖమునకు మితిలేదు. వారికి మూడవ గురువుగారే (శ్రీ దాశరథి సూరిగారికి లోకవ్యవహార ప్రసిద్ధి) సర్వస్వము. వారేదైవము. వారి సన్నిధియే సాయుజ్యము. వారి భక్తిప్రపత్తు లనన్యసామాన్యము. గురుదేవులకును వారియందంతకన్న మిక్కుటమగు ఆదరము. అభిమానము. నిరంతరమును గురుదేవులు వారికి బంగారుపెన్నిధియై అండదండగా నిలిచి, ఆధ్యాత్మిక జ్ఞానబోధనలతో, లౌకికములైన విషయపరిజ్ఞానంతో తీర్చిదిద్దినారు.

మాచిన్న మేనత్తగారు "మొవ్వవారి సింహము వెళ్ళిపోయినది" అని అరచుచు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నది. అందరి కనుగ్రంతలనుండి జారిన కన్నీరు కన్నీరుగనే యింకిపోయింది. కాని కమలాదేవిగారి కన్నీరు కవితారూపంగా జాలువారింది. అక్షరరూపం సంతరించుకొన్నది. ఒక్కొక్క కన్నీటిబొట్టు ఒక పదనైన శబ్దంగా అవతరించింది. ఆమె హృదయకోశం దుఃఖరస పరిప్లుతం. ఒక్కొక్క భావం గుండె లోతులలోనుండి, వరదగా దూకుతున్నది. భావపరంపర ఒకదానినొకటి ఒరసుకొంటూ ముందుకు దూకుతున్నవి. అవి భావాలు కావు. గుండెలోతులలోని దుఃఖావేశ కణాలు. వాల్మీకి శోకం శ్లోకమైంది. మా మేనత్తగారి వేదన వచన కవితాహారమైంది. ఏమి భావాలు ? ఎంతటి ఆర్తి? ఏమి ధారాళ రచనాప్రవాహం ? ఒడ్డులొరసికొని ప్రవహించే మందాకినిలా భావాలు దూకివచ్చాయి. ఆమె కేవలం ద్రష్ట మాత్రమే.

ఇక్కడ పాఠకులకొక విషయం స్పష్టంచేయాలి. ఆమె నిర్భర భావనావేశానికి, భాషాలక్షణాలను జోడించి, కొలదిగా మార్పులు చేర్పులుచేసి చూచాను. కాని ఆమె భావతీక్ష్ణత - ఆ భావంలోని నిర్భరత - ఆర్తి - వేదనలు లుప్తమయ్యాయి. ఆమె హృదయాన్ని చీల్చుకొని వచ్చిన భావాలలా ఉంటేనే దానికి న్యాయం చేకూరుతుందని భావించి అలాగే చేశాను.

ఆమె గ్రంథం వ్రాయుట మొకఎత్తయితే, దానిని ముద్రించటం మరొకయెత్తు. గురుదేవుల ద్వితీయపుత్రుడు, చి॥ మొవ్వరంగరాజ పెరుమాళ్ళు ముద్రణభారం పైని వేసికొని, పుస్తకరూపంలో పాఠకలోకాని కందించాడు.

ఇందులో ఎందరో గురుదేవులయందున్న తమ భక్తితత్పరత లను చాటుకొన్నారు.

వారందరికీ, సకాలంలో పుస్తకాన్ని చక్కగా ముద్రించి యిచ్చిన శ్రీ షిరిడీసాయి ప్రింటర్స్ వారికందరికి, ముఖ్యంగా తదధినేత శ్రీ పి. శివరావుగారికి, అట్టను చక్కగా ముద్రించిన శ్రీలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్ - గుంటూరువారికిని నా సాధువాదాలు.

ప్రమాది - వసంతము
29-4-'99

ఇట్లు
పండిత విధేయుడు
మొవ్వ వృషాద్రిపతి

ఆశీరక్షరమాల

- మొవ్వ వృషాద్రిపతి

తల్లియుఁ దండ్రి కన్నులకు దర్శనమిచ్చెడు దైవతంబు లు
త్పుల్ల సుఖాభివృద్ధులకు మూలము; వారల యాశిషంబులే
యెల్లెడ రక్షకంబులని యెంచి తదీయ పదాబ్జయుగ్మముం
దుల్లముఁ జొన్పి భక్తిగొనియున్నను జన్మము సార్థకంబగున్. 1

ఎంతయు నెన్నిజన్మముల నెత్తిన వారిఋణంబుఁ దీర్పఁగా
సుంతయుఁ ద్రోవలే దఘనిషూదనుఁడై మునిలోకవంద్యుఁడై
శాంత చరిత్రుఁడై సకలశాస్త్ర మహోదధిఁ బుక్కిలించి య
త్యంత యశస్సుఁగొన్న పితయన్నను జెప్పెడిదేమి? తమ్ముఁడా! 2

తమ్ముఁడ! నీదు జన్మ మతిధన్యతఁగాంచె నిజమ్మహో! పితృ
ణమ్మును దీర్పఁగాఁ గడఁగు నందనులుందురె? తండ్రియిచ్చు భా
గ్యమ్మును బొందఁజూచెదరుగాని - జగాన జగా నిగారముల్
గ్రమ్మను గీర్తిరూపమునఁ బ్రబ్బి సమస్త దిగంతరాళముల్. 3

నీ మేనత్త నితాంత భక్తి విలసన్నిష్ఠాంతరంగమ్ముతో
ధీమాన్యుండును దేశికేంద్రుఁడు యశోదిగ్దంత చాంద్రీమయా
సామాన్య ప్రతిభాప్రభావుఁడు సదాచారుండునౌ నీపితృ
స్వామిన్ గూర్చి రచించెఁ బొత్తము మనోభావాబ్జమాలాకృతిన్. 4

పరుల సాయంబు గోరక పరమభక్తి
ముద్రణంబున కైనట్టి మూల్యమొసఁగి
యెల్ల కరంజముల కలంకృతిగనిడితి
రంగ! విమలాంతరంగ! సద్రసతరంగ!

నీజనకుండు సర్వధరణీజనవంద్యుఁడు దిగ్దిగంత తే
జోజయశీలి దాశరథిసూరి వరేణ్యుఁడు దేశికుండు ది
గ్రాజిత కీర్తిశాలి కవిరాజు మహోన్నత దివ్యకాంతి శో
భాజిత భాస్కరుండు ప్రతిభాసురలోకగురుండు సోదరా ! 6

మన వంశంబు పవిత్రమైనది సుధామందాకినీ స్వచ్ఛమై
గణుతింగాంచె మునీంద్రతుల్యులుఁ దపోజ్ఞాన ప్రభాభాస్కరుల్
ఘనపాండిత్య విశారదుల్ కవికులాలంకారు లాచార్యులున్
వనజాతోద్భవసన్నిభుల్ పొడమి రీవంశాబ్ధిగర్భంబునన్. 7

వేదవేదాంతాది విద్యామహాంభోధిఁ
బుక్కిలించిన వారు మొవ్వవారు
స్థిరవిశిష్టాద్వైత సిద్ధాంతసారంబుఁ
బుడమిఁ జల్లినవారు మొవ్వవారు
అజ్ఞాన తిమిరాబ్ధియందు మున్గిన వారిఁ
బ్రోవఁ బూనినవారు మొవ్వవారు
కమనీయ సాహితీ కవితాపథంబులఁ
బూజలందినవారు మొవ్వవారు

రామ పదపద్మయుగ భక్తిధాములగుచుఁ
బుణ్యమార్గాలఁ జనువారు మొవ్వవారు
ప్రబలగతి పూడివాడ గోపాలదేవు
పొందు విడువఁజాలనివారు మొవ్వవారు. 8

అతుల తపోవిశాలుఁడు మహర్షి జగత్త్రయ దేశికుండు సం
భృతసుగుణైక సాగరుఁడు వేంకటదాస మహామునీంద్రుఁ డం
చిత గతి శిష్యసంతతికి శ్రీహరి పాదవనేజ భక్తి న
క్షతముగ నేర్పిదిద్దె నవసారసమిత్రుఁ‘డు దైవరుల్’ గదా ! 9

భామారత్నము సీతను
రాముఁడు వరియించినట్లు రమణీయగుణో
ద్దామయగు రాధమాంబను
ప్రేమన్ బెండ్లాడె నెమ్మి వేంకట మునియున్. 10

ఘనదశరథ భూజానికి
తనుజ చతుష్టయముకల్గి తనరినరీతిన్
దనయులు నలువురు కలిగిరి
అనఘమహోదయుఁడు వేంకటాఖ్య గురునకున్. 11

జానగు తేజమున్ విభవసంపద తర్కముఖాదిశాస్త్ర వి
జ్ఞానము భక్తిబంధురత సంస్తుతవర్తన లెల్ల నేకమై
మానుగ శ్రీనివాస పెరుమాళ్ళుగ నుద్భవ మందెనో యనన్
ప్రాణధనంబులన్ భగవదర్పణగా విలసిల్లె జ్యేష్ఠుఁడై. 12

‘రామ’ ‘రామ’ యనుచు ప్రాణముల్ త్యజియించెఁ
జుట్టుఁ జేరి జనులు చూచుచుండ
శిష్యవత్సలుండు సిద్ధసంకల్పుండు
పెద్దగురువుగారు పెద్దవారు. 13

అరుదుగ రామభారతముఖాదిక కావ్య విశేషధర్మ సు
స్థిరతమె వేంకటాచలపతి స్ఫుటనామముతో జనించె ని
ద్ధరయన భక్తిభావసముదంచిత వర్తనఁ గీర్తిఁగాంచి ని
ర్భరతర శిష్యవత్సలత రంజిలు రెండవ పుత్త్రకుండిటన్. 14

కవిభట్టారక సార్థకోద్బిరుద విఖ్యాతుండు శాస్త్రిక సం
భవి విజ్ఞాన ఫణీంద్రతుల్యుఁడు శ్రుతివ్యాపారసారుండు భూ
రి వివేకోదయ శీలి దాశరథిసూరి ప్రాంచిత వ్యాప్త సుం
దరనాముండు తృతీయుఁడై పొడమె విద్యావారువగ్రీవుఁడై. 15

రాజీవాక్షు పదప్రలగ్న మతియౌ రామప్రసాదాఖ్య స
త్తేజోభానుఁడు ధర్మమార్గ విలసద్దీక్షా ప్రచారుండు సం
యోజన్ దా వ్యవసాయ కార్యరతుఁడై యుద్యద్యశఃపూర్ణుఁడై
పూజల్ గాంచు చతుర్థపుత్త్రుఁడు ప్రజామోదైక సత్కార్యుఁడై. 16

అల త్రిమూర్తులకును లేని యలఘుభాగ్య
మమరె వేంకటదాస రాధాంబలకును
రమయు భూదేవి యేకగర్భమునఁ బుట్టి
కనఁగ జనియించి రిరువురు తనయ లెనసి. 17

రమయొకతె పుట్టె నలసం
ద్రమునం దాకొరవ తీర్ప ప్రభవించికొనాన్
విమలగతి రామబాణమ
కమలాదేవి యన సుతలు కలిగిరిరువుర్తై. 18

దాశరథిసూరి నామక
ధీశరధి నిరతి సరోజదేవిని సాధ్విన్
శ్రీశుఁడు లక్ష్మినివలె గుణ
రాశిన్ బెండ్లాడె విబుధరాజి నుతింపన్. 19

వనితా లోక శిరోమణి
యనఁగాఁ బ్రఖ్యాతిఁగాంచి యంచిత శీలం
బున సాధ్వి సీతఁ బోలిన
దనఁ దగియె సరోజదేవి యతులిత మహిమన్. 20

పాండురా జేవురు సుతులఁ బడసినట్లు
అబ్జనాభుని పంచాయుధాళివోలె
నుద్భవించిరి వారికి నుదితకీర్తు
లైదుగురు పుత్రు లతిలోకహర్షమతులు. 21

వినుత విద్యారాశి వేంకట నగరాయ
    లత్యంత గుణపూర్ణుఁడై రహింప
రమ్యచరిత్రుండు రంగరాజ పెరుమా
    ళ్ళతులిత సత్కీర్తి నతిశయిల్ల
దివ్యవర్తనశీలి దేవనాథుఁడు సూరి
    బిరుద విఖ్యాత సచ్చరిత వరలఁ
బ్రతిపదభక్తుండు రఘుశేఖరప్రసా
    దద్భుతాధ్యాత్మిక ప్రాప్తిఁబొదల

భూరిగుణుఁడు వంశీధరమూర్తియనఁగఁ
బుత్రులేవురు కాంతి సన్మిత్రులగుచు
విష్ణుపదపద్మ భక్తిప్రవిష్టులగుచు
ఖ్యాతినందుచు నున్నా రఖండముగను. 22

దేశికసార్వభౌముఁడు సుధీనిధి దివ్యగుణాళి విష్ణు సం
కాశుఁడునైన మీజనకు కమ్రచరిత్రము భక్తి భావనా
వేశముతోడ వ్రాసె గుణ విస్తృతితో మన మేనయత్త భా
వాశుగవేగ మచ్చువలె నంతట స్పష్టముగా రహింపఁగన్. 23

దానిని నచ్చువేయుటకు ద్రవ్యము సర్వముగూర్చి పుత్రసం
తానమునందు శ్రేష్ఠమగు స్థానమునందితి వెవ్వరీడు ? నీ
పూనిక లోకవంద్యము - నపూర్వవిధానఁ బిత్రృణమీఁగ నీ
మానిత భక్తిఁజాటితివి మాధవ భక్తిగ నో సహోదరా ! 24

అలఘుచరిత్ర సాధ్వి మృదులాంచితశీల పవిత్ర సాధు ని
ర్మల గుణపూర్ణయా విజయలక్ష్మి భవద్గృహలక్ష్మియై శుభం
బులును జిరాయువిచ్చి సుఖమున్ గలుముల్ ప్రవిమోదమిచ్చి ని
ష్కలుషతఁ గంటి జెప్పవలెఁగావఁగఁ దమ్ముఁడ! వృద్ధిగాంచుమా! 25

హేమా వారిజ నెమ్మి కృష్ణకళ నా నిందు ప్రభా రేఖలై
హైమాపత్య రమాసరస్వతులునా, ఆమ్నాయముల్ మూఁడునున్
స్త్రీమూర్తుల్ ధరియించె నిట్లనఁగ రాశీభూత సౌభాగ్య ధీ
ధామల్ పుట్టిరి మీ తనూజలుగ విద్యాపూర్ణ మోదాస్యలై. 26

కలకలలాడుచున్ గృహము కంజ నివాసిని కాటపట్టుగా
లలితకళా విలాస మృదులంబుగఁ బిల్లలుఁ బాపలెల్ల ను
జ్జ్వల గతివృద్ధి నొందఁగ యశంబు దిగంతము లాశ్రయింప నీ
రలఘు సుఖైకసంపదల హాయిగ వర్ధిలుఁ డంచితంబుగన్. 27

పొంతనతో మహర్షిగణ ముఖ్యుఁడు వేంకటదాసపూని శ్రీ
మంతుఁడు శ్రీనివాస పెరుమాళ్ళు గుణోత్తముడున్ ద్యురత్నతే
జోంతికమూర్తి దాశరథిసూరి గురుండు శుభాశిషంబుల
త్యంత మొసంగ వర్ధిలు మనంత శుభాళి చిరాయురున్నతిన్. 28

ఆయురారోగ్య భోగభాగ్యాళితోడ
పుత్త్రికా వైభవోన్నతి పొందుపఱచి
నిన్ను నీకుటుంబమును నిర్ణిద్ర కరుణ
శ్రీనివాసుండు రక్షించుఁగాక సతము.

ప్రమాది-వసంతము — అన్న
29-4-99 — మొవ్వ వృషాద్రిపతి

అక్షర ప్రశంస

మొవ్వ వృషాద్రిపతి

అకటా! యెక్కడ దాఁచియుంచితో గదా! యీ పాండితీశోభలన్
నిక్కంబా సుర గాంగ వీచికలకు న్వేగంబు నేర్పించు స
మ్యక్కల్యాణ వచోవిశేషమగు వాక్యశ్రేణి నామ్నాయపున్
ఋక్కుల్ పోలిక సద్గురూత్తముల కర్థిన్ హారతుల్ పట్టితే! 1

కవిభట్టారక దేశికేంద్రుని వచోగంధంబు లత్యంత భ
క్తి విధేయత్వముతోడ నాని కడురక్తిన్ వానిభావింపఁ బా
టవదక్షుంబుగ నవ్వియున్ భ్రమరకీటన్యాయ మేపార వ
చ్చి వడిన్ నిన్నిటుబొందె లేకయిటులన్ జెప్పంగ సామాన్యమే? 2

అంబుజసూతి సన్నిభ మహాత్ముఁడు వేంకటదాసహూని ర
క్తంబునఁ బాలుపంచుకొని గాదె జనించితి? వట్టి నీకు క
ష్టంబగు నొక్కొ? యీదృశరసప్లుత కావ్యము వ్రాయుటెన్న? లే
శంబగు సంశయం బెటుల సంభవమైనదొ? నా మనస్సునన్. 3

ఛందము నేర్చియున్నఁ గవిచంద్రులుగా నుతికెక్కియున్న వా
రందఱి కన్న మిన్నగ మహారసకావ్యము లల్లియుందు వీ
చందము తానుగాఁ గుసుమ చందనమట్లుగ నీదు వాక్కులన్
బొందెను కాకయున్న రసపూరము లూరునె? పల్కుపల్కునన్. 4

ధరవ్యాప్తమైన 'గద్యం కవీనాం నిక
షం వదంతి' యనుట సత్యముగను
భట్టబాణుని వచోవైభవం బరుదెంచి
నీదువాక్కులఁ జేరి నెనసెననఁగ

చిన్నయసూరి వాక్సిద్ధి నీశైలిలోఁ
బాలలోఁ జక్కెరవలె లయింప
దేశికస్మృతిని యూవేశాశువేగాన
వ్రాసి రాశికిమిన్న వ్రాసియనుచు

ఋజువుఁ జేసితివి రచయిత్రీ లలామ !
నీదు శయ్యా విశేషంబు నిక్కువముగ
వర్ణనము సేయలేవు నా వాక్కులింత
దివ్యగుణపుటిక్క ! కమలాదేవి ! అక్క !

నీవును రామబాణమయు నిర్మలభావ కళాప్రపూర్ణ సం
భావనఁ 'జెల్లెలక్క' లనుబంధము వీరలయందు సార్థక
శ్రీవికసించె'నంచుఁ బ్రజ చెప్పుకొనందగు శీలసంపదన్
వావిరిఁ బాలు నీరమన వర్తిలుచుండుట మెచ్చనయ్యెడిన్. 6

చదివితిని రామచంద్రుండు సర్వసుగుణ
రాశియని వాల్మీకి మహర్షి వ్రాసియుంటఁ
గాంచితిని సర్వసద్గుణ కంధియైన
పుణ్యుఁ దన్నీరు శ్రీరామమూర్తి ఘనుని. 7

ఆతఁడు నీదు భర్త సుగుణాన్విత శీల పవిత్ర వర్తనుం
డాతత దానధర్మ చణుఁడాయువు తీరుట లేఁత ప్రాయమం
దే తనవారి వీడిచనియెంతయు ముక్తి సతీకరంబు సం
ప్రీతి గ్రహించి నిత్య సుఖరీతి రహించు యశోవిశాలుఁడై. 8

పృథ్వి 'సుకృతీగతాయు పాపీ చిరాయు'
వనుట వినలేద ? సద్గుణ వనధియైన
యట్టి శ్రీరామమూర్తి మామయ్య చనియె
పరమ పదమందఁగఁ జిఱు ప్రాయమందె. 9

ఇప్పటి కస్మదాదుల కహీన ముదంబుదయించు వారి పే
రెప్పుడు చిత్తవీథి స్మృతికేర్పడఁ దోఁచిన నంతలోనె వా
రిప్పుడు లేరటన్న నిజమెంతయు డెందము వ్రక్కలించుచున్
గుప్పున నుప్పతిల్లెడిని కుత్తుకబంటి దురంతదుఃఖముల్. 10

ఇంట నాబాల గోపాల మిప్పటికిని
'క్రొత్తమామయ' గనెవారిఁ గూర్చితలఁచు
ఆయనను గూర్చి తలపోయ నట్టిదినము
లక్క ! వ్రేళ్ళపై లెక్కింప ననువుపడును. 11

సంతానంబును గాంచి వారియెడఁ బంచప్రాణముల్ నిల్పి య
శ్రాంతంబున్ శ్రమతోఁ దదభ్యుదయ కాంక్షన్ జీవితాశన్ నిజ
స్వాంతంబొప్పఁగ రామపాద సరసీజ ధ్యానచిత్తంబుతో
నంతశ్శుద్ధిగ యోగినింబలెనె అక్కా ! దీక్ష సాగించితే ! 12

ఒక వైపుత్కట జీవితేశ్వర వియోగోద్భూత దుఃఖంబు వే
రొకటన్నోరు నెఱుంగనట్టి పసివాండ్రొక్కింత మార్గంబుఁ దోఁ
పక మాతంగ కరాబ్జమట్లు వినిత్రిప్పన్ ద్రిప్పటల్ పొంది తా
వక సంతాన నితాంతవృద్ధికయి దైవంబున్ మదిన్నిల్పుచున్. 13

ఎన్నో బాధల నంకుచున్ మదిని లక్ష్మీశాంఘ్రి పద్మంబులం
దున్నేమించి సమస్త శాస్త్ర విషయస్తోమంబు నార్జించుచున్
విన్నాణంబున వ్రాసినావిటుల సంప్రీతిన్ గురూత్తంసు దీ
వ్యన్నిష్ఠామయ సచ్చరిత్రము కవిబ్రహ్మల్ ప్రశంసింపఁగన్. 14

నీదు కుటుంబమెల్ల నతి నిర్భర సౌఖ్యశుభ ప్రసన్నమై
మోదమునంద సంపదల మోఘముగా వరియింపఁగా గృహం
బాది రమాసతీ నిలయమై చెలువారఁ గవిత్వదీక్షతోఁ
జాదులు తీయుమమ్మ ! రసభావకవిత్వ మనోజ్ఞ సృష్టికిన్. 15

సరస విష్ణుదాస గురుకృపా పీయూష
వర్షమందు మునిఁగి వాసుదేవ
తత్త్వమర్మమరసి సత్త్వమ్ము చిగురింప
గ్రంథరచనమందుఁ గడుపు మక్క !

ప్రమాది - వసంతము — మేనల్లుడు

29-4-'99 — మొవ్వ వృషాద్రిపతి

- గురుసుతి నపరత్నాని -

శ్రీమాన్ దాశరథి సూరిః, విష్ణుదాసో జగద్గురుః
శ్రీవేంకటాఖ్య హృజ్జాతో, తపోమహిమ గ్రంథకృత్ 1

రాఘాంబాగర్భ సంభూతో, సరోజా దేవినాయకః
పంచపుత్రక పంచీకృత్, సంసారజ్వర వర్జితః 2

కవిభట్టారకో ధీమాన్, శ్రీ కావ్యకళ నిర్మితః
అర్థపంచక విజ్ఞానీ, తర్క-వేదాంత పండితః 3

విశిష్టాద్వైత సిద్ధాంత నిర్ధారణ మహామతిః
పరభక్తి పరజ్ఞాన, పరమాభక్తి రూపవాన్ 4

అష్టాదశ రహస్యార్థ వేదీ వేదవిదాంవరః
ఆచార్య హృదయజ్ఞాతా రామాయణ రహస్యవిత్ 5

శ్రీభాష్యార్థ సుసంవేదీ, షడ్దర్శన సమన్వయః
భగవద్విషయార్థజ్ఞో భారతామ్నాయదర్శితః 6

ఆకారత్రయ సంపన్నో చరమశ్లోకదాయకః
తిరుమంత్ర పరిజ్ఞాతా, ద్వయమంత్రప్రదాయకః 7

అళగియ మణవాళప్పెరుమాళ్ నయనార్ కృతా
ఆచాయిరప్పడి వ్యాఖ్యా తిరుప్పావై సుశోభితా 8

చత్వారింశతి వర్షాణి ప్రవచన మవ్యాహతమ్
త్వయా కృతం మయాప్రాప్తం భవేజ్జన్మని జన్మని 9

ఏవం శిష్యపరమాణుః
వరక్కపల్లి వృషాద్రిపతిః

శ్రీరామ

శ్రీ విష్ణుదాస గురుభ్యోనమః

1) మంగళమ్ దేశికేంద్రాయ మహనీయ గుణాత్మనే
శ్రీ వేంకటాఖ్య పుత్రాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

2) మంగళమ్ కవిభట్టారక తర్క వేదాంత కేసరీ
సర్వశాస్త్ర పారంగతాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

3) మంగళమ్ పరవాది మత్తేభ కంఠీరవాయ
సకలజన సాధుపూజితాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

4) మంగళమ్ దాశరథే దయాగుణ మహార్ణవమ్
జ్ఞానభక్తి స్వరూపాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

5) మంగళమ్ తేజోవిరాజ శశిపూర్ణ బింబాననం
సింహశార్దూల గమనాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

6) మంగళమ్ విష్ణుపరతత్త్వ ప్రతిపాదితాయ
ద్రవిడ వేద ప్రబోధితాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

7) మంగళమ్ తపోమహిమాద్యనేక గ్రంథరచనే
సరోజా ప్రాణనాథాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

8) మంగళమ్ గంగాప్రవాహ వాక్రసామృతవర్షిణే
పూడివాడ నివాసాయ శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

9) మంగళమ్ గురూత్తమా మంగళమ్ దేశికోత్తమా
మంగళమ్ గురుసార్వభౌమా శ్రీవిష్ణుదాసాయ మంగళమ్

ఆచార్య పాదరేణువు

మత్తి ఇందిరాదేవి

శ్రీరామ

శ్రీమతే రామానుజాయనమః
శ్రీ వేంకటగురుభ్యోనమః
శ్రీ శ్రీనివాసగురుభ్యోనమః
శ్రీ విష్ణుదాసగురుభ్యోనమః

అంతరంగము (లేక) మనసులోని మాట

ఈ తపఃఫలమను గ్రంథరచయిత్రి మా పినతల్లి గారగు శ్రీమతి తన్నీరు కమలాదేవిగారు. ఆమె మహర్షి వేంకటదాసస్వామి వారి ద్వితీయపుత్రిక. (కడపటి సంతానము). ఇప్పటి లెక్కలోనికి వచ్చు డిగ్రీచదువు లేమియు లేకపోయినను తండ్రిగారివద్ద, సోదరుల వద్ద చదివి, విని, నేర్చిన పాండిత్యము పుష్కలము. భారత, భాగవత, రామాయణాది గ్రంథముల పరిచయము అపారము. వచనరచన గంగాప్రవాహమువలె దొరలిపోవుట బాల్యమునుండి ఆమెకు అలవడిన విద్య.

ఈమె తెనాలితాలూకా నేటి వేమూరుమండలం పెరవలి పాలెం వాస్తవ్యులగు శ్రీ తన్నీరు శ్రీరామమూర్తిగారి చేయిపట్టి ఏడడుగులు నడచినది. ఆ పుణ్యదంపతులకు కలిగిన సంతానము వరుసగా 1) చి॥ వైజయంతీ వనమాల 2) చి॥ రాజమిహిరాత్మప్రసాద 3) చి॥ పద్మజ అను పేర్లుగల ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరిగృహము నిరంతరము వచ్చిపోయెడి బంధుమిత్రులతోను, అతిథి అభ్యాగతుల సమారాధనలతోనూ నిత్యము కళకళలాడుచు ఒక జమీందారుగారి దర్బారును తలపించెడిది. వారి దాంపత్యము శోభాయమానముగా సాగుచున్న సమయమున దైవానుగ్రహము వక్రించి శ్రీ శ్రీరామమూర్తిగారు 1976 లో నడివయస్సున పరమ

పడించుట జరిగినది. నాటి ఆమె బాధయు, బాధ్యతయు, దుఃఖ తీవ్రతయు వర్ణనాతీతము. అట్టి తరుణమున శ్రీ దాశరథిసూరిగారు సోదరికి కొంతైనను ఊరట కల్పింప పరిస్థితులనాలోచించి ఊరిలోని పెద్ద చెల్లెలితోడను, బావమరిదితోడను, సోదరులతోడను కూలంకషముగా విషయమును చర్చించి కమలాదేవిగారిని, సంతానమును పూడివాడకు రప్పించిరి. నివాసమునకు వేణుగోపాలుని సన్నిధిని గృహమును ఏర్పాటుచేసి తమ పెద్దకుమారుడగు చి॥ వేంకటనగ రాయలునకు ఆమె పెద్ద కుమార్తెనిచ్చి 1978లో వివాహము జరిపించి ఆర్థికముగా మానసికముగా కొండంత అండగా నిలిచిరి.

బాల్యమునుండి చెల్లెండ్రయందు వారికున్న ప్రేమ, వాత్సల్యములు నిరుపమానము. ఆమె పూడివాడ చేరినప్పటినుండి రెండు దశాబ్దములపైన (వారు తనువు చాలించువరకు) కంటికి రెప్పవలె కాపాడి ధారక, పోషక భోగ్యములుగా ఉండిన పెన్నిధి. అగ్రజుడు ఒక్కసారి తమను విడనాడి వెళ్ళినందున కలిగిన శోకతీవ్రతనుండి వెడలిన ఆవేశ అశ్రుధారయే ఈ రచనకు ప్రేరణము.

మహర్షి శ్రీ వేంకటదాసస్వామి 1956లో తిరునాడలంకరింపగా వారి జీవిత మహిమనంతయు వారి మూడవకుమారుడు 'తపో మహిమ'గా సరళవచనమున వెలయించిరి. శ్రీ శ్రీనివాస పెరుమాళ్ళుగారు 1990లో నిత్యపదవికేగ వారి కుమారులు శ్రీ వృషాద్రిపతిగారు 'తపస్సిద్ధి' యనుపేర సొంపైన పద్యకావ్యముగా ప్రకటించిరి.

ఇక ఈ గ్రంథమునందు వివరింపబడిన పుణ్యపురుషుడు శ్రీస్వామి మూడవ కుమారులు, తర్కవేదాంత పండితులు కవి

భట్టారక బిరుదవిభ్రాజితులు, శ్రీమాన్ మొవ్వ దాశరథిసూరి గారు. వారు తండ్రిగారు భద్రాచలమున రామాయణ పారాయణ గావించు సమయమున పుట్టిన తపఃఫలము. రామునకు ఎన్ని కల్యాణ గుణములున్నవని సంస్కృతమున వాల్మీకి వర్ణించెనో అన్నియూ కలిగి ఇట్టి కలికాలమునందు, కుటుంబ సభ్యులను, శిష్యసంఘమును, గ్రామవాసులను ఒకరని అననేల? వారి సమీపమునకు వచ్చిన వారి నందరను అడిగినరీతిలో సహకరించి శాస్త్రవిషయములోను, లౌకిక విషయములోను కడతేర్చి తరింపజేసిన పుణ్యనిధి. జ్ఞానఖని. 'రామో ద్విర్నాభి భాషతే' అనుసటుల రెండవమాటగాని, పొరపాటుగాని, పరిహాసముగాని ఇతరులను గావించని 'దాశరథి'యే ఈ సూరి సత్తముడు.

అట్టివారి విశ్లేషణ శిష్యసంఘమునకును, కుటుంబసభ్యుల కును సాక్షాత్తుగా శ్రీ వేణుగోపాలుడు దిగివచ్చిననూ పూడ్చటానికి వీలుగానిదా లోటు. వారి స్మృతిచిహ్నముగా, స్మరించుటకు తరించు టకు అందరి కోరికపై ఈరచన గావింపబడినది.

ఈ గ్రంథముద్రణకు ద్రవ్యమును భరించువారు చి॥ రంగరాజ పెరుమాళ్ళు వారి అర్ధాంగి చి॥ల॥సౌ॥ విజయలక్ష్మిగార్లు. వీరు సూరి గారి రెండవ కుమారుడు. గ్రంథముద్రణకు వారు కుమారులుగా ముందుకు రాలేదు. గురుభావముతో వారీ కార్యమునకు పూను కొనిరి. "తండ్రి! హరి జేరుమనియెడు తండ్రి తండ్రి" అని ప్రహ్లాదుడు పలికినట్లు సర్వేశ్వర విషయమును విశదపరచిన గురువులువారు (మాబోంట్లకెల్లను) లోకములో ఎందరకు తండ్రులు. ఎందరకు

మామలు, ఎందరకు అన్నలు, ఎందరకు కుమారులు వీడి వెళ్ళుటలేదు? ఎట్టి ప్రేమానురాగములు వర్షించినవారు కాలగర్భమున కలసిపోవుట లేదు. "వారేరీ - భూమిపై పేరైనన్ గలదే" అనునట్లగుచున్నారు. కానీ ఈ విషయము అట్టిదికాదు. పూడివాడలోని కుటుంబసభ్యులకును దివిసీమలోని శిష్యులకును గురుదేవుల పిదపనే వేణుగోపాలుడైనను గణనలోనికి వారికి వచ్చినది. "శరీర వసువిజ్ఞానం - వాసః కర్మ గుణానసూన్, గుర్వర్థం ధారయేన్నరః" అను వాక్యమునను సరించి తమ ద్రవ్యమును గురునిమిత్తమై ఖర్చుచేసి ఈరీతిలో సద్వినియోగమొనర్చు తలంపుతో వారీపనికి కడంగిరి. కనుక వారు ధన్యులు. గ్రంథరచయిత్రి చరితార్థ. పై ముగ్గ్వురకును (రచయిత్రిని - ప్రకటించినవారిని) శ్రీ వేంకటదాస, శ్రీ శ్రీనివాస, శ్రీ విష్ణుదాస సమేత శ్రీ వేణుగోపాలుడు ఆయురారోగ్య ఐశ్వర్యములు కల్పించి రక్షించవలసినదిగా ప్రార్థించుచున్నాను.

ఈ గ్రంథమును, ఇందులో పొందుపరచిన ఇతర అంశములను సవరించి సొంపైనరీతిలో అచ్చువేయించుటకు తనకు ఎన్ని వత్తిడిపనులున్నను అహర్నిశములు శ్రమించి పాఠకలోకమున కందించిన వంశ పారంపర్య గురూత్తములు శ్రీ మొవ్వ వృషాద్రిపతిగారికి శిష్యకోటి తరఫున శతసహస్ర వందనములు అర్పించుచున్నాడను.

ప్రమాది - చైత్రశుద్ధవిదియ
19-3-1999

ఇట్లు
విన్నవించు భక్తపరమాణువు
పద్యాల గోపీచంద్రదస్వామి
ఆంధ్రోపన్యాసకులు - నగరం.

గురుపుంగవులకు మనోవాక్కాయసేవ

మనుష్యునకు మానవతా దృష్టి. దైవచింతన అత్యవసరములు.

అందు మొదటిదానికై ధర్మానుష్ఠానాన్ని రెండవ దానికై విశిష్ట ధర్మాశ్రయణాన్ని ఆచరించవలసి ఉంటుంది.

వాటి స్వరూపస్వభావములు వేదము, వేదాంత భాగముల నుండి మనకు లభిస్తాయి.

వాటినధ్యయనము చేయుట కర్హత, యోగ్యత, శక్తి అవసరము.

అవి ఎన్నియున్నను దైవానుగ్రహమున్ననే వాటికి సంగతమగు సమన్వయార్థము మనకు లభించగలదు.

ఆ దైవానుగ్రహము మరల నాచార్యానుగ్రహముననే లభించగలదు.

అట్టి యాచార్యులు విధ్యనుష్ఠానపరులై యుండవలెను.

అపుడు వారు మనకు మానవత్వానికి వ్యతిరేకముకాని జీవన విధానాన్ని, దైవచింతన అవరోధముగాని మానవత్వాన్ని ప్రసాదించగలరు.

పైగా నా దైవసేవ మనకొఱకుకాదని, యా భగవంతునిసేవ భగవంతుని కొఱకేయునియు మనకు తెలిపి మనను తీర్చిదిద్దుతారు.

అట్టి మహాశయులు కవిభట్టారకులు శ్రీ మొవ్వ దాశరధి సూరి గురువర్యులు తమను "విష్ణుదాసు" అని స్వయముగా ప్రకటించుకొని వారు యకుంఠిత భగవత్సేవానిరతిని యత్యుత్సుకతతో నిర్వహించుకొనిన కైంకర్యనిష్ఠా సంపద్విష్ఠులు వారు.

వారి సంస్కారము వారి పితృదేవులు మహర్షి వేంకటదాస స్వామి వారివలన లభించిన పైతృకము. వారి పితృదేవతల సంస్కారము కేవలము దైవికమని మనందరకు తెలిసినదే.

వారు శిష్యులకు కల్పవృక్షము. తత్త్వవేత్తల కాత్మజ్ఞానామృతభాండము. సాహితీపిపాసకులకు శీతలహ్రాద పానీయము. కవులలో వారు భట్టారకులు. సామాన్యప్రజలకు వారు గృహవాస్తు ప్రణాళికా ప్రదాతలు. వివాహోపనయనాది శుభముహూర్త లగ్న నిర్ణయ నిష్ణాతులు. విశేషమేమిటంటే శిష్యులసంగతి యటుంచి యితరులందరిచేత వారు "మూడవగురువు" అని వ్యవహరింపబడటము వారికే వ్యవహారనామము రూఢియైపోవుట నాశ్చర్యము.

కాగా వారికి నాకునున్న సంబంధము జగద్విదితమే. అది దైవికము. అవిభాజ్యము. దానికి స్వల్పమైన నిర్వచనము అవసరము. వారు నాకు సంస్కృతాన్ని ప్రసాదించిన యధ్యాపకులు. కాని వారిని నేనట్లా గుర్తించలేదు. ఎందుకంటే నాకు భాషమీదకంటే భగవంతునిమీద ధ్యాస. అదే యాశ, అదే యాశయము. ఐతే భగవంతుణ్ణిగూర్చి వారు నాకు ఏమి నేర్పారన్నది ప్రశ్న. దానికి సమాధానం నాకొకటే తెలుసు. అది మళ్ళీ వేరువిషయంపై నా మనస్సు మళ్ళనంత నాకు నేర్పారు. ఇపుడు నాకు వారాచార్యులేగదా. కాని వారిని నేనాచార్యులుగా గుర్తించలేదు. ఇది యన్యాయముగదా. కృతఘ్నతగదా. నిజమే అట్లాగే యనిపిస్తుంది. కాదు. కాదు. వారు నాకధ్యాపకులు. జ్ఞానప్రసాదాచార్యులు. వారిలో వారి పితృదేవతను జూచుకొనేవాణ్ణి. ఇన్ని సంబంధాలున్నపుడేదోయొక దానినెట్లు చెప్పగలను?

అందుకే నేను శ్రీవిష్ణుసహస్రనామంపై క్యాసెటును ప్రారంభించమనికోరగా వారు స్వామివారి కల్యాణసందర్భంలో "నా హృదయపూర్వకంగా నీ యుద్యమము సఫలమగు నట్లాశీర్వదించుచున్నా"నని "తనకున్న సర్వస్వము కాశీవిశ్వేశ్వరునకు దానముచేసి ప్రతిఫలంగా రాజ్యాన్ని పొందిన కాశీరాజువలె తన సర్వస్వాన్ని భగవంతునిపై వదలినందున నీశక్తి యీయనకు లభించుచున్నది" అని సోపమానంగా కార్యసిద్ధిని నిర్దేశించి నిర్ణయించారు. ఐతే నాకెంత విద్యవచ్చునో నా గురువుగారికి తెలియదా? నేను తప్పుదారినిబడినట్లుంటే వారూరుకొనవచ్చునా ? మహాత్ములకు మహర్షులకు పట్టని పరమాత్మతత్త్వము నాకు తెలిసినది యనుకొనుట యజ్ఞానమునకు చిహ్నముగదా! పైగా నుచ్చరించుటకు సాహిత్యము, నర్థము చేసుకొనుటకు తత్త్వము, వ్యక్తీకరించుటకు వ్యాకరణము ఏదియు రాదుగదా! దానికితోడు "జీయరుస్వామివారిని తన క్యాసెట్టు నావిష్కరింపఁగోరుట యెంత యజ్ఞానము. దీనిని మనసులోనేనుంచుకొనక వారు నన్నేకాంతంగా మందలించారు.

నావద్ద నే యర్హతలు లేవుగాని పితృదేవులు మహర్షి యాశీర్వాదములు, అన్నగార్ల యాశీర్వచనములు, తమ యాశీర్వచనములు నున్నవిగదాయని మళ్ళీ వెళ్ళి వారికి నచ్చచెప్పుదామని నా ధైర్యం.

అట్టి గురువర్యులిపుడు పరమపదాన్నలంకరించారు. దేవతలు మహర్షి వేంకటదాసస్వామివారితోను, అగ్రజులు శ్రీనివాస పెరుమాళ్ళు స్వామివారితోను కలిసి భగవత్కైంకర్యపరులై మనందరినిగూర్చి పురుషకారముచేయు కార్యక్రమములో నున్నారు.

మనము వారి యాశయానికి తగినట్లు ప్రవర్తించవలెను. అది మన కర్తవ్యం.

ఇట్లు
ఆచార్య భాగవత విధేయుడు
Ch.V. M.L.V. Prasada Rao



‘కవిభట్టారక’

శ్రీ మొవ్వ దాశరథిసూరి (విష్ణుదాసు) గారు



శ్రీ మొవ్వ దాశరథిసూరిగారు
వారి ధర్మ పత్ని మొవ్వ సరోజాదేవిగారు

అష్టోత్తర శతనామావళి

వాస్తుశాస్త్రప్రవీణ మొవ్వ కృష్ణప్రసాదు

ఓం శ్రీ విష్ణుదాసాయ నమ:

ఓం కవిభట్టారకాయ నమ:

ఓం దాశరధిసూరిణే నమ:

ఓం మహాతపసే నమ:

ఓం మహాకవయే నమ:

ఓం వేంకటదాసతనూజాయ నమ:

ఓం రాధమాంబా గర్భముక్త

ఘక్తాఫలాయ నమ:

ఓం మొవ్వవంశాబ్దిసుధాకరాయ నమ:

ఓం సరోజాదేవీప్రాణనాథాయ నమ:

ఓం తర్కవేదాంతపారగాయ నమ: 10

ఓం శిష్యవత్సలాయ నమ:

ఓం శ్రీ వేణుగోపాలసేవా

శ్రమాధిపతయే నమ:

ఓం కావ్యకళాకృతి కర్త్రే నమ:

ఓం చిత్రాంగదాదృశ్యకావ్యస్రష్టే నమ:

ఓం మహా పండితాయ నమ:

ఓం రామపాదమగ్నాంతరంగాయ నమ:

ఓం మహా భక్తాయ నమ:

ఓం నిరంతర ధ్యానప్రవణాయ నమ:

ఓం వాస్తుశాస్త్ర ప్రవీణాయ నమ:

ఓం జ్ఞానప్రదాత్రే నమ: 20

ఓం కల్యాణగుణ పూర్ణాయ నమ:

ఓం పౌరాణిక శ్రేష్ఠాయ నమ:

ఓం మహా గంభీరాయ నమ:

ఓం మహా యజ్ఞనిర్వహణ శాలినే నమ:

ఓం గురు శ్రేష్ఠాయ నమ:

ఓం కరుణాకటాక్ష వీక్షణాయ నమ:

ఓం దయా వర్షాంబుదాయ నమ:

ఓం ద్రావిడ వేదవిజ్ఞాన పారగాయ నమ:

ఓం కల్యాణ గుణార్ణవాయ నమ:

ఓం ముఖమంటప నిర్మాత్రే నమ: 30

ఓం విష్ణుయాగ నిర్వహణ దక్షాయ నమ:

ఓం అనేక గ్రంథ కర్త్రే నమ:

ఓం రామ భక్తా గ్రగణ్యాయ నమ:

ఓం జ్యోతిశ్శాస్త్రకోవిదాయ నమ:

ఓం ముహూర్త నిర్ణయ నిపుణాయ నమ:

ఓం కల్యాణ కారణాయ నమ:

ఓం ధర్మనిర్ణయ దక్షాయ నమ:

ఓం నిరంతర శిష్య రక్షకాయ నమ:

ఓం భాష్యకార సమాజ రక్షకాయ నమ:

ఓం గండూషిత శాస్త్రసారాయ నమ: 40

ఓం దివ్యతేజసే నమ:

ఓం మధురోపన్యాసకాయ నమ:

ఓం జ్ఞాన నిధయే నమ:

ఓం పరమ పావనాయ నమ:

ఓం భగవన్మగ్నచిత్తాయ నమ:

ఓం క్రతురక్షణ శాసకాయ నమ:

ఓం అనేక శిష్య సేవితాయ నమ:

ఓం దీర్ఘ నాసికాయ నమ:

ఓం ఆజానుదీర్ఘ బాహవే నమ:

ఓం సుగుణగణ్యాయ నమ: 50

ఓం విజ్ఞాన శరధయే నమ:

ఓం తులసీ మాలావక్షసే నమ:

ఓం విశాల భావనాయ నమ:

ఓం దిగ్వ్యాప్తయశోవిశాలాయ నమ:

ఓం సర్వజన పూజితాయ నమ:

ఓం పూడివాడ గ్రామనివాసాయ నమ:

ఓం దివ్య వర్చసే నమ:

ఓం ద్వాదశోర్ధ్వపుండ్రవిలసితదేహాయ నమ:

ఓం కవిలోక వంద్యాయ నమ:

ఓం శబ్ద బ్రహ్మో పాసకాయ నమ: 60

ఓం నాద బ్రహ్మోపాసకాయ నమ:

ఓం తపో మహిమ గ్రంథ కర్త్రే నమ:

ఓం ధర్మాధర్మ విచక్షణాయ నమ:

ఓం కోటిహవన విష్ణు యాగ నిర్వహణ దక్షాయ నమ:

ఓం తిరుప్పావైవ్యాఖ్యాన నిపుణాయ నమ:

ఓం ఆళ్వారుప్రతిష్ఠా కారణాయ నమ:

ఓం శిష్య సంపూజితాయ నమ:

ఓం రామ జపతత్పరాయ నమ:

ఓం జ్ఞానిలోకాగ్రగణ్యాయ నమ:

ఓం ఆచార్య సూక్తి ముక్తావళీ ప్రవచన శ్రేష్ఠాయ నమ:

ఓం పూర్వాచార్య చరిత్ర ప్రబోధకాయ నమ:

ఓం భగవద్గీతా విజ్ఞానదాయకాయ నమ:

ఓం సహోదర సహోదరీవాత్సల్య పూర్ణాయ నమ:

ఓం ముహూర్త నిర్ణయ దక్షాయ నమ:

ఓం దేశికాగ్రగణ్యాయ నమ:

ఓం ప్రతివర్ష పురాణ ప్రవచన బృహస్పతయే నమ:

ఓం దిగంతవిశాలయశోవిస్తృతాయ నమ:

ఓం అనుష్ఠానపరాయణాయ నమ:

ఓం మూఢ విశ్వాస విచ్ఛేదకాయ నమ:

ఓం దివ్య వైభవాయ నమ: 80

ఓం భాష్యకార సమాజ శిక్షకాయ నమ:

ఓం పండితాగ్రగణ్యాయ నమ:

ఓం ఓం తేజో భానవే నమ:

ఓం ప్రముఖాయ నమ:

ఓం వేదవేదాంత ప్రచారకాయ నమ:

ఓం నిర్మల వర్తనాయ నమ:

ఓం ప్రశాంత చిత్తాయ నమ:

ఓం యోగాసన ప్రవీణాయ నమ:

ఓం కారణజన్మాయ నమ:

ఓం జ్ఞాన సంభృతాయ నమ:

ఓం మహాభక్తాగ్రగణ్యాయ నమ:

ఓం సిద్ధాయ నమ:

ఓం ప్రసిద్ధాయ నమ:

ఓం సాహితీ వల్లభాయ నమ:

ఓం భవసాగర తారకాయ నమ:

ఓం సర్వజనవందితాయ నమ:

ఓం దివ్యమూర్తయే నమ:

ఓం దాశరథి సూరిణే నమ:

ఓం సంస్కృత భాషార్ణవాగస్త్యాయ నమ:

ఓం సంస్తుత చరిత్రాయ నమ:

ఓం పద్యరచనాధురంధరాయ నమ:

ఓం సింహసదృశగంభీరాయ నమ:

ఓం మేఘ గంభీర గర్జనాయ నమ:

ఓం పరవాదిభయంకరాయ నమ:

ఓం భూరితపసే నమ:

ఓం మహా మంత్ర ప్రదాయినే నమ:

ఓం వైష్ణవ సిద్ధాంత ప్రచార ప్రముఖాయ నమ:

ఓం శ్రీ విష్ణుదాసాయ నమ:

వంశవృక్షము

- మొవ్వ కృష్ణయ్య గారు కృష్ణవేణమ్మగారు
  - మహర్షి వేంకటదాసస్వామి గారు రాధమాంబ గారు
    - శ్రీనివాస పెరుమాళ్ళు గారు
    - వేంకటాచలపతి గారు
    - దాశరథి సూరిగారు సరోజాదేవి గారు
      - వేంకట నగరాయలుగారు వైజయంతి మాలగారు
        - హిరణ్మయి
        - సువర్ణ
      - రంగరాజ పెరుమాళ్ళు గారు విజయలక్ష్మిగారు
        - హేమ
        - వారిజ
        - కృష్ణ కళ
      - దేవనాథ సూరిగారు పద్మజ గారు
        - గోపీ చంద్
        - పద్మావతీ మానసురాయలు
      - రఘుశేఖర ప్రసాద్ గారు దేవీ పద్మాలయ గారు
        - పన్నగ శైలరాయలు
      - వంశీధర మూర్తి గారు మోహన లక్ష్మి గారు
        - ఫణి శైలరాయలు
    - రామప్రసాదు గారు
    - రామబాణమ్మగారు
    - కమలాదేవి గారు
  - మహాలక్ష్మమ్మ గారు
  - బాపమ్మ గారు
  - రత్తమ్మగారు

శ్రీమతే రామానుజాయనమః

శ్రీ వేంకట గురుభ్యోనమః

శ్రీ శ్రీనివాస గురుభ్యోనమః

యక్షప్రశ్నలు - బుఱ్ఱకథ

రచన :

కవిభట్టారక (విష్ణుదాసు) మొవ్వ దాశరథిసూరి గారు

కీర్తన (శంకరాభరణము-రూపకతాళము)

భావింతు మనంబునందు పన్నగేంద్ర తల్ప ! నిన్నే
దేవనాథ! వినుత భక్తదీనజన మందార ! ॥భా॥
నీ విలాసములు వర్ణింపగ నేరవు నిఖిల వేదములు
సర్వలోక సంభావితమగు నీ చరణయుగళము బాయక సేవించెదరారా!
॥భా॥
ఎటుల బ్రోవదలచినావో ఇందిరా హృదయాబ్జవాస !
వట పత్ర శయాన ! నిన్ను వదలు వాడగానురా ! ॥భా॥
కుటిలదనుజసంహర! కరుణాకర! కోమలాంగ సర్వేశ్వర! మురహర!
పటు తపస్సమాధుల చేతను బయలు పడదు నీ మహిమము తెలియగ
॥భా॥
సూరివినుత ! పూడివాడ శుభనివాస ! ఎచటుగలవో ?
వారిజాక్ష ! శిరము వంచి వందనము లొనర్తు-గొనర
నీరజాసనాదులెల్లరు నీ యాజ్ఞకు లోబడివర్తింతురు
కారణ భూత పరాత్పర ! కరుణా మతివై రక్షింపుము ॥భా॥

రామాభిరామ ! శ్రీరామ ! పావననామ ! రవికులాంబుధిసోమ !
శ్యామసుందరగాత్ర ! జలరుహనేత్ర ! కామారిసుత ! మమ్ముగావరా వేరా !

నిగమ వందిత ! సర్వజగములనిర్మించి అగణితంబుగ్రబోచి అడచు కర్తవు నీవె
మధురాతిమధురము మహినీ చరితము మధుమథనా !
విన్న పాయుపాపములెల్ల, వరపూడి వాడ నివాస ! ప్రణవేశ్వర !
శిరము వంచితి నీకు చిన్నిపూ లివిగో॥రామా॥

కథా ప్రారంభము

మోహనరాగము

శ్రీపరిపాలా ! పూడి వాడ బుధ శిష్టావన లోలా !
గోపకుమారా ! జనార్దన ! కృష్ణా ! కువలయ దళ నీలా !
అండజ యాన ! సురవ్రజవినుతా ! కుండలీంద్ర శయనా !
ఖండన ధీరా ! పాప విదూరా ! పాలింపగరారా !
యాదవ వంశలలామ ! నీకిదే అంజలి గావించి
వేదసమ్మితము భారత గాథ వివరించెదవినుము
ద్వాపర యుగమున పాండు సుతులకు ధార్త రాష్ట్రులకును
భూపరిపాలన మందు వైరములు బొడలె పరస్పరము
పాండు మహీపతి భాగము వారికి పంచియీయ కుండి
కండ కావరము కన్నుగప్పగా ఖలుడు సుయోధనుడు
మాయాద్యూతము లోన వారి నవమానితులను జేసి
న్యాయము చెడి తద్ధనము లన్నియును నపహరించి వైచి
నీరజాక్షి నల ద్రుపద పుత్రిని నిండు కొలువులోన
ఘోరబుద్ధియై దుస్ససేనుచే చీరలూడిపించె

ద్యూతము నందు పరాజయ మొంది ద్రుపదాత్మజ తోడ
పూత చరిత్రులు పాండు మహీవర పుత్రకు లంతటను
సమయము నెరపగ సర్వసౌఖ్యములు సంపదలను విడిచి
కమలదళాక్షుని కరుణ యీపగిది కలిగెననుచు వగచి
మాన శౌర్య దుర్దామ భుజాబల మహితాత్మకులయ్యు
కానన వాసము సేయనేగిరి కర్మ తంత్రు లగుచు
కష్టమెట్టిదో తెలియక బ్రతికిన ఘను లరణ్యములలో
దుష్టుడైన కురురాజు కతంబున దుఃఖంబులు గనిరి
ఇంతిమిన్న ఎపుడెండకన్ను తా నెరుగని ఎలనాగ
కుంతికోడ లా ద్రౌపది ఎన్నోవంతల పాలాయె
అంతసమర్థులు కుంతీనందనులడవుల పాలైరి
ఇంతకు జూడగ దైవనిర్ణయం బెవరి తరము దాట
ఆవిధి పాండవు లడవుల నుండగ నర్జునుడొకరుండు
దేవనాయకుడు బిలువనంపగా దివమునకును బోయి
అమ రారాతుల కాలకేయుల నందర పరిమార్చి
ప్రముదితుడైన మహేంద్రుని వలనను బహు వరంబు లందె
అక్షజయంబున తపము జేసి నిటలాక్షుని మెప్పించి
అక్షయ మహిమాస్పదమగు పాశుపతాస్త్రము గైకొనియె
కిన్నరేశ్వరుని రాజ ధాని వడకించి బలము సూపి
గ్రన్నన దెచ్చెను పవనసుతుడు సౌగంధిక పుష్పంబు
వారికిట్లు సమకూడె కీడులో వాంఛిత శుభములు
శ్రీరమాధిపుని నమ్మినవారల జెరచువార లెవరు ? శ్రీ పరిపాలా ॥

వచనము :- ఇట్లు కౌంతేయు లరణ్యంబున పెక్కిడుముల గుడుచుచు మహర్షుల వలన పురాతన పుణ్య చరిత్రంబులాలకించుచు, జన్నంబు లొనర్చుచు, సూర్య ప్రసాద లబ్ధంబైన దివ్య పాత్ర మహిమంబున

దశసహస్ర ధరణీసురులననుదినంబు భోజన పానాదుల సత్కరించుచు సమయ పాలనం బొనర్చు చుండి రంత ద్వాదశ వర్షాంతంబున :-

కల్యాణి

ద్వైతవనంబున తమ్ముల తోడను ధరణి సురుల తోడ
భూతలేశ్వరుడు ధర్మతనూజుడు పుణ్యాధ్వరములను
బ్రహ్మవిదుల సమకూర్చి యచ్చట పరిశుద్ధుండగుచు
బ్రహ్మార్పణమని చేయుచుండెను బ్రహ్మ మహిత గోరి
కూరిమితమ్ములతో నొక దినమున కొలువు దీరి యున్న
నారాజేంద్రుని చెంతకు నపుడు ధరామరుడొకరుండు
ఎచ్చట నుండియొ నురువులు గ్రక్కుచు ఎంతో పేరాస
వచ్చి సంభ్రమము తోడనిట్లని పలికెను దైన్యముతో.

ధర్మతనూభవ ! ధర్మమూర్తివి తందాన తంధాన తందనా
నిర్మల శీలా ! నీకొక మనవి ॥ తం ॥
సేయ వచ్చితిని చిత్త గింపుమయ్యా ! ॥ తం ॥
అగ్గి మథించెడి అరణి నాయది ॥ తం ॥
దగ్గరగా నట తపము సేయుచు ॥ తం ॥
తరువు కొమ్మకును తగిలించితి రాజా ! ॥ తం ॥
ఎచ్చటిదో దానినెవ్వరెరుగరు ॥ తం ॥
మ్రుచ్చు హరిణమది మొనసి కొమ్ముతో ॥ తం ॥
అరణి నెత్తుకొని అరిగెనయ్యా ! బాబూ ! ॥ తం ॥
అరణి లేక నా అగ్నికార్యములు ॥ తం ॥
జరుగవు గావున కరుణా మతివై ॥ తం ॥
తెచ్చి ఇచ్చినను బ్రోవ గదవె ! దేవా ! ॥ తం ॥

చం అనిఘరశీసురుండు బహుకార్తి వచించిన ధర్మపుత్రకుం
డనుజులు చాపముల్ సునిశితాశుగ పూర్వనిషంగ యుగ్మముల్
గొని పవమానవేగమున ఘోరవనం బున బారు లేడి వెం
టనుజనిరొక్కసారిగ గుణ స్వనముల్ దివి నుండి పర్వగన్

వ ॥ అట్లపొ్పాండు తనూజులు మృగంబు ననుగమించి దివ్యా
స్త్రంబులు బరపి, రందొక్కటి యైన దాని దాక నేరదాయె నామృగంబు

మరియు

॥ సై ॥

మిట్టలు దాటును చౌకళించి
మింటలేచె వరుడాకు విధంబున
బొదలలోన జొరబారు రా
నిదిగో నని కొట్ట బోవగా
బెదరి చూచి దూరమున నుండు
కొదమలేడి జవమేమి రా ?
ఏమిమృగంబో చూడ బోము
భూమి కంటకమె పరువులెత్తు
ఎగిరి ఎగిరి తానెటు వోయిసదో ఎవరికెరుగ రాదండి బాబూ !
రామ రామ శ్రీరామా రామా రామా రామా రఘు రామా !

సై సై సై సై సై సై సై

వ॥ మృగం బట్లదృశ్యంబయిన కౌంతేయులు చేయునదిలేక
దాహ పీడితులై యలసి యొకవటవృక్ష చ్ఛాయ నాశ్రయించిరపుడు

సొమ్మ సిల్లి కూర్చుండ బడిన యాసోదరులను జూచి
నెమ్మ నంబుకడు కలత నొందగా నిలబడి నకులుండు
శిరము వంచి వినయంబున నొదల కరములు జోడించి
పరమ దయానిధి ధర్మ సుతునితో పలికె నిట్టు లనుచు
అన్నా ! ధర్మము ధర్మమనుచునెపుడారటించు మనకు

తెన్ను తెరువులేకుండ పైని బడె బన్నములది ఏమొ
చతురంభోధి పరీతమేదినీ పతులు నిరంతరము
నతులై కొల్వగ కొలువు దీరు జననాయకునకు నీకు
ఎక్కడ వ్రాసెనొ పాడు బ్రహ్మ ఇట్లిక్కట ! యడవులలో
పెక్కు కష్టముల గోడు గుడువుమని పెంకి బుద్ధి తోడ
ద్యూత సమయమున భీమ సింహమును దూక నిచ్చియున్న
పూత శీల ! యీయాపదమనలను బొంద కుండు నేమొ ?

వ॥ అనిన భీమసేనుండిట్లనియె

తమ్ముడ ! కార్యము తప్ప జూచి యిటు ॥ తం ॥
పిమ్మట వగచుట వెడగుసేతగద ॥ తం ॥
ప్రాతిగామి ద్రౌపదిని నాడు పడి ॥ తం ॥
ద్యూత సభకు నటుదోడ్కొని పోయిన ॥ తం ॥
సమయము నందునె సాధు వంచకుల ॥ తం ॥
క్రమ విహీనులను గౌరవాధములు ॥ తం ॥
నాలుకల్ గోసెడి నా గదాయుధము ॥ తం ॥
పాలుసేయకి పాట్లు బడితిమయ్యా ! ॥ తం ॥
అన్నగారి ధర్మానుమతము మన ॥ తం ॥
కిన్నిగూర్చె వగపేలనిప్పుడన్నా ! ॥ తందానా ॥

ఉ ॥ నావిని పార్థుడిట్లనియె నాడు కురుప్రభు నిండు కొల్వులో
ద్రోవదినిచ్చ వచ్చినటు దూరిన కర్ణుని బట్టి చండగాం
డీవ శిలీముఖంబులగడింది మగంటిమి చంప లేక నే
నీవిధి కూర్మి సోదరుల కెగ్గొనరించితి నోయి ! తమ్ముడా !

వ॥ అంతసహదేవుండు కోప సందష్టాధరుండై యలనాడు మాయా బలంబున ద్యూతంబాడ పాండవరాజ్యలక్ష్మి నపహరించిన

దుష్టాత్ము సౌబలుని వధింపక విడిచి పుచ్చితి. దాన
నింత పుట్టె. నిప్పుడేమి సేయంగల ? దని నిట్లు వ్యాకుల చిత్తులై
పలుకుచున్న తమ్ములజూచి ధర్మమూర్తియగు నయ్యజాత శత్రుండిట్ల
నియె

ర॥ అన్నలార ! ఇటు లాడిన మాత్రనె యాపద కడచనునా ?
మున్నొనరించిన కర్మ తంత్రమున మునుగ వలయునరుడు
కానరాని వాడొక డందరిపై గలడు పరాత్పరుడు
వానియాజ్ఞ జవదాట బ్రహ్మకును వశము గాదు సుమ్ము
ఎన్నడొనర్చిన పాపఫలమొయిటులీ నాటికి వచ్చె
వెన్నుని దయయిక నెప్పుడు మనపై వెల్లివిరియగలదొ ?

వ॥ అనినకులునింజూచి వత్సా ! బహు దూరాగమనంబున దాహం
బగ్గలంబుగా నున్నది. సమీపంబున కొలం కేదియైన గలదేమొ? చూడు
మనిన

ర॥ అంతట మాద్రీ తనయాగ్రజుడపు డతివేగము తోడ
చెంతమహీరుహ మెక్కి దెసలు వీక్షించి పలికె నిట్లు
యామ్య దిశను కను చూపు మేరలో అన్నా ! కొలనొకటి
రమ్యోదకమై పక్షులతోడ విరాజిలు చున్నాది
అనిన యుధిష్ఠిరు డాతనితో నీ వటకు బోయిత్రావి
వనజపత్రమున బట్టి తెమ్ము మా కనుజుడ సలిలంబు
పొమ్మని పంచిన నకులుడంత మార్గమ్మున నిరుదెసల
గ్రమ్మివియత్పథ మంటిన తరువుల గాంచుచు జనియచట

పూవువాగలను దోలుచున్నది
పుష్పషండముల తోడ నిండినది

కలస్వనయు లొనరించెడి పక్షులు
కన్నుల కింపొనరించు చున్నవి
ఎవడు ద్రవ్వెనో ? యీ యరణ్యమున
ఎంతో సొబగై యున్నది చెరువటు
పోయి పోయి నకులుండు దాని గని పొందెవిస్మయంబు
॥ రామరామ ॥

ఆ ॥ కొలకు జూచి మాద్రి తొలుపట్టి యెనలేని
హర్షమాత్మ లోన నలము కొనగ
దాహ పీడ నుడుప త్వరపడి లోనికి
తీయ నీరు ద్రావ దిగియెనంత !

ర॥ అంబరమున నశరీర భూత మొక టా తని వారించి
యంబుదగర్జా గంభీరంబుగననియె నిట్టులనుచు
ఓయి ! కుమారా ! వినుము వేగపడి యుదకము ద్రావకుమా !
నాయది కమలా కరము దీనికి నాయకుడను నేను
నేనిచ్చిన ప్రశ్నంబుల కెల్లను నిర్మలో త్తరములు
మానక నీవు వచించి పిమ్మటను మంచి నీరు ద్రావు
కాక తిరస్కృతి జేసి సలిలమును గ్రక్కున గొనుదేని ?
రాకుమార ! ఘోరాపదయిచ్చట నీకిప్పుడె గలుగు
అనుపలుకులు వినవచ్చిన నకులుండన్నియు నాలించి
తన మనంబులో విస్మయ మందుచు దశ దిశలను జూచి
నెచ్చట జూచిన నెవడు గాన రా డేమొయిద్ది యనుచు
హెచ్చెడి దాహము నాపలేక యచ్లేగి నీరు ద్రావి
వెలికి వచ్చి తీరంబున నపుడే విషమెక్కినరీతి
నిలపై వ్రాలెను మాద్రి తనూజుండింద్రియములు డిందన్

వ ॥ నకులుండట్లు పడి యాలసించిన యుధిష్ఠిరుండు సహదేవు నింజూచి

రగడ ॥ అన్న నీటికై ఏగి చాల తడవాయెను సహదేవ!
తెన్నునసేమి విపత్తు గల్గెనో తిరిగిరాక నిలిచె
కావున నతడటు లాలసించుటకు కారణంబు నెరిగి
నీవు వేగమే పన్న తమ్ముడా! నీరము గొనిరమ్ము
తామసింప వలదన్న నాతడిక త్వరపడి జనియచట
కోమలమైన సరోవరమును గని కొలను తీరమందు
నుసురువాసియటు నేలమీద బడియున్న నకులు జూచి
విసవిస దుఃఖము పొరలి వాగలై వెడలగ నార్తముతో
అన్నా! అన్నా! అన్నా! యనుచును నాతనిపై వ్రాలి
వెన్నుని దయయిటు వచ్చెనె నేడని కన్నులనీరుంచి
నీరు ద్రావి వృత్తాంత మేమిటో నెమకుదునని యచట
సారసాకరమునొచ్చినంతనే సత్వరముగసపుడు
అంబరతలమున నుండి వాక్యమొక టతనికి వినవచ్చె
అంబుదగర్జాగంభీరంబుగనచట పూర్వమట్లు
ఓయికుమారా! వినుము వేగపడి యుదకము ద్రావకుము
నాయది కమలాకరము దీనికి నాయకుడను నేను
నేనిచ్చిన ప్రశ్నంబులకెల్లను నిర్మలోత్తరములు
మానక నీవువచించిన పిమ్మటను మంచినీరు ద్రావు
కాక తిరస్కృతి జేసి సలిలమును గ్రక్కున గొనుదేని?
రాకుమార! ఘోరాపద యిచ్చట నీకిప్పుడె గలుగు

ఉ॥ ఈవిధి దివ్యవాణి వచియించిన నాసహదేవు డుగ్రకో
పావిలమానసుండయి నరాధమ! యెవ్వడవోరి? దుష్టమా
యావృతికన్నుగానక మదగ్రజు గూల్చితి దొంగవ్రేటునన్
దైవబలాప్రమేయుల పృథాసుతులన్ గికురింప నెంచితే?

వ॥ ఏదివెలికిరమ్ము. నాక్రూర నారాచంబుల నీ ప్రాణానిలంబుల నొక్క త్రుటిలోన బీల్చెదనని యిట్లా సహదేవుండమ్మహాఘాతంబు పలుకులు లెక్కసేయక నీరంబుద్రావి వెలికివచ్చి గట్టెక్కి నకులుని రీతి నేలవ్రాలె. నటధర్మజుండు సహదేవుండు కూడ తిరిగిరాక తదయుటకు చింతాకుల మానసుండై యర్జునుం జూచి యిట్లనియె.

ర॥ ఎంతసేపటికి రారుకవలు వారేమైరోవనిలో ?
స్వాంతమునం దిక నేలకో మహాసాధ్వసంబు గలిగె
కురుకులాపశదు డాసుయోధనుడు క్రూరుండో యన్నా !
మరచిపోవకే వేచియుండు సుమి మనలను వంచింప
కావున పార్థా ! సత్వరంబుగా కవలజాడ దెలిసి
నీ వా తమ్ములతోడను మాకిటు నీరముగొనిరమ్ము
పొమ్ము పొమ్ము పొమ్మా లసింపగా బోలదన్ననతడు
సమ్మతించి యాయన్నయడుగులకు సాగిలి నతిజేసి
గాండివంబుధరియించి మూపుపై కవదొనలను గట్టి
గండుపులులు ఘూర్ణిల్లుచున్న యాకాననమున నట్లు
అడుగుజాడలను బట్టిపోయి కమలాకరమును గాంచి
కడువిశాలమగు తీరభూమిలో కదలక పడియున్న
అనుజుల జూచి విషాదము పైగొన నర్జును డడలుచును
ఘనపరాక్రమోపేతులైన మాకవలుపడుటు లేమి ?
ఎవ్వడింతపనిజేసె నౌర మాకిచ్చుటదుర్బుద్ధి ?
కవ్వడి బాహుబలంబైనను మది గనుగొనగాలేదా
దాహముదువుకొని ఆపైనే నిటు దమ్ములకీరీతి
ద్రోహమొనర్చిన పాపశీలుని ద్రుంతుగాక యనుచు

వ॥ ధనంజయుండు సలిలపానంబు గావింప సరోవరంబులోనికి దిగి తెట్టువ గొట్టినంత

మ॥ పలదన్నా ! సలిలంబు ద్రాపకుము నా వారాకరంబందు నీ
బలశౌర్యంబు లెరుంగుదున్ తొలుత మత్ప్రశ్నంబు లాలించి యా
పలయున్ వానికి నుత్తరంబు లటు నావాక్యంబుమన్నింప కీ
జలమున్ దాకితివేని నించుకయుసన్ సైరింప నోయర్జునా !

తే॥ నాదుమాటలు వినియు ననాదరించి
అవని బడియున్న తమ్ముల నరసినావె ?
యనెడు శబ్దంబు దివినుండి యరుగు దెంచె
నంత విహ్వచ్చు డాపల్కు లాలకించి

వ॥ కోపవేగంబున కటతటంబు లదర బొమలుముడిపడ నేత్ర కోణంబుల నెఱ్ఱసెరలుదుఱంగలింప గాండివంబు గుణధ్వనిగావించి యిట్లనియె

నీవా యీపని నీచబుద్ధివై ॥తందానా తందానతందన॥
కావించితి వెలకంద క్రొవ్వున ,,
మానశౌర్యములు మేన గల్గుచో ,,
కానగ బయటకు కదలి రమ్మిటు ,,
వైరిభయంకర వీరగాండివ ,,
జ్యారవ నిర్గత శాతశస్త్రములు ,,
ప్రళయమహానలభైరవార్చి ,,
రుజ్జ్వల మయూఖ యుత సారపుంఖములు ,,
నాదుబాణములు మది దలంచుకొని ,,
మేదురముగ నీమేన నిప్పుడే ,,
పుట్టలు దూరెడి భూరి ఫణీంద్రము ,,
లట్టు సొచ్చి నీయసువులు దీయు ,,

వ॥ అప్రతిమప్రభావుల దైవమానుషబలసంపన్నుల త్రిలోక

విజయధురంధరుల రాజసూయాధ్వరసమయ విజిత చతుస్సముద్ర ముద్రితధరావలయపతుల పాండుతనూజుల జెనకి సుఖంబుండదలంచితివా? దుర్మతీ! గజరుధిరారుణితంబైన తరుణపంచానంబు వదనగహ్వరమునందలి కోరలు పెకలింపజూచితివా ?

ప్రతుకుట నీకంత భారమాయెనా ? ॥ తం ॥
మదభరంబు చేమంచిచెడ్డలు
తెలియక మమ్మిటు ధిక్కరింపగా
వలచితివా ? యని వారిద్రుంపగా
ఒకహిడింబ కిమ్మీరులగూల్చిన
వికటరోషు మాభీము నెరుగవా !
నిలిచిమహేంద్రుని చెజిచి ఖాండవము
కలచినట్టి యీకవ్వడి నెరుగవ ?
దొంగతనంబున నింగిడాగిన
వెంగలి ! నిన్నిక విడిచి పుత్తునా ?

వ॥ సుకుమారులైన నాతమ్ముల మాయోపాయంబున ఖరిమార్చి కులుకు చుంటివా ? దుర్బుద్ధీ! నీప్రాణంబులు గొనుకకై యంతకుండు నిన్నిట్లు ప్రేరించె !

రగ॥ అనియిటు పార్థుడు శబ్దభేదులగు నస్త్రములను గూర్చి
ఘనముగ చిత్తస్వాతులుగురిసిన కరణి దెసలునింద
శరపరంపరలు బరపి నీచుడా ! చచ్చితివా యనుచు
విరివిగ నీరము ద్రావి వెంటనే వెలికివచ్చి యచట
దండిమగడు విషమెక్కినవిధమున ధరణి మీదవ్రాలె
చండమారుతాహతమై కూలిన సాలవృక్షమట్లు
అంతట ధర్మతనూజుం డచ్చట ననిలజు వీక్షించి

ఎంతచిత్రమిది తమ్ముడ ! అర్జును డేలతడసెనొక్కొ ?
పోయినపోకగ పోయిరయ్య ముప్వురును రారుతిరిగి
యీయరణ్యమున నేమి జరిగెనో ఏమైరోవారు?
ఎడమకన్ను కదునదరజొచ్చె కిడేమిమూడగలదో ?
వడివడిగా నీవైనను జని తద్వార్త దెమ్ము నాకు

వ॥ అనిపంచిన నావృకోదరుండు మహావేగంబున జని యట కొలకువీక్షించి తత్తీరభాగంబున విగతేంద్రియవ్యాపారంబుల నేలగూలి యున్న యనుజుల ముప్వుర తిలకించి బాష్పపూరితలోచనుండై అకటా ! ఏమి ? అప్రతిమాన బాహుబలశౌర్య సంపదోదారులైన నాతమ్ముల నెవడిట్లుగావింప వలంతి యయ్యొ ? ఏమి యీయన్యాయం? అని పెక్కువిధంబుల దుఃఖించి దాహశాంతి యొనర్చుకొన కొలనిలోనికి దిగియె నంత గగనంబునుండి

ఆ॥ వలదన్నా ! యీవారిగ్రోలకు
జలజాకర మిది తొలుతనుండియు
నాయధీనమును బాయకున్నది ॥ తం ॥

నాయకుడను నే నాదికొలంకు
సలిలముద్రావగ వలచితి వేని
తొలుత నాదుప్రశ్నలకు జవాబు
నిమ్ము కాకనీఇచ్చ చొప్పున
నిమ్మహితోదక మెత్తితేని నీ
తమ్ములవిధమున ధరణి బడుదువు
సుమ్మిది నాయానచొప్పగదయ్యా ॥ తం ॥

తే॥ అనెడి పల్కులు వినవచ్చె నంతభీము
డంత్యకాలంబునందు లోకాళినెల్ల

భస్మమొనరింప జనుదెంచు భర్గుపోల్కిఁ
నాగ్రహోదగ్ర మూర్తియై యదరిపడుచు

శా॥ ఓరీ ! దుష్టమదానలోజ్జ్వలితగర్వోద్రేక సంరంభదు
ర్వారా ! నాయనుజన్ము లిట్లు పడ నీవాకారణం? బేదినీ
జారత్వం బిక భీమసింహ మిదెఁవచ్చున్ మాంసమర్మస్థలుల్
ఘోరాభీలనఖాగ్రకోణముల సంకోచింపకే రమ్మిటుల్.

వ॥ అని గదాయుధంబు ఝళిపించి

శా॥ చండారాతిసమూహ సంహరణ దక్షంబౌ గదాదండమా !
రండాపుత్రకు లీదృశుల్ తెగడువారా? నిన్ను లే లెమ్ము నే
నుండన్ నీకొక శంకయేమిటికి ? నష్టోత్సాహతన్ విద్విష
త్కాండంబుల్ తెగిపారగావలయు నీగంతుల్ విలోకించినన్.

ర॥ కూరిమితమ్ముల కెగ్గొనర్చితివె ? క్రూరుఁడ ! రారమ్ము
పౌరుషమేమొ చూపుము నాకడ బలియుడవగుదేని
వేయిపుట్ల నాయుక్కుఁగదాయుధ మీయెడ నీ నెత్రు
పాయసంబు గతి తియ్యతియ్యగా పానముగావించు
నేటితోడ నూరేండ్లు పుడమిలో నిండెనోయి ! నీకు
చాటున డాగినయంత మాత్రనే చంపక విడిచెదనా ?
గండు మగలనుద్దండ ఖండనుల పాండుతనూజులను
కండక్రొవ్వునను కన్నుగానకే కదిపితివీరీతి
రెచ్చగొట్టితివి మచ్చరంబు మది హెచ్చిసింహములను
చచ్చితివిక నీ మాయలు నాకడసాగవు పొమ్మింక

వ॥ అని యా వృకోదరుండు జలంబుఁదావి వెలికివచ్చి వజ్రనిహతంబైన మహామహీధరంబు పగిది బుడమిఁవ్రాలె. నంతనిట ధర్మతనయుండెంతకును భీమసేనుండు రాకుండుటకు తల్లడిల్లుచు, బయలు

వెడలి యయ్యరణ్యంబున నడుగుజాడలంబట్టి తమ్ముల నన్వేషింపుచు
చనిచని సరోవరంబుగాంచి తత్తటంబున

ర॥ వెలుచ వజ్రహతిదాకి కూలిన పెనుకొండల పగిది
ప్రళయాంతంబున సమసిపడిన దిక్పాలుర విధమునను
ససువులేది పడియున్న యట్టి యా యనుజుల దిలకించి
దెసలు దెలియక ౘా ధర్మజుడప్పుడు దీనతమూర్ఛిల్లె
కొంతసేపటికి మూర్ఛదేరి యాకువల యేశ్వరుండు
ఎంతయు ఘూర్ణిలి ముక్తకంఠముగ నీ విధివిలపించె
అయ్యయ్యో ! ఇదియెంత ఘోరమీ యన్యాయంబేమి ?
ఎయ్యది ఇంకను దిక్కు నాకు నేనెటుల బ్రతుకనోర్తు ?
లోకపావనులు పూజనీయు లవిలోల ధీరమతులు
ఏకకాలమున తమ్ములు నల్వురు నిట్లుకూలిపోవ
వేయివ్రక్కలయి తక్షణంముననె వ్రీలిపోకయకట
హాయిగనున్నది నాదు హృదయమది అశ్మసారమేమొ ?
కరుణాహీనుడ తమ్ములమరణము కనులజూడవలసె
పరమపాపి యీ ధర్మరాజునకు బహుళమాయువకట !
పుడమియు రాజ్యము భోగభాగ్యములు పోయెనుమున్నెపుడో
బడుగులమై యీయడవులలోబడి బ్రతుకుచుంటిమెటులో
పాయక మూల్గెడి నక్కమీదనే పడెను తాటిపండు
ఏయెడ నార్తినలంగినవానికె ఎన్నిబాముతైన
పేలగింజయే దయ్యముకంటికి పెద్దదైనయట్లు
కాలవశ్యులముమే మేవిధికిని గానుపించినామా ?
హరిహరి ! దైవమ ! ఎంత క్రూరుడవో ? యన్యాయంబనక
కరమదీనులగు పాండుసుతులపై పంతగించినావె ?
ఒక్కనాటి కీ వనవాసవ్యధ నిక్కముగాదీరు

పెక్కు భోగములు రాజ్యసంపదలు పేరిమి సమకూరు
పసజ దళాక్షునికరుణ ఎప్పుడోవచ్చి బ్రోవకున్నె ?
యనుచు నిరంతర మూరటజెందుదుమాత్మలందు మేము
ఏలర ! యీదుష్టాశలటంచును నెంచినావె నీవు ?
మూలముట్టుగా పాండువంశమును ముంచినావె నేడు ?

వ॥ స్వామీ ! లీలారసికుండవైన నీవు పాండుపుత్రుల దయనీయ దీనచరిత్రంబు విషాదాలంకారమున కుదాహరణ వృత్తాంతంబుగా జేయ బూనితివా ? పరమకృపాళూ ! దుర్జాతకాగ్రేసరుండగు నీ కుంతీయగ్ర సుతుని నింకెంత ఘోరవిపత్తుల పాలుజేయబూనితివి ! ఇంతకంటె నీకుంజేయగలదేమి ? ప్రభూ ! నా జీవితఘట్టంబు కరుణరసాంతంబు గాముగించితివా ? అయ్యో నా ప్రాణంబులు పోవేమి ? ఎట్లు ధరి యింతు ఈ సోదరమరణ శోకంబు ? హా ! ఏమిచేయుదు ?

ర॥ అక్కట యీ విధి సనుగుసోదరుల నడవిపాలుజేసి
దిక్కులేక నేనే మనిపోవుదు తిరిగి పురమునకును
కూరిమితమ్ముల నేమిసేసి తనికుంతి భోజపుత్రి
చేరియడుగగా నుత్తరమేమని చెప్పువాడనయ్యో !
ఇంతకుదమ్ముల నేకకాలమున నిట్లు సేసెనెవడు ?
వింతలకెల్లను వింతసుమ్మిది వెదకి చూడనౌరా ?
యక్షరాక్షసాదిత్య మరున్నరులందరు గలసియును
దక్షులుగారిక నా సహోదరులదాకి జయమునొంద
బనను యుద్ధపు జాడలేవియును నగపడవేయిచట
కానరాదొక గాయమైనను కాయంబులయందు

ఉ॥ కారణమేమొ ఇచ్చట సకల్మషవృత్తులు నాదు తమ్ములి
ట్లూరక ప్రాణముల్ విడిచి యుర్వికదన్ కడు చిత్ర మాదురా

చారులు పాపవర్తనులు సాధు విగర్హితులైన కౌరవుల్
దారుణబుద్ధులై విషముదగ్రత గల్పిరొ? యీకొలంకునన్.

వచ॥ ఐన నంబు పానంబుగావించిన సమస్త జంతుసంతానంబు మడియవలదె? అదే విహంగకులము, పశుసమూహంబు నిరాతంకంబుగా జలంబుగ్రోలి సుఖంబుగా వర్తించుచున్నది. ఇటపటు పరాక్రమోపార్జిత యశోనిర్జిత నిర్జరేంద్రుల నరిందముల నా సహోదరులనిట్లుసేయవలంతి యయిన వాడెవ్వడు? దైవమాయా విలసితంబుగా నున్నదని యయ్యజాత శత్రుండు హృదయంబు పదిలంబు గావించి

కీర్తన - అటతాళము - మిశ్రజాతి

ఇందిరనాథ । మముబ్రోవరారా ।
సుందరరూపా । ముకుందా । జనార్దన ॥　　॥ ఇంది ॥
అజభవాదులు నిన్నునిజముగ నెరుగరు
సుజనరక్షక ! పరిశుద్ధ స్వరూపా !
పతితపావన । నిన్ను భజియించువారికి
అతులితంబగు పాపమంతమొందునుగద　　॥ ఇంది ॥
నీపదంబుల నమ్మి నెగడు దాసులమమ్ము
కాపాడి బ్రోవవె కనకాంబరధారి !
ఆపదంబుధిబడి యల్లాడు మాకొక
తేపపై దరిజేర్ప దిగ్గనరావయ్య !
వందనంబులు నీకు వరపూడివాసశ్రీ
మందిర ! సర్వేశ ! మధుమథనా ! ఓ　　॥ ఇంది ॥

వచ॥ అని యాపద్బంధుపైన యాజగన్నాథునుతించి దాహంబు దీర్చుకొని కర్తవ్యమాలోచింప నగునని కొలనులోనికి దిగినవెంటనే అంబరముననుండి.

శ్లో॥ రాజన్! మా పిబనిర్మలోదకమిదం దాహార్తితోఽపి స్వయం
యక్షోఽహం పరిపాలితంచ విపినేఽస్మిన్ మామకీనం సరః
ప్రశ్నానాం లసదుత్తరం యది భవాన్ దాస్యత్యనుజ్ఞాతతః
నోచేత్తేపతితాయథా సహభువస్తాత్వం గతిం యాస్యసి.

॥తం॥

అనుపలుకులు వినవచ్చెనప్పుడు
మనుజనాథు డామాటలకులికి
విరవిర గట్టునకెక్కి నిలుపబడి
కరములు తా దల దోయిలించిపలికె
గగనమందు । నశరీరరూపివై
తెగువతోడ భాషించుచుంటివి
హింసించితివి తమ్ములనిటు నా
మాంసనేత్రములు చూడలేవె? నిన్ను ॥తం॥

యక్షమాత్రుడవుగావు సుమ్మి పా
లాక్షునకైనను నాదునోదరుల
జేరి గెల్వ్వకడు నరిది వారి నీ
వూరక గూల్చితి వెవరివో ? మహాత్మా ! ॥తం॥

నగవిభేదివో ? నాగశాయివో ?
దిగధీశులయందొక్కరుండవో ?
చండభానుడవో ? చిత్రదీప్తివో ?
దండధారి మాతండ్రియముడవోక్కొ ! ॥తం॥

మా నుము విగ్రహమేలవద్దురా ।
దీనులమీ యపరాధమోర్వరా ।
వందనంబులివె వేనవేలురా ।
మందబుద్ధులము మమ్ముబ్రోవుస్వామీ ! ॥తం॥

వచ॥ అని యిట్లు వేడు నయ్యుధిష్ఠిరున కదృశ్యుండైన యద్దివ్య పూరుషుండిట్లనియె. ధర్మరాజా! నా వాక్యంబులాలకింపక తిరస్కరించి నీరుగ్రోలి నీ తమ్ములిట్లైరి. నేనడిగిన ప్రశ్నంబులకు సమాధానంబిచ్చి జలంబానుము. అట్లుగాక త్రాగితివేని నీసహోదరుల పోల్కినగుదువు.

ర॥ అనవిని ధర్మతనూజుం డిట్లను నమ్మహాత్మతోడ
మనుజమాత్రుడను దివ్యరూప ! నీ మర్మగర్భితములు
పలుకులకే విధి జెప్పనేర్చెదను ప్రత్యుత్తరములను?
తెలిసినంతవరకైనను జెప్పెదదేవ ! యడుగుమనిన
అంబుదంబు గర్జిల్లినట్లుగా నఖిలదిశలు మ్రోయ
అంబరస్థమగు దివ్యభూత మిటులప్పుడు ప్రశ్నించె

1 యక్షుడు : దినకరుండు భువిదేని బలముచే దిరుగుచుండునెపుడు ?
ధర్మరాజు : అనఘా ! సత్యము కర్మసాక్షికిని నాధారంబంద్రు.

2 యక్షుడు : జీవన్మృతుడన నెట్టివాడో మరి చెప్పుమయ్య రాజా !
ధర్మరాజు : సేవక దేవాతిథులకివకదిన జీవన్మృతుడగును.

3 యక్షుడు : ధరణీకంటె కడు నెక్కువైనయద్దాని తెలుపవయ్యా !
ధర్మరాజు : ధరణికంటె కడు నెక్కువైనది తల్లిగాదె ! స్వామీ !

4 యక్షుడు : ఆకాశంబున కంటెను పొడవగు నదిఏదో చెపుమా ?
ధర్మరాజు : ఆకాశంబున కంటెను పొడవగు నట్టివాడు తండ్రి

5 యక్షుడు : గాలికంటె బహు శీఘ్రగమనమున గదలు వస్తువేది ?
ధర్మరాజు : గాలికంటె కడుశీఘ్రగమన మదిగలదుమనసునకును.

6 యక్షుడు : అంగములుండియు హృదయరహితమై యలరునట్టిదేది
ధర్మరాజు : అంగవంతమై హృదయములేనిది అరయ రాతిబొమ్మ

7 యక్షుడు : పుట్టియు చేతనబొందకుండు నది పుడమితేడ ! ఏది
ధర్మరాజు : పుట్టియు జీవములేకయుండు నది భువినిగ్రుడ్డుస్వామి

8 యక్షుడు : ఇలగృహస్థునకు, మృతునకునిలపరమాప్తులెవరు రాజా!
ధర్మరాజు : ఇల గృహస్థునకు భార్య, మృతునకు ఎలమి
పుణ్యమంద్రు

9 యక్షుడు : కన్నులుమూయక నిద్రవోవగా గలుగునేది ? రాజా !
ధర్మరాజు : కన్నులుమూయక నిద్రవోవగాగలది చేపగాదా !

10 యక్షుడు : పుట్టువానిలోనెల్ల శ్రేష్ఠమును భూమి పాల ! తెలుపు
ధర్మరాజు : పుట్టువానిలోనెల్ల గొప్పయల పుత్రకుండుదేవా !

వచ॥ అని ఇవి మున్నుగా నద్దివ్యపూరుషుం డడిగిన ప్రశ్నంబులకెల్ల నజాత శత్రుండు సమాధానంబిచ్చెనంత సాలప్రాంశుడును నీలదేహుండునునైన మహాపూరుషుం డెదురుగా వచ్చి యిట్లనియె.

ర॥ మెచ్చుకొంటి నీ యుత్తరంబులకు మేలుమేలు రాజా !
ఇచ్చెదనొక్కని మాత్రము తమ్ముని నిచ్చగోరు మనిన
మనుజ నాయకుడు ధర్మతనూజుడు ఘనముగ నిట్టూర్చి
వినయ మొప్ప మా నకులు నిమ్మని వేడుకొనియెనంత
మందహాసమొనరించి దివ్యుడో మనుజనాథ ! వినుము
ఇందరిలోపలనేరికోరినా వీతని నదియేమి ?
నెత్తిమీదికిని దక్షయజ్ఞ మదినీకు వచ్చియుండె
శత్రులలోపల నొరగవలయు మీకల నరేంద్రులెల్ల
భారత ఘోరరణ ప్రళయాంబుధి బాహుబలముతోడ
సారవిచారా ! కడగి యీదుకొని చనగావలె నేడు
అబోలెకు నీబోలె సలామని యన్నరీతిగాగ
ఈ బలహీనుడు నకులుడందు నీకేమి చేయగలడు?
ఆము లేనుగుల సింహపౌరుషుల నరిభయంకరులను
భీమార్జునులను గోరవెంతటి పిచ్చివాడవయ్యా !

వచ॥ అనిన ధర్మపుత్రుం డమ్మహాత్మున కిట్లనియె.

ర॥ మాననీయ మా తండ్రి పాండు భూమండలేశ్వరునకు
మానుగ కుంతీమాద్రు లనంగా మహి నిర్వురుసతులు
కుంతి సంతతికి పెద్దవాడనే కువలయముననుంటి
యెంతయు మాద్రీ సంతతిలోపల నితడు పెద్దగాన
ఇద్దరు తల్లుల సంతానంబులు నీభువిలోనుండ
తద్దయుగోరితి నకులు నీయగా దగవుగాదె? చెపుమా !
రాజ్యము భూమియు భోగభాగ్యములు రణము దేవుడెరుగు
ప్రాజ్ఞ్యమైన ధర్మంబె దైవమని పండితు లనుచుంద్రు
ధర్మమూర్తియని లోకమంతయును తరచు నన్నుపలుకు
ధర్మహీనమగు సేతకెంతయును దలపడగా నోర్వ
కావున నకులుని కాంక్షసేసితిని గరుణింపవె ! యనిన
భూవలయేశ్వరు న్యాయబుద్ధికిని హొరిహొరి మదిమెచ్చి
భళిభళి!రాజా!ధర్మమూర్తివని పలుకవచ్చు నిన్ను
నలువుర నిచ్చితినీదు తమ్ముల, న్యాయమదికి మెచ్చి
గైకొనుమని యా దివ్యపూరుషుడు కరుణసేయగానె
ప్రాకటంబుగా నిద్రవోయి యాపైని లేచుపగిది
తమ్ములు నల్వురు లేచినిలువగా ధర్మతనూజుండు
నెమ్మనంబు గడుమోదమొందగా నియతి వినతుడగుచు

తే॥ స్వామి కడుచిత్రమాయె నీ చరితయెల్ల
యక్షమాత్రుండవా ? ఏలయనృతమాడ
నైన నమ్మదు దీని నా మానసంబు
నిజము దెలుపవే మాకునో నిర్మలాత్మ !

వచ॥ అనిన నమ్మహాత్ముండేను ధర్మపూరుషుండ. మత్తనూభ
వుండవైన నీ మనంబు ధర్మంబున నెట్లున్నదో పరీక్షింప వచ్చితి.

మెచ్చితి, నీ వర్తనంబునకు మృగరూపంబున నరణిఁగొని వచ్చినాడనిది గైకొమ్మని యిచ్చి యజ్ఞాతవాసంబున పాండుసుతులని మిమ్మెవ్వరు నెరుంగ కుందురుగాక. అట్టి రూపసంపత్తి యపుడనుకూలింపను బొందని అభిమత వరంబులిచ్చి తిరోహితుండయ్యె.

ర॥ తమ్ములతో నాయరణి దీసికొని ధర్మజుడంతటను
నెమ్మదిగా నటు నడచివచ్చి తమ నెలవు జేరియుండె
భూసురేశ్వరుని బిలువబంచి యప్పుణ్యపూరుషునకు
భాసురంబుగా నరణి ఇచ్చి యిక బలుదీవెనలందె
నీవిధి ద్వైతవనంబున పాండవు లెలమి మిక్కుటముగా
భావజ జనకుని కరుణసుఖంబుల బరగుచుండిరచట.

శ్లో॥ యత్పాదాంభోరుహ ధ్యాన విధ్వస్తాశేషకల్మషః
వస్తు తాముపయాతోహం వేంకటాఖ్యం నమామితమ్.

తపఃఫలము - నివేదన

'రచయిత్రీ తిలక'
తన్నీరు కమలాదేవి

వందనంబులునీకు వందారు మందార !
బృందారకస్తుత ! వందనములు
వందనంబులు నీకు మందరగిరిధారి !
ప్రబల దయాసాంద్ర ! వందనములు
వందనంబులు మిత్ర విందాకళత్ర ! గో
విందా ! సుందరపదా ! వందనములు
వందనంబులు నీకు సుందరసుకుమార
చందనాంకిత దేహ ! వందనములు
వందనంబులు నీ కరవిందనేత్ర !
వందనంబులు రాకేందువదన ! నీకు
వందనంబులు నందకాస్పంద శౌర్య !
వందనంబులు నీకివే ! వందపదులు. 1

దండముల్ శార్ఙ్గకోదండ మండితహస్త !
దండముల్ కుండలీంద్రప్రతల్ప !
దండముల్ మత్తవేదండారి ఖండిత !
దండముల్ దండితోద్దండవైరి !
దండముల్ నీడజాఖండలేశ్వరయాన !
దండముల్ భండనోద్దండ ! నీకు
దండముల్ బ్రహ్మాండభాండచండోదర !
దండముల్ మణిహేమకుండలయుగ !
దండములు నీకు రక్షితపుండరీక
దండములుగొని మాకు నీయండదండ
దండిగానిడి మెండైన దయనుజూపు
వెండి శతకోటి దండముల్ నిండుగాగ. 2

శ్రీవిష్ణు పాదరాజీవపుభృంగంబు
భాష్యకారసముండు - భవ్యయశుఁడు
వేదవేదాంతాది విద్యాకలాపంబు
మూర్తిభవించిన పుణ్యపేటి
భరతాగ్రజునిబోలు భవ్య సద్గుణరాశి
కకుబంతకీర్తి విజ్ఞానమూర్తి
ద్రవిడభాషలమూల తాత్పర్యములదెల్పి
ప్రోచిన రెండవ భోగినేత.

అట్టి మహనీయు డగ్రజు డఘవినాశు
డొంటిదివికేగ కుత్తుక బంటియైన
దుఃఖచిత్తాన చీకటుల్ దొంతరలుగ
బ్రతికియుంటి విషాదంపు ప్రతినిధిగను. 3

ఆంధ్రకవితామ తల్లి దుఃఖార్తయయ్యె
తెలుగునాడున శాస్త్రముల్ వెలుగుతోలగె
చిన్నవోయె సాహిత్యంపు కన్నెమనసు
అవని దాశరథి కవీంద్రు డస్తమింప. 4

అన్న ! ఘనసారతుల్యమై అమలమైన
నీదు నపఘనమంటి పునీతుడయ్యె
జాతవేదుండు గతదోష జాతముడిగి
సప్తజిహ్వాలు సాచి ప్రజ్వలితుడయ్యె. 5

దాశరథీ ! యని పిలిచెను
శ్రీశుడు నిను 'వచ్చుచుంటి చిన్మయరూపా !
ఆశు జపంబున'నని మో
క్షాశం జని కూడినావె ? సారసనేత్రున్. 6

మహియందు మామీద మమతానురాగముల్
వర్షించిన పయోదపంక్తి వీవె
మా మనోగ్రీష్మతాపామిత వ్యథబాప
సరస వాగ్రసఝరీ సరణినీవె
మాతండ్రి మాభ్రాత మాగురుండవునీవె
వశమైన యిష్టదైవంబ వీవె
మా మనంబులగల మాలిన్యములద్రోలి
వెలుగునింపిన వేడివెలుగు నీవె
అనుచు భావించి సేవించు ననుజులైన
మమ్మువిడనాడి దివ్యధామంబుజేర
మనసు కలిగెనె ? మీకు నో మాన్యచరిత !
విష్ణుదాస గురూత్తమా ! విబుధ వినుత ! 7

చిరత ప్రాయంబునందె సత్కృతులొనర్చి
అధికులగువారి మన్ననలందుకొంటి
వన్న ! నీబోంట్లు గలరె యీ యవనియందు ?
దివ్యగుణసాంద్ర ! కవిచంద్ర ! దేశికేంద్ర ! 8

పరులకెన్నడు కీడు భావించి యెఱుగని
దతి పవిత్రంబు మీ యంతరాత్మ
సంక్లిష్టతరమైన సత్యమార్గమునుండి
మరల బోవనిది మీ మహితదీక్ష

త్రికరణశుద్ధికి దివ్యవర్తన కెత్తి
నట్టి దీపజ్యోతి యాశయంబు
నిష్కళంకయుతంబు నిష్పక్షపాతమా
న్యాయంబునకు పాదు మీ యెడంద
సకలసుగుణాల శీల సత్సంగమంబు
ధర్మదేవత వాస ప్రధానగృహము
సర్వసత్కళామయ దీప్త సదనసీమ
త్వన్మనము విష్ణుదాస పుంభావవాణి ? 9

ప్రబల విద్యల సామ్రాజ్యరాజ్ఞియైన
భారతీదేవి తన కాలిపసిడిగజ్జె
కదల నీజిహ్వాగ్రంబు తుదలనిలిచి
లాస్యమొనరించె లయబద్ధ లలితగతుల. 10

అన్నా! నీదు తలంపులేగద సదా ఆనంద సందోహదం
బెన్నన్ నిన్ మఱువంగ సాధ్యపడునా? యీజన్మకున్ మాకు, సం
చ్ఛన్నైకామృత వాక్యముల్ వినుటకున్ శక్యంబౌనో? సత్త్వసం
పన్నా! మాసుకృతంబుతీరినది మీ వాత్సల్యమున్ బొందగన్. 11

భక్తి కడసారి మీపాద కంజములకు
వినతిగావించి యొకమాట విన్నవింతు
సత్త్వనిధియగు మీ సుధాస్వాంతమందు
నరయు మొకసారి నన్ను దాశరథిసూరి ! 12

దొసగులేయున్న సవరింప తోడుపడుదు
సందియంబేల ? మదియందు గ్రందుకొనెడు
భావములకెల్ల వాక్యరూపమునిమ్ము !
అని వృషాద్రిపతియిడె కొండంతబలము. 13

అట్టిప్రోత్సాహమున చేతనైనయంత
వ్రాసితిని శక్తితో కాదు ప్రాజ్ఞులార !
ఛందమెఱుగను లక్షణసార మెఱుగ
శబ్దసాధుత్వ మెఱుగనో చతురులార ! 14

అన్నయందున్న మమకార - మాత్మయందు
కొట్టుమిట్టాడు భావముల్ - నిట్టలంపు
శ్రీశు కరుణయు నిట్లు రంచింపజేసె
తప్పులేయున్న మన్నింపు డొప్పులట్లు. 15
'కవిభట్టారక' దాశరథిసూరి (విష్ణుదాసు) మహాత్ముల

శ్రీరామ

శ్రీవేంకట గురుభ్యోనమః

శ్రీశ్రీనివాస గురుభ్యోనమః

శ్రీ కవిభట్టారకుల దివ్యస్మృతి

శ్రీవేంకటాఖ్యాయ నమోనమస్తే

శ్రీశ్రీనివాసాయ నమోనమస్తే

శ్రీవిష్ణుదాసాయ నమోనమస్తే

నమోస్తుతే దాశరథీ గురూత్తమమ్

శ్రీపూజ్యపాద వేంకట దేశికేంద్రతపఃఫలరూపమగు కవిభట్టారక దేశికేంద్రా ! కారుణ్యసాంద్రా ! దాశరథిసూరీ ! కలుషహారీ ! సర్వసాముద్రిక లక్షణ సమువేత విరాజిత దివ్యస్వరూపా ! తర్క-వేదాంత సంగీత సాహిత్య వాస్తుశాస్త్ర ద్రవిడవేదాది సకల విద్యలను గండూషించిన పండిత కంఠీరవా ! మా వందనములు. ఓ దయామయా ! ప్రేమమూర్తీ ! మమ్మువీడి నిత్యపదవి నలంకరించవలెనను తలంపు త్వర మీకేల కలిగినది ! తండ్రీ ! లోకబాంధవా ! మామీదను ఈలోకముమీదను అతిపవిత్రమగు మీశరీరము నందును వెగటు జనించెనా ? ప్రభూ ! మాతృమూర్తి గర్భమున పితృముఖేరిత పరితంబైన శ్రీరామగాథాసుధయందు నిమజ్జనము గావించి ఆవిర్భవించిన అసమాన, అద్వితీయ మహాపుణ్య పవిత్ర విశిష్టచరిత్ర గలిగినది మీ జన్మము. సురూపయుతమై ఠీవి దర్పము గలిగి వైష్ణవ తేజస్సుతో నయనాభిరామమై పాపహారియై ప్రకాశించు మీదివ్య విగ్రహ దర్శనమును, అమృతరస సమంబగు మాధుర్యము, మేఘగర్జావర గాంభీర్యము, గంగాప్రవాహమునుబోలు వేగము

సహస్రారమువంటి పదును గలిగి మనోజ్ఞమగు మీ దివ్యవాణియు, దయాపరత్వము, నిస్స్వార్థము, నిష్పక్షపాతము, త్రికరణముల ఏకభావము ద్వంద్వములను సమముగానెంచు ధీరత్వము శీలము మొదలగు ఆత్మగుణసంపన్నంబై కుటిలరహితమై, భగవన్నిలయమై స్వచ్ఛమగు శరత్కాలచంద్రికవంటి మీ దివ్యచిత్తమును మాసుకృతము ముగియుటంజేసి అనుభవించు యోగ్యత ఆనందము తీరిపోయెనా. మహాత్మా మీరిటనుండగా లౌకికముగాగాని శాస్త్రపరముగాగాని ఎవరికే శంక గలిగినను సందేహనివృత్తి జేయగల సమర్థవంతమగు సకల విద్యాసారభూతమైన సరస్వతీపీఠము ఒక దొడ్డనిధి మాకు అండయైయున్నది. మాకేమియును గర్వము మన కుటుంబముల వారందరికిని నరనరమున జీర్ణించియుండెడిది. తండ్రీ యిపుడేది అటువంటి దిటవు. దిక్కు. అదియునుగాక చెల్లెండ్రమగు మాయిద్దరిని చిన్ననాటనుండియు అమితముగా గారవించి విశాలమై శాస్త్రనిలయమైన మీహృదయమున ప్రథమమగు స్థానమిచ్చి యింతదనుక ప్రేమాదరణలతో లాలించి, వాత్సల్యజలధి నోలలాడించి యిపుడు ఒక్కసారి మీరు తిరోహితులైతిరే ? ఓ ప్రేమ రసఘనీ! అటువంటి మిమ్ము మరచి ఎట్లు బ్రతుకవలె కాలమునెట్లు తరించవలెను ఓ తండ్రీ సర్వశాస్త్ర పారంగతులగు మీతో అక్షరాస్యతలేని మేము సంభాషింప యోగ్యులమనియూ ఎచ్చటనున్నను పిలిపించి మీసన్నిధిని గూర్చుండ నియోగించి మామాటలను మన్నించి విలువనిచ్చుట మీకు మాయందున్న అనురాగమునకు నిదర్శనముగాని జనసమూహమునకంతటికి భగవద్గాథా ప్రబోధముచేత మేనులు పులకింపజేయు మీకు మా మాటలు సత్కాలక్షేపమా ! మహాత్మా మీ సంభాషణలోని

రసము నాస్వాదించిన మా కేవి రుచింపగలవు తత్సమానమగు
సొంపు స్వారస్యముగలిగి తృప్తినిచ్చునది వేరుగలదా లేదుగదా
మహాత్మా కనులకింపగు మీ రూపము, శ్రవణసుఖంబగు మీవాక్కు
మనస్సును రంజింపజేయు ఉత్తమగుణములు అపార విద్యాప్రాభవము
ఇట్టి లోకోన్నత ప్రతిభలన్నియు రాశీభూతమైనట్లు మీబింబము
నందు నిక్షేపించియున్నాడు దైవము. అందువలననే ప్రతివారికిని
మీయందు భయభక్తులు గౌరవము ప్రేమపూజ్య భావము గలిగి
యుండుటేగాని మాట్లాడింప సాహసించెడి వారుగారు మీరును
మితభాషిత్వమే నెరపుచుండెడివారు. ఓ అన్నా సారస్వతసంపన్నా
ఊహ తెలిసిన నాటనుండియు విద్యావ్యాసంగము శాస్త్రపరిశ్రమ
గ్రంథరచన, దైవచింతన, తండ్రిగారి ఆదేశానుసారము జనులకు
భక్తి జ్ఞాన విద్యలను ప్రబోధించుట మొదలగు లోకోత్తరమగు
కార్యములకే అంకితమై మహాపవిత్రమైనది మీ జీవితము. అట్టి
కల్పవృక్షచ్ఛాయవంటి మీ నీడలో ఆనందమయ లోకములోవలె
సంచరించి సుఖించిన మమ్ము ఒక్కసారిగ మీ వియోగాగ్నియందు
బడద్రోసినాడు దైవము. దుర్భరము, దుస్సహము, దురంతమగు
యీ బాధ క్షణక్షణే గలుగు మానసిక వేదన ఏతన్మాత్రమగునది
గాదుగదా పూతచరితా ఏది దారి పరమహంస తేజోమూర్తి తనువు
ధనము గోపాలదేవుని కర్పించిన వైరాగ్యజలధియగు తండ్రిగారు
పరమాకాశము వేంచేసినప్పుడు మాకింత భరింపశక్యముగాని
దుఃఖము గలుగలేదు ధైర్యముసడలిపోలేదు ఏలనన వారితో సమాన
మగు వారి ప్రతిబింబములున్నవనియు వారు లేనిలోటును పూరించ
గల సమర్థులు నిలిచియున్నారనియు భావించితిమి. మరియు తండ్రి

గారు తమతము పఠించిన రామాయణ మహామహిమంతయు మీ యందు ప్రతిష్ఠించి వారు భారత కాలక్షేపమునకు పయనమై అందరిని ఉద్దేశించి లోకోన్నత ప్రతిభాసంపత్తిగలిగి మిమ్మందరిని ఉద్ధరించగల గొప్ప యుపాధిని మీకు నిలిపియుంటిని. గాన మీకు లోటులేదని గద్గదస్వరముతో దుఃఖము కంఠగతముగాగా అక్కందరిని కడసారి అప్పగించి వారు వెడలిపోయిరి. ఆవిధముగా వారప్ప గించిన బాధ్యతను అమ్మహనీయుని వాక్యమును ఆహా పుణ్యచరితా ఎంత ఉదాత్తమగు రీతిని సఫలీకృతముగావించి నెరవేర్చితిరి అక్కే మేమును భగవంతునిమీదకంటెను ఎక్కువగు భక్తిప్రపత్తులతో మిమ్ము పూజించువారము. మహాత్మా ఆనందనిలయులు పారమార్థిక ప్రబోధకులు అగు మిమ్ము జూచుకొనిన మాకు ఆనందముగా కాలము కరగిపోయినట్లు గడచిపోయినది. ఇంతదనుక మరియు పితృదేవులు ప్రతిష్ఠించిన దేవాలయ కార్యములు బ్రహ్మోత్సవములు భాష్యకార సమాజ పరిపాలన మొదలగు బృహత్కార్యములన్నియు మీరును మీ సహోదరులును బహుధా ఉపబృంహితముగావించి నవ్యకాంతు లుద్దీపింప తీర్చిదిద్దిరి. దేశికేంద్రా ఇట్లు తండ్రిగారు పునాదులిడిన మహత్తర కార్యములన్నియు దీర్చుచు అతిపవిత్రము మహాపుణ్య ఫలప్రదమగు వారి జీవితచరిత్రము వ్రాసి వారు మీకొరకై వ్రాసిన వేదాద్రి నారసింహశతకము వారి ఆదేశానుసారము మీచే రచింప బడిన మదనగోపాలశతకము లోకోపయోగమునకై మీతండ్రికృతు లతుల ఇతర రచనలు కొన్నింటిని అమ్మహాగ్రంథమున నిక్షేపించితిరి. మరియు జగద్విదితంబగు రామగాథను భగవదంతరంగులు వాసుదాస స్వామి తమ దివ్యవాణితో గేయముగా రూపుదిద్దగా పుణ్యపురుష

లగు పాండవపుత్రుల పవిత్ర చరితమును (విష్ణుదాసస్వామిగా) మీరు మనోజ్ఞ మగు సులభ శైలిలో గానముగా వ్రాసియున్నారు. అన్నా ఆత్మగుణసంపన్నా రామచరితమట్లు మహోపయోగముగా పాడుకొన వీలుగా మహితాత్ములు ఆంధ్రవాల్మీకి వ్రాసియున్నారుగదా మరి భారతమును ఎవరును పాట వ్రాసియుండలేదు అందుకు దగిన దక్షత గల మహాకవులు మీరెందుకు వ్రాయగూడదు అని బ్రహ్మవేత్త తనుజాతయగు పరమభాగవతాగ్రగణ్య భగవద్భాగవతాచార్య కైంకర్య ధురీణయు, పుణ్యభాగయు బ్రహ్మోత్సవములలో భక్తకోటి సమారాధనకు మూలతమగు తండులీయము సమృద్ధము గావించు వరదాత పద్యాల వేంకటేశ్వర్లుగారి ధర్మపత్ని, తమకు అనుజాతయగు రామబాణమ్మగారు కోరినంతనే అమ్మా వ్రాయ మందువా మరి వినుపివిగాన భారతమునుగూర్చి అమోఘమగు వాంఛను యాచించితివని ముదమార బలికి మూడవరోజుకే గాన మును పూర్తిజేసి మాకందరికిని వినిపించి ఆశ్చర్యానంద మగ్నమాన సుల గావించితిరి.

అట్లు ముద్రణ వ్యయభారము అనుజాత వహింపగా అతి మనోహరమగు భాషలో వీనులవిందగు బ్రహ్మాదీవెనలు ఆమెకొసంగి కృతార్థత జెందించితిరి. అమ్మహాసీయు లిరువురు వ్రాసిన గేయ, గానములు రెండును లోకోపకారమునకేగాని వారికేమి లాభము ఇంకను చిత్రాంగద మొదలగు నాటకములును, కావ్యకళయను పద్య కావ్యము తొమ్మిది భాగములుగా వ్రాసియుంటిరి. అది నవరసభరిత మగు సువర్ణపాత్రమును బోలియుండునుగాని వేరుగాదు. అతిపిన్న వయస్సునందే యీ రచనలన్నియు గావించి కృతికర్తలైరి. వయఃపరి పాకము రాకయున్నను విద్యాపరిపక్వము సంపూర్ణముగా నుంటంజేసి

ఈ రచనలన్నియు సులభసాధ్యమైనవి. మీకు రెండు దశాబ్దముల
వయస్సు వచ్చుసరికి సమస్తశాస్త్రములు సంగీతసాధన అన్నియు
పూర్తిగావించిరన్న ఆ హయగ్రీవమూర్తి అవతారమో, త్రయీతను
వగు సూర్యుని తేజమో లేక భద్రాచలమున పితృదేవులు రామాయణ
తపంబాచరించు సమయమున జన్మించుటవలన రాముని అంశమో
గాని యింత చిరుప్రాయమందే యిన్ని ప్రతిభలకు ఆలవాలమై
కల్యాణ గుణనిలయము అయివుండుట మానవమాత్రులకు సాధ్య
మగువిషయము కాదుగదా, సన్ననై అతిమనోహర రూపవిభవమగు
నిలువెత్తు మీ విగ్రహము ఫిడేలు వాయిద్యము చేతబూని పరుగు
వంటి మీ గమనము ఇప్పటికిని నా మనోనేత్రమునకు తండ్రీ గోచర
మగుచునేయున్నది, యిరువదిఒకటవ సంవత్సరమునందు తండ్రిగారు
మీకు వివాహము గావించినారుగదా ఇంక నాతరువాత విద్యా
భ్యాసము లేదుగదా. అందువలననే మా చిరంజీవి దాశరథి ఎక్కు
వచ్చిన తరువాత విద్యావిషయమున నా సందేహములన్నియు దీర్చి
నాకు చేదోడువాదోడుగా నిలిచినాడని సహజ పాండిత్యప్రకాండులు
అంతటి తండ్రిగారు వ్రాసికొన్నమాట మీ విద్యాప్రమాణమునకు
గీటురాయి కాగలదు. మరియు నో మహాత్మా మీ జన్మతో పవిత్ర
మైన పుణ్యభూమియగు పూడివాడయందు శ్రీమద్రామాయణ
భారత భాగవతాది పురాణేతిహాసములును, భగవద్గీత ఆచార్యచరిత్ర
మొదలగు వినదగు పుణ్యగాథలన్నియు ప్రవచించి సంపూర్ణముగా
ప్రవచించి గ్రామప్రజలను, భాగవతులను తరుగుల్మలతాదులను
ధన్యత జెందించితిరి, ప్రతిసంవత్సరము భాగవతులున్న గ్రామముల
యందు వర్షాకాలము రామాయణమో భారతమో భాగవతమో
ఒక్కొక్కసంవత్సరము ఒక్కొక్క పూరియందు భాగవతుల కోరిక

మేరకు నిర్ణయించి పురాణకాలక్షేపము జేయుట తండ్రిగారి దగ్గర నుండి వారసత్వముగా వచ్చియున్నది. మీకు అట్లే మీసహోదరులు ముగ్గురు త్రిమూర్తులవలె ఆ కార్యక్రమము అట్లే స్వారస్యముగా ఇంతకాలము కొనసాగించితిరి. ఉదయము భగవద్గీతగాని, ఆచార్య చరిత్రగాని మీరుపన్యసించుచుండ సురభి పరిమళయుక్తమగు పూవులు వెదజల్లినట్లును, పుష్పవృష్టి గురిసినట్లు శ్రోతలు శ్రవణ సౌఖ్యమంది ఆనందపరవశత్వము నొందగా సాయంత్రము మధురాతి మధురముగా రెండవ దేశికేంద్రులు చదువుచుండ పౌరాణికశ్రేష్ఠులు, సురజ్యేష్ఠునిబోలు శ్రీనివాస బుధోత్తములు ఆశుకవిత్వమువలె మనసునందే వాక్యరచన గావించి మధ్యమధ్య పన్నీరు జల్లినట్లు హాస్యరసమును మేళవించి రాగయుక్తముగ ప్రవచించి తీయనగు ఫలముల పంచినట్లు శ్రోతలను ముగ్ధులగావించి సభనే పండించెడివారు. అట్లు మీరు ముగ్గురును బ్రహ్మాసనమున కొలువుదీరి ప్రసంగించు సమయములందు అనుజాతలమగు మేము ఇరువురము అనేకసారులు దర్శించితిమి. ఆచార్య పురుషులు భగవంతుడు, భాగవతుల కలయిక గనుక అట్టి ఆనందము గలిగించునుగాని ఆయానందమునకు ఇతర మేదియు సాటిరాదుగదా, వెగటులేని భగవదానందమన నదియే, హాస్యరసమన నదియే, స్వారస్యమననదియే అట్టి కాలమింకరాదు గదా, అట్లు భాగవతులందరు భగవత్కాలక్షేపము జరుగుచున్న గ్రామమునకు వచ్చి బసలేర్పరచుకొని నలుబదిరోజులు నలుబది నిమేషములుగా ఉదయాస్తమయములు తెలియక గడచిపోగా పట్టాభిషేకానంతరం భగవద్గుణానుభవము ముగియుటకన్నను ఆనందనిలయులు ఆత్మబాంధవులగు గురుదేవుల మిమ్ము విడిచిపోవుట మరీ బాధాకరముగాన భోరున ఏడ్చుచు తిప్పదుగాన ఎవరి నెలవులకు

వారు జేరెడివారు. ఒక్కొక్క సంవత్సరము రెండు గ్రామముల యందును జెప్పిన సమయములు గలవు. ఆ విధముగా పోటీలుబడి భాగవతులు వినవలెనను ఆసక్తితో ముందుకొచ్చెడివారు. అటులనే యిన్ని సంవత్సరములనుండి పుణ్యగాథా కాలక్షేపములు జగన్మోహ నముగా సాగిపోయినవి.

సంవత్సరమువరకు అద్వితీయమగు మీ దివ్యవిగ్రహము వేదిక మీద గూర్చునియుండ మేమును దర్శించి వచ్చితిమి. గాని యింక నాభాగ్య మీసమాజమునకు లేదుగదా. ఆ విథముగా పురాణకాల క్షేపములు నలుబదిరోజులు జెప్పుటయేగాక, రామాయణము, భాగ వతము, గీత మొదలగు పుణ్యగాథలు మూలమగు సంస్కృత శ్లోకములతో మొదలిడి సమయానుకూలముగా రసవత్తరమగు పద్యములు చాటువులు మేళవించి సంగ్రహముగా సప్తాహముగా ముగించునట్లు ఒక వ్యవస్థను మీరు రూపొందించితిరి. అట్లే ఒక సంవత్సరము దివిసీమ మోదుమూడి గ్రామసమాజమువారు వసంత నవరాత్రుల సందర్భముగా మిమ్ము అర్థించి, ప్రార్థించి తీసికొనిపోగా వారి కోరికమేరకు రామాయణ సప్తాహము నిర్వహించిరి. మోదు మూడియనగా తండ్రిగారి దగ్గరనుండి శిష్యులు, బంధువులు వీరాభి మానులు గలిగియున్న గ్రామము. అందున శిష్యులలో అగ్రగణ్యం డును మేనమామయగు పద్యాల కుటుంబయ్యగారు, భార్య బసవ పున్నమ్మగారు మీయందు అత్యంత భక్తిప్రేమలు గలిగి పూజించు పుణ్యదంపతులు. సొంతగృహమువంటి వారి నివాసమేగదా దేశో కేంద్రులకు బస, దివిసీమ భాష్యకార సమాజమువారు గురుదేవు లకు సంబంధించిన ఏ కార్యమైనను శ్రీ కుటుంబయ్యగారిని ముందు

నిలిపి కార్యము పూర్తిగావించెడివారు. అట్లు బ్రహ్మతేజోవిరాజిత మూర్తులగు మీ సహోదరులు జగన్మోహనమగు కంఠములతో సంస్కృతశ్లోకములు చదివి అతి మనోహరమగురీతిని ఉపన్యసించు చుండ ఆ విగ్రహశోభ, ఆ గాత్రముల మధురిమకు వారు చొక్కి దేహేంద్రియములు మరచి ఆనందతన్మయతనొంది ఇమ్మహనీయ సోదరత్రయమునకు ఏమి సన్మానము గావించినయీషన్మాత్రము ఋణ విముక్తులము కాగలమని పెద్దలు కార్యకర్తలు ఆలోచించి గజారోహణ సన్మానముగావించిన కొంత విశేషముగా నుండగలదని తలపోసి అట్లు నిర్ణయించిరి. సామాన్యులకు సాధ్యపడు కార్యముగాదు. గాని వీరు పెద్దపెద్ద భూస్వాములు. ధనవంతులు గనుక తమ తమ పలుకుబడి నుపయోగించి చల్లపల్లి రాజావారి భద్రగజమును రావించి గురుదేవులను పుష్పమాలలతోను, శాలువలతోను సత్కరించి గజరాజు నలంకరించి పైన పల్యంకికయందు ముగురుమూర్తుల నాశీనుల జేసిరంత, గురుచంద్రులకు గజోత్సవ సన్మానమట రండు పోవుదము. చూడని జన్మమేలయని దివిసీమ సమాజమంతయు మహోత్కంఠతో మోదుమూడికి తరలివచ్చినది. గ్రామప్రజ, చుట్టుప్రక్కలగల గ్రామవాసులు నేల యీనినట్లు ఇసుకజల్లిన రాలనట్లు తీర్థప్రజవలె జనసమూహము జేరినది. ఆ విధముగా క్రిక్కిరిసిన జనసమూహము జేయు ఆనందకోలాహలధ్వని, అనేక విధములైన మంగళప్రదమగు వాద్యధ్వనులు, గజేంద్రము జేయు బృంహితధ్వని మిన్నుముట్టి ఆకాశము మారుమ్రోగుచుండ కన్నులవిందుగా పురవీధుల వెంట పాండ్యరాజు విష్ణుచిత్తులవారికి జేసిన చందమున జగజ్జేగీయమానమగు వైభవముతో తిరుపీధి మహోత్సవము పూర్తిగావించి తిరిగివచ్చినంత దేశికేంద్రులు అవరోహింపను వేదండము పండుకొనలేదట అపుడు

అయ్యలారా గురుస్వాములారా యీగజము నామాటనుకూడ ధిక్కరించి మొరాయించుచున్నదిగాని పండుకొనుటలేదు దయచేసి తమరు నిచ్చెన సహాయమున దిగండని మావటి మనవిజేయ అట్లే దిగి బసలోనికరిగి విశ్రాంతిబొందిరి; నాటివైభవము కన్నులజూచిన వారికే గాని వర్ణింపనలవిగాదుగదా తండ్రీ ఆ గ్రామవాసులు ఆ విధముగా మీకు గజారోహణ సన్మానముగావించి జూచి ఆనందించి పులకించి తరించి కృతకృత్యులై ధన్యులైరి; మరి ఇభరాజము కాలువంచుటకు ఇష్టపడలేదనుట పుణ్యపురుషులగు మిమ్మింకను కొంతతడవు మూపున వహింప వాంఛించి యుండుటకారణమైయుండును, తన మూపున వహించిన ఆ మాతంగము జన్మ ధన్యమైనది. మరియు నో ధర్మస్వరూపా అన్యులకు సాధ్యపడక మరుగునబడియున్న ద్రవిడ భాషయగు గోదాచరిత్రము ఆవిష్కరించి ముప్పదిరెండుసంవత్సరములు నిరాఘాటముగా కసివినివెరుగని నూతనశైలితో ఇంపుసొంపులతో హృద్యమగు భాషాపటిమతో లోకోత్తరమగు రీతిని సాధించియున్నారు; ఏమి ఉదాహరణలు, ఏమి విశేషార్థములు, ఏమి ఘట్టములు, ఆహా ఏమీ ఆ శ్రవణేంద్రియానందము రామాయణ, భారత, భాగవత, పాంచరాత్ర భగవద్గీతాది సకల పురాణేతిహాససార సుధయంతయు మీవాక్కుల రూపమున పొంగిపొరలి ప్రవాహమై శ్రోతలను ఆనందమందాకినియందు స్నపనకావింపజేసెడిది వేదవేదాంతములు, శాస్త్రములు ద్రావిడామ్నాయమగు సహస్రగీతి ఇవియన్నియు క్రోడీకరించి ఆత్మగుణములతో పవిత్రీభూతమగు మీ హృదయమను క్షీరాబ్ధియందు మథించగా అతి వేగమున దుముకుచున్న అమృతప్రవాహమా జాతిరత్న సందో

హామా ఏది ఏదైనను సరిబోలదుగాని సృష్టియందు అంతకన్న గొప్ప వస్తువులు లేని కారణమున చెప్పుటయేగాని ఏదియు సమానముగాదు.

పూర్వము భగవదంతరంగులగు నంబిళ్ళ దేశికేంద్రులు ద్రావిడామ్నాయము పాయించుసమయమున వారి వాఙ్మాధురికి ముగ్ధులై పరమపదమునకు బోవ వెనుకాడినారట శ్రోతలు ఆవిధమగు వారిగోష్ఠికి బోలునేమోగాని అంతకన్న ఇతరమగునది చాలదు. అంతియే, తండ్రీ మీ వచించిన తిరుప్పావై విశేషార్థములుగాని, ద్రౌపదీ శరణాగతియందు గోవిందశబ్దానికి వినసొంపగు బహుళార్థములుగాని ఏ గ్రంథములోనివి మున్నెవరును వచించియుండలేదేమి లేదులేదు. మీ మానస సరోవరమునందు ప్రభవించిన అతిమనోహరములగు ఊహాసౌగంధికములుగాని గ్రంథస్థములా, సముద్రములోని లవణజలము మేఘునిగర్భము జేరి తీయనైనట్లు యీ ద్రవిడ ప్రబంధము మీ హృదయము, వాక్కును ఆశ్రయించి ప్రకాశవంతమైనది. ఆ ద్రవిడపాశురములు పాడి చెప్పగలవారు ఎంతమందిగలరు అయినను ఏమిశోభ తిరుప్పావై ప్రబంధమునకు మీరు సలిపిన కృషి మీ చేసిన మహోపన్యాస మహోదధియందు ఒక్క తుంపురకు వెలగట్టి వర్ణించుట అసాధ్యము, మరియు శ్రోతలము, జగన్నాథుండును యీ విషయమై మీకు కొండంత ఋణపడియున్నాము, ఆ ఋణభారము తీర్చగలది తీరునది కాదుగదా లోకమునకు సూర్యచంద్రులు, పంచభూతములు ప్రతిఫలముగోరక ఎట్లు ఉపకరింతురో మీరును అంతియే. గోదాచరిత్రమునకు మహత్తరమగు నాసొంపు నాపాదించి చెప్పవలెనన్న జగత్తున నింకెవరితరమునుగాదు, ఓ ధర్మస్వరూపా మీవాక్కు మీ యుపన్యాసము, మీ విద్యాపాటవము,

తపోనిరతి, శీలసంపత్తి విశదీకరించి వర్ణించుట నిరక్షరకుక్షిని అల్పమతిని అగు నేనా అప్రతిమప్రభావులగు మిమ్ము కీర్తింపబూనుట ఆయ్యో తండ్రీ సిగ్గగుచున్నది. మీాయందున్న భక్తిప్రేమలు, మీావియోగము వలన గలిగిన దుఃఖోద్వేగము ప్రేరించుచుండ సిగ్గులేనితనము వ్రాయుటకు శక్తినిచ్చుచున్నది, విద్యాలేశమేమాత్రమున్నను వ్రాయుటకు సాహసించలేనుగదా అదిలేదుగాన నోటికొచ్చినది వ్రాయుట మాత్రము యదార్థము. మహాత్మా భగవద్గీతకు విశిష్టాద్వైత పరముగా భాష్యము వ్రాయ తలంపుగలిగి శ్రీకారము చుట్టిరిగాని, విద్యాబలమునకు సాటియగు శరీరారోగ్యము లేక అది నెరవేరలేదు భగవదిచ్ఛలేదు గనుకనే అట్లు జరిగినది అయినను ఎన్ని పురాణములు ఎన్ని సప్తాహములు ఎన్ని ఉపన్యాసములు ఎన్ని దివ్యరచనలు దేవాలయ సంబంధమగు కార్యములెన్ని? ఒకటనేమి మహత్తరకార్యములన్నియు నెరవేర్చుచునే రక్తాక్షినామ సంవత్సరము బ్రహ్మోత్సవముతో అనుబంధముగా త్రయీామయ కోటిహవన మహావిష్ణు యాగము జేయవలెనని మీారును మీా సహోదరులును దివ్యచిత్తముల దలంచి నిర్ణయించిరి. అట్లు నిర్ణయించి ఒక్క సంవత్సరకాలము నిద్రాహారములను గణింపక శ్రమించి ఆంధ్రదేశమున పర్యటించి పుణ్యాత్ములగు వుదారులవలన ధనార్జన గావించిరి. ఎంత కలికాలమైనను దాతలు ధర్మవిదులు సత్యవాక్యబద్ధులు పతివ్రతామతల్లులు, జీవనదుల వలె జగత్తున ప్రకాశించుచునే యుందురు. వారికి అభావదశ వచ్చినచో లోకమునకు అట్టిదశయే ప్రాప్తించును. ఆ విధముగా ధనార్జన గావించి మహోన్నత కార్యరంగమున ప్రవేశించి నూటఎనిమిది అగ్నికుండములు నిర్మించి వాటియందు దివ్యాగ్నిని ప్రజ్వాలింపజేసి ఓంకార

యుతమగు అష్టాక్షరీ మహామంత్రరాజము నుచ్చరించు దివ్యధ్వని మిన్నుదాకి ఆకాశము ప్రతిధ్వనింప అన్నదానయంత్రమై చూపరులు ధన్యజీవులగునట్లు తులలేని విభవముగా జగజ్జేగీయమానముగా గణిత నిర్ణయమగు కోటిహావనమును సంపూర్ణము గావించిరి. ఆయాగ సమయమున పూడివాడ విష్ణుసదనమువలె భాసించినదిగదా! యోగి చంద్రులగు తండ్రిగారును తత్సమానులగు మీరును ప్రభవించి నందున జన్మభూమికి తగిన ఉన్నతచరిత్ర గల్పించితిరి. అట్లా మహో న్నత యజ్ఞసమయమున పౌరాణిక ప్రథములు మహనీయులు పెద్దన్న గారు సలక్షణముగా నుంటంజేసి మీ సహోదరులు నలువురు దశర థాత్మజులవలెనుండుటవలన కించిత్తు లోపములేక ఆనందలోకమువలె పరిపూర్ణ సంతృప్తి గలిగియున్నది; మహాకార్యమట్లు పూర్తిగావించి మిగిలిప ధనములో నిస్వార్థముగా ఉత్సవసమయములయందు భాగ వతులు విశ్రమించుటకు దేవాలయ తూర్పుముఖద్వారమున విశాల మగు మంటపనిర్మాణము గావించి నలుబదిరోజులు భాగవతకాల క్షేపము నెరపియున్నారు, అగ్రజులును మీరును నూతన మంటప మున భగవద్విషయము జెప్పెదమని ఎవ్వరు కోరకున్నను వెంటబడి రండురండని ఉదయ సాయంసమయముల ఆచార్యచరిత్ర, భాగ వతము ప్రబోధించుట మీయందున్న పరసమృద్ధిగోరు ఆత్మగుణము నకు తార్కాణముగదా ! ఓ పుణ్యచరితా! మంటపనిర్మాణము తరు వాత ప్రసిద్ధివహించిన దేవాలయములందు ఎక్కడైనను ద్వారపాల కులు ఉండుట సహజము. అటువంటిది మహనీయులగు తండ్రిగారు ప్రతిష్ఠించిన దేవాలయమున ద్వారపాలకులు లేనిలోటు చాలా కన పడుచున్నదనే బాధ దేశికేంద్రులు పెద్దన్నగారి దివ్యచిత్తమునకు

బాధ కల్గించినది. పితృపాదులు ఎన్ని యొడుదుడుకులు బాధలకోర్చి ప్రతిష్ఠ నెరపిరో కాని తనయులగు మీరును శ్రమించి వ్యయప్రయాసలకోర్చి మహాకార్యములెన్నియో పూర్తిచేసిరి. అట్లు దివ్యమూర్తులగు జయవిజయులను వారి సొంతమగు వ్యయప్రయాసలతో స్వహస్తములతో ఆ పుణ్యమూర్తి ప్రతిష్ఠించి యూరుకొనగా రాజ్యలక్ష్మి అమ్మవారు వారి స్వప్నమున సాక్షాత్కరించి "గురూత్తమా ద్వారపాలకులు మీ స్వామికేగాని నాకు నెలకొల్పలేదేమి" అని అడిగినదట. ఆ జగదీశ్వరి నోరు దెరచి యడుగగా యీ దేశికేంద్రు డెట్లు ఊరకుందురు. "అమ్మా యాచించియైనను నీ కైంకర్యము జేయుదునుగాని మానుదునా" యని మొదలిడి విజయవాడలో శిల్పి కొరకు కుమారునితో గూడి కొండపల్లి కొండనెక్కుటకు బయలుదేరగా విపరీతమగు అలసటవచ్చి బాధించినదని యీ విషయము మాకు వారే సెలవిచ్చియున్నారు. ఎందుకొచ్చిన బాధలని యిట్టి మహాత్ములు మానుకొన్న యెడల దేశమునందు దేవాలయములు పుణ్యక్షేత్రములు ఎట్లు నిర్మింపబడియుండును గాన మహాపురుషులెన్నడును ఎన్నిరకముల బాధలు వచ్చినను అధిగమించి భగవత్సంబంధమగు తమ ధ్యేయమును నెరవేర్చుచునేయుందురు. అటులనే శ్రీనివాసబుధోత్తములు అమ్మవారికి ద్వారపాలికల నమర్చుటకు సర్వము సిద్ధపరచిరిగాని వారి పవిత్రహస్తములతో జేయించుకొను అదృష్టము లేక వారు పరంధామ మలంకరించిన వెనుక వారు స్థాపింపబడినారు మరియు మహాత్మా మిమ్ముబోలు మహనీయులు జీవితావధి సత్కార్యములు జేయుచునే యుందురుగాని చాలులెమ్మనిగాని విసుగుజెంది గాని విరమించరుగదా! అట్లే గోపాలుని సన్నిధిని దివ్యులగు ఆళ్వారులు లేమివలన వెలవెలబోవుచున్నదనే భావనము చిత్తములనున్నను

సామాన్యమగు కార్యముగాదని సందేహించి మరల జేయవలెనను తలంపు దృఢమై చేయుటకు నిర్ణయించిరి. ముందు భాష్యకారసమాజమువారు ముఖ్యులుగనుక గురుదేవులు వారితో చెప్పినంతనే సమాజ సభ్యురాండ్రగు దివిసీమ వాసినులు, సుకృతకాంక్షగల యిరువురు సాధ్వీలలామలు తమతమ జన్మలు ధన్యతజెందునట్లు యీ పవిత్ర పుణ్యకార్యోత్పత్తికి కారణభూతులైరి. అందునను మహాపుణ్యభాగ ప్రియబాంధవి మేడిసెట్టి రామప్రసాదమ్మగారను పరమభాగవతురాలు యిమ్మహోత్కృష్ట కార్యమధిరోహించను ప్రథమ సోపానముకాగా, మాదివాడ లక్ష్మీకోటేశ్వరమ్మగారను పరమభక్తాగ్రేసర భగవదాచార్య కైంకర్యముల యందపారమగు అనురక్తిగల యుదారస్వరూపిణి ద్వితీయసోపానమై మహత్తర భక్తిశ్రద్ధలతో విరివిగా తమతమ ద్రవ్యమును సమర్పించి ఆళ్వారుల కైంకర్యమునందు ప్రథమ, ద్వితీయ శ్రేణులనలంకరించిన మేటి నారీశిరోమణులు వీరిద్దరు, ప్రథమ భాగస్వామినియైన రామప్రసాదమ్మగారు భక్తిప్రపత్తులతో ఆళ్వార్ల కైంకర్యము గావించిన తరువాత నిత్యపదవి నలంకరించెను, అట్లు వీరిద్దరు మహోదారముగా ద్రవ్యమొసంగినను ఎట్లు చాలును ?

అదియునుగాక అందరి ద్రవ్యము భగవదర్పణ కావలెగదా మన కుటుంబముల వారందరు భాష్యకార సమాజమువారు ఇతరులగు బహుజనము సజ్జనులు, ఉదారులు పుణ్యమూర్తులు అడిగిన మాత్రమున వీరావేశముతో ఆనందముగా తమ ధనమును భగవదర్పణగా సమర్పించిరి. ఇట్లందరి సహకారముతో సర్వలక్షణయుతమగు శోభాయమానముగా ఆ దివ్యమూర్తుల ప్రతిష్టించి మాన్యుల స్తోత్రములకు పాత్రులైరి. మరియు నోదేశికేంద్రా! ఇంక నొక మహాకార్యము

మీ దివ్య పర్యవేక్షణతో జరుగుటకు మిగిలియున్నట్లు బ్రహ్మోత్సవములు ప్రారంభమై ఏబదివసంతములు నిండిన సందర్భముగా స్వర్ణోత్సవములు చేయవలెనను తలంపు గలిగినది. మహాత్ములకెపుడును మహోత్కృష్టమగు కార్యములు లోకహితముకొరకు జేయతలంపులు గలుగునుగాని స్వార్థమునకుగాని ఇంకొకవిధముగునదిగాని చేయనిశ్చగింపరుగదా! ఆవిధముగా స్వర్ణోత్సవములు బ్రహ్మోత్సవాంతర్గతముగా కోటికుసుమార్చన మహాక్రతువు సేయవలెనని నిర్ణయించిరి, కార్యము సమీపించిన తరువాతనే నిర్ణయము జరిగినది. మహత్తరమగు కార్యము వ్యవనిలేదు. ఎట్లు నెరవేరునోయను శంకతో కార్యరంగమున ప్రవేశించిరి. మహాత్ములు నిస్వార్థముగా సంకల్పించిన కార్యములు సఫలీకృతముగాక వ్యర్థమెట్లగును? అట్లే శిష్యులు, దాతలు, భక్తకోటి విషయము విన్నంతనే తమతమ శక్తిమేరకు ఆర్థికసహాయము బ్రహ్మార్పణముగా సమర్పించిరి. కోటి కుసుమార్చన కుంకుమార్చన మహాఫలప్రదమగు అన్నదానయుతముగా వూహింపని రీతిలో నేత్రపర్వముగా విజయపరంపరతో కోటిపుష్పార్చన మహాక్రతువు సప్తాహము లోపములేని మహావైభవముగా సంపూర్ణము గావించిరి. ఈవిషయమై ఒకమహాత్ముని సత్సంకల్పబలమును భరన్యాసమును, కృషిని సత్యమగు విషయమును కొనియాడవలసియున్నది; రాజన్భూసుర దైవతశ్చ పఠితమ్ రామాయణమ్ పుస్తకమ్ అని 'ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్' అని పెద్దలు ఆనతిచ్చియున్నారు. భరతఖండమున శ్రీరామునికన్న ఆరాధ్యదైవము గాని, శ్రీమద్రామాయణముకన్న లోకోన్నత పవిత్రగ్రంథముగాని లేదనుట అతిశయోక్తి గానేరదు. అట్టి మూలము ఆదికవియగు

వాల్మీకి ప్రోక్తమగు సంస్కృత రామాయణమే ధారకపోషక భాగ్యముగానెంచి నిరంతరము పఠించి దానితోనే కాలము అమూల్యము గావించుకొను పరమహంస పండిత వేంకటాచలపతి గురువరేణ్యులగు చిన్నన్నగారు వారి సంకల్పబలము ప్రోద్బలమువలననే ప్రారంభింపబడినవి కోటికుసుమార్చనకు సమయమాసన్న మైనది. "మితిలేని వ్యయ ప్రయాసలతో గూడియున్న మహాభారమగు కార్యముగదా ! ఎట్లు నిర్వహించగలరు?" అను ప్రశ్న తలెత్తుచున్నను కృష్ణదాస దేశికులు మాత్రము అవరోధములను లెక్కింపక ధీరత్వముతో భారమంతయు దైవమునందు నిక్షేపించి శాపదపి శరాదపి అన్నట్లు చేయవలసినదేనని కార్యరంగమున ప్రవేశించిరి. దివ్యదేశము గావించుట కోటి పుష్పార్చన యీ మహాక్రతువులు రెండును ఆ శాంతమూర్తి సంకల్పబలముతో ప్రారంభింపబడి కృషితో పూర్తిగావింపబడి, నిత్య హవనము బాలభోగాది కైంకర్యములు నేటికిని జరుగుచున్నవి.

మరియు నో మహాత్మా ! మీ కుమారుండును షడాననసముండును పండిత పంచాననుండగు చిరంజీవి వృషాద్రిపతి యీ మహా మహిమాన్విత కార్యములన్నింటను మీ సహోదరులతో సర్వవిధముల సమానముగా కార్యభారము భుజస్కంధముల వహించి యున్నాడు. మరియు తమ పితామహులు మిక్కిలి గారవించి కరుణా రసమున ముంచిన కారణముననే ఆ కవికేసరికి యీ ప్రతిభలన్నియు సొంత మైనవి. విద్యాబలము, మధురరసముగల వాక్కు, తేజస్యుతమగు రూపము, అమృతరసము స్రవింపజేసి గంధర్వగానము ధిక్కరించు గాత్రమధురిమతో శ్లోకముగాని పద్యముగాని పలుకుచుండ ఆ వాక్సుధామధురిమకు పరవశించని శ్రోతలెవరుందురు? అటువంటి కణ్ణ

పేయమగు వాక్కువలననేగదా సభను రంజింపజేసి ఉపన్యాసస్రష్టగా బిరుదనుంది ఖండాంతరములకు యశస్సు వ్యాపించి పరిమళించుట, తాత సంపాదించినది మనుమనికి హక్కుసగదా లోకోక్తి, అట్లే తన పితామహుల ప్రతిభలన్నియు సంక్రమించినవి ఆ ఉపన్యాస చతురానన బిరుదాంకితునకు, ఇట్లా కోటిహవనము, దివ్యదేశముగావించుట, కోటిదళార్చన మొదలగు మహాకార్యములయందు ఏమిచేయవలె? ఎపుడు ఎలా చేయవలెనను ఆలోచనకు తావులేకుండగా బ్రహ్మయంత వారైనను వేలెత్తిచూపు నవకాశము గలుగనీయక, జగన్నాథ రక్షితంబైన నీ జన్మంబునకు భిన్నంబులేదను భీష్మవాక్యము విధమున సకలశాస్త్ర పాండిత్య సమర్థతతో సకలక్రియా కలాపములయందును అన్వయించి కర్తవై పర్యవేక్షించుచు హోతగా ఉద్గాతగా వ్యవహరించి భక్తకోటి హర్షధ్వానములతో పుణ్యాత్ముల దాతల సహకారముతో సజ్జనుల పొగడ్తతో విజయదుందుభులు మ్రోగించి అట్లా మహాకార్యములన్నియు అపార విద్యాసామర్థ్యమును మీ బాహుబలముతో సర్వలక్షణ సమపేతముగా తీర్చిదిద్ది సంపూర్ణముగావించిరి. అట్లా మహాకార్యములన్నియు మీదివ్య హస్తములతో జేయించుకొని సర్వార్థ ఫలప్రదులును, సకల కల్యాణగుణసాగరము, సకల విద్యాసారభూతమగు నిధిని మిమ్మే దోచుకొనిపోయినాడు ఆ నిధిని గోల్పోయినందున శూన్యత్వము గోచరించుచున్నది హే జగన్నాథా ! ఏమిట్లు దయజూపుచున్నావు? దేశికేంద్రుని గొని పోవుటకు ముందు ఎంతపని జేసితివి? యువతీలలామ విదుషి సురూప లావణ్యవతి ప్రేమమయి వీరనారి రుద్రమబోలు తీవి దర్పము ధైర్య సాహసములు గలిగిన మా జనకజాదేవిని పుచ్చలతోటవలెనున్న

యామె కాపురము భిన్నాభిన్నమగునట్లును, సతీసుతులు అనాథలుగా ఏ శుభకార్యమందుగాని ఉత్సవసమయములయందుగాని దేదీప్యమానముగా ప్రకాశించుచు అన్ని విషయములయందు ముఖ్యపాత్ర వహించి ప్రథమశ్రేణియందు విద్యుల్లతవలె దిరుగుచు భాసించుచుండెడి ఆ వీరవైష్ణవిని తల్లికి తీరనివ్యథను, సహోదరులకు తీరని లోటును మిగిల్చి అర్ధాంతరముగా క్షణములో నదృశ్యము గావించి నీలో జేర్చుకొంటివి. ఇదియా నీ దయాసాంద్రత ? ఆమె వియోగ దుఃఖ బాష్పజలము ఆరకముందే మూలభూతమగు మహానిధిని లేవగొట్టితివి! ఆ నిధిని ఎక్కడ దాచిపెట్టితివి? దాశరథి సూరియను మా కల్పభూజమే మైనది ?

సర్వవిధ సంరక్షకమగు అమ్మహాభూతమెక్కడున్నది ?

కాంచినంతనే పాపపరిహారమగు వారి పవిత్ర పుణ్యదేహమెక్కడ ?

పూర్ణచంద్రబింబమును తిరస్కరించగల ఊర్ధ్వపుండ్ర తేజోవిరాజితంబగు వారి సుందర వదనారవిందము కానరాదేమి ?

వేదశాస్త్ర పురాణేతిహాసములు సహస్రగీతి, ఆత్మగుణములతో నిండియుండు సువిశాలమగు అద్దివ్యసూరి హృదయమెక్కడ ?

చక్షువులపాపము అంతమొందించగల స్నానానంతరము సూర్యాంతర్గతుండగు నారాయణునకు అర్ఘ్యమొసంగు వారి శ్రీహస్తములు ఏమాయెను ?

సకల భాష్యకార సమాజసభ్యశిరోవందితంబులగు అప్పరమహంసపాద రాజీవములెక్కడ ?

మొవ్వవంశ పారావారంబున ప్రభవించి జ్ఞానకాంతులు వెదజల్లిన దాశరథి శశాంకుడెక్కడ ?

అయ్యో ! నేనెంతటి మతిభ్రమణాకులోనై దుఃఖాతిశయమున యథార్థమును మరచి అడలుచు విలపించుచుంటిని!

అమ్మహనీయుండు ఎక్కడని? ఏమాయెనని? గురుసార్వభౌముని చేయూతనిచ్చి ఆసనముమీద గూర్చుండబెట్టగా వారు "హరీ ! గోవిందా రామా" అని కడసారిపలికి దివ్యభాషణములను విని "అయ్యో తండ్రీ రాముడనేవాడున్న మిమ్మిట్లు బాధించునే" అనగా నేను గురుచంద్రుడు మారుపలుకలేదు. వారి మౌనమే సమాధానమైనది. అట్లు దగ్గరుండి అమ్మహాత్ముని పాంచభౌతిక తత్వమునకు కలిసమతినై చరమగీతముబాడి ప్రాణోత్క్రమణమంతయు చూచుచునే యుంటిని. అయ్యో! కవిభట్టారక సూర్యుడస్తమించిన వెనుక చీకటి మతిభ్రమణముగాక వెలుతురు ఆనందము ఎక్కడ దొరకును అయ్యో ! ఎంత దుర్భరమగు దుష్టకాలము వచ్చినది అట్లా పుణ్యశ్లోకుండగు మహామహుని దివ్యజ్యోతిస్స్వరూపమగు ఆత్మ చూచుచుండగనే సత్యస్థిరమగు ఉత్తమ ఊర్ధ్వలోకములగూర్చి తరలివెళ్ళినది. అట్లు జరుగగనే సదన సన్నిధియంతయు అవశమగు దుఃఖము పొంగి భోరుమని ఒక్కసారి శోకప్రవాహము సముద్రమైనది. అయ్యో! ఎంతటి తపనీయమయమగు అద్రిరాజమును గోలుపోయితిమి! ఎటువంటి దిక్కరీంద్రము అండ గతించిపోయినది!

సారస్వత సంపత్సమృద్ధంబై శాస్త్రగర్జనతో ఇంతదనుక రక్షగావించిన చిన్మయరూపమగు కవిభట్టారక దివ్యహర్యక్షము ఒక్క

సారి అంతర్ధానమైనదే, అయ్యో! ఎటువంటి అమృతభాండము చేజారి పోయినది ?

సకలవిద్యానిధానమును వాటికామందారద్రుమము కూలి పోయినది.

ఎంత సారస్యయుతమగు రసమయధుని అయ్యో! కాల వాహినియందు కలసిపోయినదా !

దుర్భరము, కర్ణకఠోరము, భయంకరమగు నీవార్త వారిఆత్మ సంతతియగు సమాజము, బాంధవ్యము అధికముగాగల దివిసీమకు ఇంకను అనేకమంది శిష్యులున్న వాడవాడలకు తంతిద్వార పిడుగు వలె జేరినది. అంతవారు కొంతసేపు నిర్వణ్ణతజెంది "అయ్యో! విష్ణుదాసస్వామి పరమపదించినారట! ఇంకేమున్నది? మనకుగతి రక్షకము అట్టి మహనీయులింక దొరకుట కల్లగదా" యని నిద్రాహార వర్జితులై స్త్రీపురుషులగు సమాజమువారు గురుదేవునిగూర్చి వర్ణించుకొనుచు "ఏమీ యీరాత్రి ఎంత పాపకిరాతకపురాత్రి. సర్వలక్షణ సమన్వితులగు దేశికుని మనకు దూరముజేసిన కాళరాత్రి" యని కాలమును నిందజేయుచు ఎటులనో, ఆ నిశగడిపి తెల్లవారిజాము ప్రొద్దెక్కుసరికి సమాజమంతయు సుగ్రీవసేనావాహినివలె పూడివాడకు గదలివచ్చినది; వచ్చి గురుచంద్రుని దివ్యపవిత్ర పుణ్యదేహమును పరివేష్టించి పాదపంకేజముల మీదబడి శిరములు మోదుకొనుచు హాహాకారములతో శోకజ్వాలలు మిన్నుముట్ట "కఠినచిత్తుండవగు నో దైవమా! మా బంగరుకొండను, మా నిధిని మా కల్పకమును ఇంక పది సంవత్సరములు మాకు అనుభవించి తరించు పుణ్యములేకుండ మాకు దూరముజేసి నీవు అపహరించి లాగుకొంటివి. మమ్మింత అన్యాయము

జేసినందువలన నీవేమి లాభముబొందితివి? దిక్కులేక రెక్కలువిరిగిన పక్షులను జేసితివేమి? మమ్ము సర్వవిలక్షణ పరిపూర్ణుండగు ఇటువంటి ఆచార్యపురుషుని మరల చూపగలవా మాకు ? చూపగలవాడవైన యింత ఘోరమునకు పూనుకొనవుగా! ఏదైనను నీకు సాగుచున్న దనియా, యింత ద్రోహమునకు బూనితివిరా ? అమ్మహాత్మునకేమి జరాభారము సంక్రమించినదని యీపని జేసియుంటివిరా? అనేకమంది జీవితములకు వెలుగునింపగల జ్ఞాననిధి గదా నీకిది తగునా యిదేనా గురుదేవులు దయాసముద్రుడని చెప్పిన దానికి నిదర్శన"మని ఆచార్య విరహాగ్నివలన గలిగిన ఆర్తితో కొంతసేపు దైవమును నిష్ఠురములాడిరి. అది వారి గురుభక్తికి నిదర్శనముగాని భగవంతుడు దానిని దోషముగా నెంచుకొనడుగదా! వారిలో కమలమ్మయను నొక భాగవతాగ్రగణ్య "అమ్మా మీరు చూచితిరా? గురుదేవుల శిరస్సు మధ్య భాగమున రూపాయినాణెమంత నల్లని మచ్చ గనపడుచున్నది. బ్రహ్మరంధ్రము ఛేదించుకొని వారి దివ్యాత్మ ప్రయాణించియుండునని మేము తలపోయుచున్నాము. మీరేమందు"రని అడిగినది. అమ్మా ముక్తపురుషులకది సహజము అందునా అసమాన విద్యా, తేజశ్శీల, తపఃప్రభావ సంపన్నులగు గురుదేవుల సంగతి వేరుగా చెప్పవలెనా" యనగా దుఃఖములోనె ఆమె తృప్తిపడినది. జ్ఞానమువలన ఆ పుణ్యవతికి ఆ విషయము గోచరించినది; ఇట్లు భాష్యకార సమాజము, బంధువులు, అభిమానులు అగణిత జనసందోహమంతయు దుఃఖయుతమగు ధ్వనితో పరివేష్టించియుండ ఆ దివ్యదేహమునకు స్నానమాచరింపజేసి ద్వాదశోర్ధ్వపుండ్రములు దీర్చి పట్టుశాలువను వారు ధరించెడి రీతినివలె వాటుగాజేసి గోపాలుడు ధరించిన గజమాలలు

అర్చకస్వాములు వాద్యములతో దీసికొనివచ్చి వారిగళము నందలంక
రించి అశేష జనబాహుళ్యము దర్శించగలందులకు శిబికపై నిలిపిరా
దివ్యపవిత్రమూర్తిని. ఆహా! ఏమి ఆ దివ్య తేజము? భగవద్రామాను
జుల దర్శనమైనట్లు అనుభూతిజెందిరి. కనుల పాపములు బోవ దర్శించి
ఇంక జన్మజన్మలకు యిట్టి మహాత్ముని జూచెడిభాగ్యము దొరకదు.
అని తహతహ ఆర్తి ప్రతివారియందు గోచరించినది. జనసమూహము
అధికమగుటంజేసి గురుచంద్రుని దర్శనము దుర్ఘటమై ఒకరినొకరు
త్రోసుకొని త్రొక్కిసలాట జరిగినది. లోకోన్నత పవిత్రమూర్తి
పరమహంసగాన వారి దర్శనమునకై తపించి తహతహలాడి చివరి
నిమిషమువరకును నురువులుగ్రక్కుచు వచ్చి దర్శించిరిగాని లోక
సామాన్యమగు చైతన్యరహిత శరీరమునుజూడ నెవరు వాంఛింతురు?
అట్లు మహా జనసమూహములో శోకయుతమగు హాహాకారములతో
వాద్యయుతమగు భజనలతో చరమయాత్రా శకటము వెంట భక్తులు
దుఃఖార్తితో పరువులెత్తుచు బోవుచుండ పుణ్యక్షేత్రమున భగవన్
మూర్తుల తిరువీధి యుత్సవముకంటెను అధికతరముగా సాగినది. చరమ
యాత్ర అట్లు సమర్పించిన పవిత్ర పుణ్యదేహము ఆర్తితో కర్పూ
రమువలె హరించి పాపుల దేహములు స్పృశించినందున తనకు పెనవేసు
కొన్న పాపపంకిలమంతయు క్షాళనము గావించుకొని జాతవేదుండు
కృతార్థుడైనాడుగదా శోకమయమగు విలక్షణతతో అంతిమయాత్ర
గడచినది. తరువాత జ్యేష్ఠాగ్రజుల బృందావన సమీపముననే బృందా
వననిర్మాణము గావించిరి కుమారులు. భగవద్విషయమో, తర్కమో,
వ్యాకరణమో ఆ జగన్మాన్య సహోదరులు చర్చ గావించుచున్నట్లుగా
నున్నది. చూచి వినతిగావించి పోవువారికి, తరువాత అశ్వమేధము,
రాజసూయము మొదలగు మహాపుణ్యఫలప్రదముగాను, మహాజనము

సముద్రము ఘూర్ణిల్లినట్లు విచ్చేయు నిరుపమానమగు అన్నదానము
తోను శోకయుతమగు మహావిభవముతోను వారి అద్వితీయ విలక్షణ,
విశిష్టతగల మహావ్యక్తిత్వమునకు సరిపోవునట్లు శ్రాద్ధ మహాయజ్ఞము
పరమపదోత్సవము సర్వవిధ సంపూర్ణముగా జరిగినవి. భగవద్రామా
నుజుల తేజస్సు అనగా ఒకవిషయము గుర్తువచ్చినది, బాంధవ్యము
నందును సమాజమునకు ముఖ్యుండును విద్యాభ్యాసము గావించి
అపార మేధాశక్తితో ఏకసంథాగ్రాహియై గురుదేవు" వాత్సల్య
మును చూరగొన్న ధీమంతుడగు చిరంజీవి ఉషాద్రిపతి "అమ్మా!
భాష్యకారుల తేజస్సు అని అనుచున్నారుగాని మీరు వారిని కించ
పరచుట అనుకోవద్దుగాని యీ వర్తమానకాలమునగాని, పూర్వా
చార్యులకాలమునగాని కవిభట్టారక దేశికేంద్రునివంటి సర్వలక్షణ
యుతమగు సొంపు విశిష్టత, తేజస్సుగల విగ్రహాము లేదని నాభావము.
ఏ గ్రంథముల చిత్రపటములయందును ఇట్టి మహోన్నత విగ్రహము
గానరాలేదని పలుకగా "కుమారా! నీవన్నతరువాత యీ విషయము
యథార్థమని తోచుచున్నది మాకును నీవన్ని గ్రంథములను జూచి
పఠించియున్నావుగనుక అది నీకే అవగతమైనది. అసమానమగు నీ
గురుభక్తి ఏమేరకు గలిగియున్నది యీ నీ వాక్యము సాక్ష్యమిచ్చు
చున్న"దని మేము సంతసించితిమి. హే జగన్నాథా! దేశికేంద్రుని
యింకను కొంతకాలము పుడమిమీద ఎందరికో అండగా నిలిపిన
నీకేమి నష్టము జరిగెడిది? లేక అమ్మహనీయుడు నడచి సంచరించు
భాగ్యము యీ ధరణికి లేదా? సర్వలక్షణ శోభాయమానమగు
భౌతిక దేహమున ఊర్ధ్వపుండ్ర ధారణగావించి తులసిమాలాధరులై,
పసుపుపచ్చని ఉత్తరీయము కటితలంబున గట్టి నీ సన్నిధికివచ్చి
శిరస్సున రెండుచేతులు జోడించి నీకు సమస్కరించు గురుదేవు

ఆ సన్నివేశము, శోభఁజూచు భాగ్యము నీకును మాకును లేదుగదా స్థానికుండగు వేణుగోపాలుని దర్శనముగాని భూలోక వైకుంఠమగు తిరుమలేశుని దర్శనము, భద్రగిరి రామభద్రుని దర్శనము వారువీరన నేల సేతుహిమాద్రి మధ్యమందుగల భగవన్మూర్తులందరిని దర్శించి నను ప్రేమమూర్తి, కరుణారససాగరము, సుమధుర వాగ్ఝరి, మనోజ్ఞమూర్తి. సకలవిద్యా పారిజాతమగు దాశరథి గురుచూడా మణినిగాంచిన ఆనందము, తృప్తి మాకే గలుగును. ఆసుకృతమింక లేదుగదా! ఓ ధర్మస్వరూపా! గురూ! మీ దర్శన స్పర్శన సంభాష ణములకును మాకును తీరిపోయెనా తండ్రీ! పరుష పదజాలముపలికి ఎరుంగని మీ పవిత్రవాక్కు, ఎంత క్లిష్టతమమైనను సత్యము, ధర్మ మార్గమను రాజమార్గమును గూర్చి పయనించవలసినదేగాని ఆధర్మ మార్గమను సందుగొందు లెరుంగని రాజహంస మీ మనస్సు, రూప సంపత్తు, భగవత్తేజము, విద్యా తేజస్సు మూర్తీభవించిన మీ విగ్రహ శోభ, సింహశార్దూల మత్తేభగమనములబోలు మీ గమనము గోవిందరాజస్వామిని తలపింపజేయు మీ శయనము, దూషణభూషణ లను సమముగానెంచు మీ మానస పరిపక్వత యిట్టి మహిమాన్విత లక్షణములన్నియు మీారిటనుండగా మమ్మెంత ఆనందింపజేసెనో, యిపుడు మీ విరహాగ్నివలన అట్టి ప్రతిభలన్నియు తలంపునకువచ్చి మితిలేని దుఃఖమునకు హేతువైనవి, అనన్యసామాన్యములగు మీ త్రికరణములను, మీ విద్యామాహాత్మ్యమును మరచుటయన్న ఏ తన్మాత్రమగు విషయమా తండ్రీ! సత్యస్వరూపా! అనసూయ, దమయంతి, సుమతి మొదలగువారి గణితమున ఎన్నదగి చేపట్టినదాది మిమ్మే పరమదైవముగానెంచి మీ పదకమలముదక్క అన్యమెరుంగని

సాధ్వీశిరోమణి మీ అర్ధాంగి అట్టి మీ చరణ సరోజములకు దూర మైనతరువాత సర్వసౌభాగ్యములకును దూరమేగదా! ఇదివరకు మీరు సలక్షణముగా నుండ ఏమి విభవోన్నతి ఏమి వెలగట్టలేని జీవితము అనుభవించిన ఆమె జీవనసరళి తారుమారై దీనవదనముతో కాలము వెళ్ళదీయుచున్న ఆమె మనోగతమెట్లున్నదో ఎవరికెరుక? వర్ణింప నెవరితరము? ఆమెను అంత ఉన్నతమగు స్థితినుండి యీస్థితికి దెచ్చిన ఆ సర్వేశ్వరునిదే భారము.

మరియు నో మహాత్మా! మీకన్న వేరు దైవముగాని మీ వాక్కుతో సమానమగు వేదముగాని లేదనుభావముతో, సర్వవిధ సంరక్షక సమర్థవంతమగు మీ బాహుచ్ఛాయను ఒదిగియుండి పసి వాండ్రవలె ఫలపుష్ప భరితమగు ఉద్యానవనమున విహరించినట్లును, ఆనందనిలయులు అన్నింటను పరిపూర్ణులు మీరుండుటంజేసి కుమారులైదుగురు ఆ విధముగా సుఖమయజీవితములు గడపిరి ఇంతవరకు. ఇపుడు మీరు లేరన్న నిజము పెనుభూతమువలె వారి మనస్సులను భయపెట్టుచున్నది. ఎంత వైభవముగా ఉన్నత జీవితము లనుభవించుచున్నను మీవంటి ఉదాత్తులు, మహనీయులగు పితృ దేవులుచూసి సంతోషించు భాగ్యము కరవైనపుడు దానికి పరి పూర్ణతలేదుగదా అనేభావము వారిలో పాదుకొనియుండి యింక కొంతకాలము మా తండ్రియను మా నిధిని మాకు దక్కనటుల అనుగ్రహించవలసినదని మ్రొక్కుబడులు, పూజలు, తపములుజేసి నారుగాని జగన్నాథుండు మాత్రము అందులకు ఒప్పు కొనలేదు. అట్లా సహధర్మచారిణి కుమారులు కోడండ్రు సోపాధిక బంధువులవలెగాక మీ విశిష్టతగల ఆత్మసంబంధము పురస్కరించు

కొని తలపోసి భోరున విలపించుచునేయున్నారుగదా, మహాత్మా ! ఎన్ని వివాహములకు, ఎన్ని గృహారంభములకు, ఎన్ని గృహప్రవేశములకు మీ శ్రీహస్తములతో శుభపత్రికలు వ్రాసియున్నారో, అగణితము. ఓ జ్ఞానధునీ! మీరు సిపాకములుగాని అట్టి మీ దివ్య హస్తములతో పౌత్రీపౌత్ర రూపమగు మీ సంతతిలో ఒక్కరికీ ఆ భాగ్యరేఖ లేకుండ జేసినాడు దైవము.

ఓ తండ్రీ! బ్రహ్మోత్సవములు ప్రారంభమై ఏబదిఒక్క సంవత్సరములు గడచిపోయినవి. ఉత్సవమునకే శీర్షప్రాయము కల్యాణము కల్యాణమునకే అలంకారప్రాయమగు శిరోభూషణము మీయుపన్యాసము. అట్టి ఉపన్యాసము ఇన్ని సంవత్సరములు నిరాఘాటముగా సాగినది, ఏబదిరెండవ సంవత్సరమున బ్రహ్మోత్సవము గంగాప్రవాహమువంటి మీ మధుర గంభీరోపన్యాసము, అన్ని ఉత్సవభాగముల యందు అన్వయించి సంచరించు మీ దివ్యవిగ్రహము లేక ఉత్సవము వెలవెలబోవుచు కళాహీనమై నిస్తేజమైనది. దినకరుడులేని పగలువలె, చంద్రుడులేని రాత్రివలె గోచరించును దైవగతి యిట్లు వచ్చినది. ఓ పుణ్యస్వరూపా! మీరు లేరను నిజము క్షణక్షణే నా మనస్సును క్షోభింపజేయగా రుధిరము మరగుచున్నది.

జననీ రాధమాంబ! ఒక అప్రతిమప్రభావ తపస్సంపన్నుండగు బ్రహ్మవేత్తకు అర్ధాంగివై పుణ్యము నీగర్భమున మొలకలెత్తగా భరతమాత గర్వించదగిన సుతచతుష్టయమును చల్లని గర్భమందు గాంచిన అదితిదేవినిబోలు సుకృత దేవతవునీవు లేకున్న అట్టిభర్తయు యిటువంటి కుమారులు ఎవరికి లభింతురు తల్లీ ! ఏమి నీభాగ్య పరి

పాకము! ఒకతల్లి సంతతియందు ఒకరు పండితుడైన అదే గొప్ప విషయము. అటువంటిది ముప్వురుపండితులు శీలసంపన్నులు, భగవదే కాంతులగుట ఆపుణ్య విశేషము నీదేగదా! అట్టి పరమహంసలగు కుమారులు ముప్వురును జనులకు జ్ఞానభక్తి ప్రబోధముచేయుట పురాణకాలక్షేపములు నెరపుటకై కొంతకాలము గ్రామాంతరముల వసియించెడివారు. అట్టి సమయములయందు మహనీయుండగు నీ నాల్గవకుమారుడు కర్మయోగులగు అగ్రజుల గృహసీమలు, పంట భూముల పర్యవేక్షణ, రక్షణభారము వారు అప్పగించగా, దక్షతతో శ్రద్ధతో అగ్రజుల యాజ్ఞను శిరసావహించి నిర్వర్తించి భక్తిప్రేమలు చాటుకొనగా వారును అనుజునియందు అపారమగు వాత్సల్యము గురిపించెడివారు. అట్లు అతి సాంద్రతరమగు సౌభ్రాతృత్వము ఆ సహోదరులయందు గానుపించెడిది, ఆనాటనుండి యీనాటివరకు ఎన్నోవిధములగు అవసరములదీర్చుచు యోగక్షేమముల జూచుచు, ప్రేమాదరణలను పంచుచు కష్టసుఖములయందు పాలుపంచుకొనుచు మాబోంట్ల మనస్సులందు ఉన్నతమగు స్థానమును స్థిరపరచుకొన్న ఉదారమూర్తియగు సత్యగుణసంపన్నుండుగదా నీ కనిష్ఠకుమారుం డగు రామప్రసాదు గురువరేణ్యుడు? తల్లీ ఇద్దరు కుమారులు మరియు పౌత్రుడు తమతమ కృతులయందు నుతులుసల్పగా అందుకొన్న మహిళాలోకమునకే మణికిరీటమువంటి నీకు సమానులెవరుగలరు? పండితపత్నివై, పండితమాతవై, పండిత పితామహివైన ఓ సవిత్రీ నీకు వందనములు, గోపకిశోరమగు శ్రీకృష్ణునియందు నామనసుల యుంచినదని ఒక మహనీయుండును, తరుణేందు శేఖరునియందు

నా చిత్తము ఏకీభవించినదని మరియొక యోగిపుంగవుడును తమ తమ రచనలయందు జెప్పుకొన్నట్లు గురుదేవులు సెలవిచ్చియున్నారు. మరి నాకు అట్లుగాక దాశరథీ గురూత్తమన్ అని ఆస్మగుణనిధియగు అమ్మహాసీయునియందు ప్రయత్నములేకనే హత్తుకొనిన చిత్తము అన్యథా తిరుగుటలేదు. సర్వావస్థలయందు ఆ ధర్మమూర్తియందే నిలిచి చింతతో గూడుకొన్న ధ్యానమునందు నిమగ్నమై పోవుచున్నది. పైనజెప్పిన ఉపమానము ఆ భగవన్మూర్తులతో గురుచంద్రునికే పరిమితముగాని ఆ యోగిపుంగవులతో నాకు ఉపమానమా? లేదు లేదు, పెట్టుకొనలేదు.

"ఓ పక్షీ జటాయువు నా సత్యముచేత జయింపబడిన ఉత్తమోత్తమలోకమునకు బోవలసిన"దని పక్షిరాజును శ్రీరాముడు ఆదేశించినట్లు "ఓ అగ్రజా! మీ సకలశీల సుగుణ తపఃప్రభావమరు ఆత్మశక్తితో యీషణ్మాత్రము దుఃఖోపశమనము గలుగునట్లు మీ ఆత్మగుణములను సముద్రమందు మాకును ఒక తుంపుర అలవడునట్లును అనుగ్రహింపుము తండ్రీ! దయామయా! సకలవిధ లక్షణ సమన్విత పరిపూర్ణతగల దేశిక శిఖామణివైన నీ తలపులకంటెను ఆ శ్రీహరి తలంపులు నన్ను తరింపజేయుననిగాదు మీరులేని బాధ మనస్సును దహించుచుండ సహింపలేక కొంచెము శాంతింపజేయుమని వేడుకొనుచుంటిని తండ్రీ కారుణ్యశరధీ, దాశరథిసూరీ దురితహారీ, పుణ్యస్వరూపా, జ్ఞానరూపా, ధర్మస్వరూపా, సత్వగుణరూపా, కవిభట్టారక విష్ణుదాస గురుచంద్రా! నమశ్శతము లివియె గ్రహింపుము తండ్రీ! శ్రీరామచంద్రుడు ఊతసహాయమునకు సంతోషించినట్లు మీరును

అట్లే దీనిని గ్రహింపుడు, సూర్యతేజము అస్తాద్రి కరిగినది ఒక ధ్రువతార క్రుంకిపోయినది, ఒక అఖండజ్యోతి స్వరూపము ఊర్ధ్వ లోకముల కెగసిపోయినది.

హే జగన్నాథా! ఇటువంటి సర్వవిధలక్షణ సమన్విత అప్రతిమప్రభావ సంపన్నుండును మరపురాని నిరుపమాన విశిష్ట వ్యక్తిత్వముగల మహామహులని మరల లోకమున సృజించవలెనన్న నీ సర్వజ్ఞత్వము సర్వశక్తిత్వము జోడించి కలశాబ్ధియందు శయనించి యోగనిద్రాసక్తియందు నీవెంత యోచించి కృషిసలిపినను నీకు తరముగాదు, మరియు తపోనిధి వైరాగ్యజలధి వైశిష్ట్యము గల సహజ పాండితీ ప్రభృతి ప్రతిభానిధియు యిట్టి పరమోత్కృష్ట మహనీయు నికి జన్మనిచ్చు యోగ్యత అధికారముగల కారణజన్ముడగు నాతండ్రి వంటి మహావ్యక్తి లభింపవలె ముందు తరువాత విషయముగద! యిటు వంటి మహాభాగుండు జన్మించునవకాశము గలుగుట మరి ఎంత దుర్ల భము, దుస్సాధ్యము, కాలము బ్రహ్మస్వరూపమన్నారు పెద్దలు. అటువంటి కాలము అంధకార బంధురమగు మలుపు దిరిగినట్లున్నది. ఊహ తెలిసిన నాటనుండియు విష్ణుదాస గురుశేఖరుని దర్శన స్పర్శన సంభాషణములను అమృతభాను కిరణముల నాస్వాదంతో గడపిన కాలము వారులేక ఎంత నిస్సారముగానున్నది. ఎటులనైనను కాలము తరింపవలెగదా! ఎంత శిరము మోదుకొని దుఃఖించినను సర్వలక్షణ లక్షిత శోభాయమానమగు అమ్మహాత్ముని రూపము గానవచ్చునా? దివ్యభాషణములు వినవగునా? అట్టి ప్రాప్తి అంతరించినదిగదా, విద్యాపటిమ లేకయున్నను వారియందున్న భక్తిప్రేమలతో శక్తి మేరకు అసదృశరూప గుణవిద్యాశీల తపఃప్రభావ సంపన్నుండును

మహనీయుండగు పరమహంసను స్మృతిరూపమున కొనియాడి జిహ్వ గ్రమా ! పావనత్వము నొందితివి, దాశరథిసూరి దేశికేంద్రునకు నాయందున్న మితిలేని అనురాగమునకు ప్రతిబింబమే వారి యీ దివ్యస్మృతి దీనినిగురించి ఎవరి మనస్సునుబట్టి హృదయ వైశాల్యమును బట్టి తమతమ ప్రవృత్తికి అనుగుణముగా ఎవరెన్ని విధములుగా భావించినను ఆ మహాపురుషునియందు యథార్థము స్థిరమగునది యిదియే నా మనోభావము సత్యమగుదానికి రెండవ స్వరూపము ఉండదుగదా !

దుఃఖాతిశయమున భావమందు దోచిన వాక్యములను వ్రాయు చుండ పండిత కంఠీరవమగు సారస్వతమూర్తి మాజామాత చిరంజీవి వృషాద్రిపతివచ్చి విని అక్కా నీనోటికి వచ్చినది నీయిష్టమువచ్చిన రీతి వ్రాయి. నీకెందుకు నేనున్నాను సరిజేసుకొనను. తాతగారి రక్త కణములు నీలోనున్న కారణముననో లేక మా పినతండ్రిగారే నీతో వ్రాయించుచున్నారోగాని ధార చాలా బాగున్నదని అంతటి కవి బ్రహ్మ అక్షరశూన్యనగు నాకు ఆ ఉన్నతి నాపాదించి పొగడుట తన పెద్దమనస్సునకు, సౌలభ్యమునకు సాంకేతముగాని నిజముగా నాయందు అట్టి ఘనత లేదుగదా! ఒక బ్రహ్మవేత్తగర్భ సంజాతనగు విశేషము మాత్రము యథార్థము, భగవంతుండని భాష్యకార సమాజమని విశిష్టాద్వైత సిద్ధాంతమని తెలిపి యీ వ్యవస్థకు మూల భూతులగు పితృదేవులు వేంకట దేశికేంద్రులకు, పుణ్యగర్భయగు మాతృదేవికి, మహనీయ శ్రీనివాసబుధోత్తములకు రుక్మిణీ, సత్య భామ, రాజ్యలక్ష్మి హనుమ, వైనతేయ, ఆండాళ్, ఆళ్వార్లసహితుం

డును జగన్నాథుండగు వేణుగోపాల దేవునకు, యీ వ్రాసిన కవి భట్టారకుల దివ్యస్మృతియందున్న వాగ్దోషములన్నింటిని క్షమాగుణ సంపత్తితో భోగ్యములుగా నెంచుకొనవలసినదిగా అందరిని ప్రార్థించి నమశ్శతములు గావించి సెలవు నర్థించుచుంటిని.

భగవద్భాగవతాచార్య పాదరేణువు
తన్నీరు కమలాదేవి

శ్రీ వేంకట గురుభ్యోనమః

శ్రీ శ్రీనివాస గురుభ్యోనమః

శ్రీ విష్ణుదాస గురుచంద్రులు తిరుప్పావై కాలక్షేపమును సాయించిన సమయమున వారిపాద సారసముల సన్నిధికి అనుజాతలు సమర్పించిన నమో వాక్ప్రసూనగుచ్ఛము - 14-1-1992.

అన్నా! కవిభట్టారక దేశికేంద్రా! నమస్కృతులు. మహాత్మా! ఈ ధనుస్సు నెలరోజులనుండియు అమృతధారలవంటి మీ వాక్యములతో భగవదానందమున నోలలాడి పాపతాపములను శమించుకొని ఆత్మలు సుఖించి శాంతిని బొందినవి.

తిరుప్పావై పాశురములు ఎంత పాండిత్యము ఎట్టి వాక్పాటవముగల సమర్థులు పాడినను, విశేషార్థ సహితముగా వచించినను ఇట్టి ఆనందము కలుగనేరదు. ఏమి! మీ ప్రవచించు నూతనమహాశైలి? ఏమి వాచాశోభ? ఏమి మాధుర్యము? ఏమి గాంభీర్యము? ఏమి విశదీకరించు విపులశక్తి? సర్వలక్షణ సమన్వితమైన మీవాక్కు ఈ మహాప్రబంధమునకే వన్నెబెట్టినది. అపార పాండిత్యమునకు తోడు, అతిపవిత్రము భగవన్నిలయమగు మీహృదయమున బయలుదేరి, వియన్నదీ ప్రవాహమువలె మధుర గంభీరయుతమై పాపహారిణియై మనోహర్యమై శ్రోతలను దేహేంద్రియములను మరపించుచున్నది.

మహాత్మా! భగవదంతరంగులు నంబిళ్ళగారు పూర్వము సహస్రగీతి నుపన్యసించునపుడు జీవులు మోక్షమున కేగుటకు నిరాకరించిరట. అట్టి యానందమిపుడు మీ గోష్ఠియందు కన్పించుచున్నది. ఇట్టి మహోపన్యాసము పూర్వాచార్యుల అనంతరము లోకమున

లేనేలేదని మా ప్రత్యయము. ఈ విషయమును అసూయారహితులైన విజ్ఞులెవ్వరైనను మా భావముతో నేకీభవింతురు. భగవద్విషయమును చెప్పెదను రండని పిలిచి, అద్వితీయమగు మీ వాగ్ధాటితో మనస్సులకు వెగటులేని యానందమును కలిగించుటవలన ముప్పదిరోజులును, ముప్పది నిమేషములుగా గడచిపోయినవి.

మీరట్లొనరించుట లోకప్రయోజనము కొఱకే కదా ! మీ వంటి మహాపురుషుల కద్ది సహజసిద్ధమగు స్వభావము. తమ మేలు కొఱకు ఇతరులను బలిచేయుట, నిర్నిమిత్తముగా పరులకు హాని కలిగించుటను రెండును నీచులకు స్వభావసిద్ధములు.

మహానుభావా ! స్వార్థము - ద్రోహచింతనము మొదలగు దుష్టగుణములతో భ్రష్టత్వమును పొందియున్న యీ సమాజమున మిమ్మువంటి పరిశుద్ధాంతరంగులను కొనియాడిన పాపనిరతి శమించును కాదె !

మహాత్మా ! చిన్ననాటనుండియు సహజాతలమగు మా యిద్దరిని కడుంగడు గౌరవించి మీ వాత్సల్య వారాన్నిధివీచీ చయము నందోలలాడించితిరి.

మా యిరువురియందును కనిష్ఠయగు చి॥సౌ॥ తన్నీరు కమలాదేవి విధివశమున భర్తృవిహీనయై చిరుప్రాయము దిక్కుతోచనీయక, నోరెరుంగని ముగ్గురు పసిబిడ్డలతో దుస్సహంబైన కష్టసాగరమున స్థానము దొరకక, దిక్కుతోపక ఉక్కిరిబిక్కిరియై యూపిరాడక ఉబ్బుగుడుచుచు ప్రాణాంతకస్థితిలో నున్నది. అట్టివేళ తమరు ఆమెను దరికి చేర్చుకొని "అమ్మా ! దుఃఖపడబోకు. విధి బలీయము అపరి

హార్యమగు విషయమునుగురించి ఎంత చింతించినను ప్రయోజనము శూన్యముకదా ! చిన్ననాటినుండియు మేము చేసిన జ్ఞానబోధ ఈ సమయమున నీకు ఉపయోగించునుగాక. ఊరటనందుము.” అని ఓదార్చి పాపపంకమగు ఊబవంటి స్థానమునుండి, మకరిబారినుండి కరీంద్రుని దరిజేర్చినట్లు ఆమెను, ఆమెబిడ్డలు మువ్వురు చిరంజీవులను మీ శ్రీహస్తములతో చేదుకొని, ఆనందనిలయము పుణ్యతీర్థము వంటి మీ సన్నిధికి చేర్చుకొన్న శ్రీవిష్ణుస్వరూపులు మీరు. అట్లు ప్రాణదానము గావించిన విషయమామె తనమనస్సులందణువణువున నిండి నిబిడీకృతమైయుండ మీకు విధేయురాలై యుండుటకాక, ఆమె మీకు ప్రతికృతి యేమిచేయగలదు ? మహోపకారమును చేయుచున్న లోకబాంధవునకు, ఈలోకము తిరిగి యేమిచ్చుచున్నది? అట్లే ఆమెయు కృతజ్ఞతాభారముతో నొక్క నమస్కారము చేయుచున్నది.

ఓ పరిపూర్ణ తపఃఫలా! నంద తపఃఫలమని పోతనామాత్యులు సాయించినట్లు పరమహంసలగు తండ్రిగారు పఠించిన రామగాథా సుధారస సారమంతయు మీ మూర్తిగా రూపుదిద్దుకొనినది. వారు అట్టి మిమ్ము మాకు రక్షగా నిలిపి పరమాకాశమునకు వేంచేసిరి. కాక మీవంటి కుమారులెవ్వరికైన జన్మింతురా !

తండ్రీ ! సకల విద్యలకు పుట్టినిల్లగు శారదాంబ మీ స్వరూపము. నిరుపమాన బ్రహ్మవర్చస్సు మీ సంపద. మృదుమధుర మేఘగర్జాసదృశ కంఠనాదము మీ సొంతము. దయ - పరహితరతి-ధర్మనిరతి - సత్యసంపద, నిస్స్వార్థము శీలము - ఇంద్రియనియమము

నిష్కామసిద్ధి మొదలగు దైవగుణంబులు మీ సొత్తు. కల్లకౌటిల్యము లేని శరత్కాల పూర్ణరాకాశశిబింబమువంటి స్వచ్ఛమగు మనస్సు మీ సొత్తు. ఇట్టి మహోన్నత లక్షణములు గలిగియున్న పరిపూర్ణులగు మీకు సహజాతలమై మేము చరితార్థులమైతిమి. మా పుట్టుక రెండువిధములగు సుకృతి భాజనమైనది. ఒక బ్రహ్మవేత్త గర్భసంజాతలమగుటయొకటి. మీరుదయించిన ఉదరమందుండి మేము జనించుట మరియొక పుణ్యవిశేషము. "కవిః కరోతి కావ్యాని-లాలనాదుత్తమోజనాః - తరుః ప్రసూతి పుష్పాణి - మరుద్వహతి సౌరభః" అనునది మా విషయమున సత్యముకదా !

ఓ దయామయా ! మా విద్యాగంధమేపాటిదో మీ రెరుంగనిదికాదు. మాయీ వాక్యములు దోషభూయిష్ఠములని మాకును తెలియును. కాని మీయందున్న అతిలోకోత్తర భక్తిప్రేమలు మమ్మిట్లు వ్రాయ ప్రోత్సహించినవి. మా వాగ్దోషములు భోగ్యములుగా లాలించి గారవించి క్షమింపగలందులకు వినతులు గావించుచున్నాము.

ఈ విధముగనే తిరుప్పావై కాలక్షేపములు, పురాణేతిహాసములు ప్రవచించుచు, ఆత్మలకు జ్ఞానకాంతులను ప్రసాదించి తరింపచేయుచు తండ్రిగారి ఆదేశము నిర్వర్తించుచు నూటనూరు సంవత్సరములు వర్ధిల్లవలెనని భగవత్సన్నిధిని మా ఆకాంక్ష తెలుపుకొనుచున్నాము.

ఏ మహాదేవి చరిత్ర మీవాక్కు నాశ్రయించి ప్రకాశించుచున్నదో అట్టిజనని ఆండాళును రుక్మిణీ సత్యభామా రాజ్యలక్ష్మి

హనుమన్వైనతేయ సహితుండును జగన్నాథుండగు వేణుగోపాల దేవుండు మీ శారీరక బాధలు మానసిక దుగ్మాశలను తీసివైచి సంపూర్ణాయురారోగ్యముల నిచ్చి రక్షింపవలసినదిగా శ్రీశుని ప్రార్థించుచు, మీపాద జలపాతములకు మరియొకమారు నమస్కరించి సెలవు సర్థించుచున్నాము.

సర్వేజనాస్సుఖినోభవంతు
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఇట్లు
విన్నవించు విధేయురాండ్రు
పద్యాల రామబాణమ్మ
తన్నీరు కమలాదేవి

శ్రీమతేరామానుజాయనమః

శ్రీవేంకట గురుభ్యోనమః

14-11-1985 వ సంవత్సరము గురుదేవులు ముప్వురును భాగవతకాలక్షేపమును నిర్వహించినకాలమున వారి పదపంకజములకు ప్రణతులు.

తండ్రీ ! వేంకటదాస దేశిక సార్వభౌమా ! అజ్ఞానతమఃపటల నీరేజబంధూ ! కారుణ్యసింధూ ! నమోవాకములు. ఈ భయంకర కలికాలమున పాపపంకిలమై అంధకార సమావృతమై అధర్మకంటక సంకటంబైయున్న యీ భూమియందు మీరవతరించి, మూఢత్వ దుర్గమకాంతారమును మీజ్ఞాన కుఠారముచే ఛేదించి ధర్మమార్గమును సుగమము కావించి జ్ఞానజ్యోతిని చేబూని, నరకగాములగుచున్న బద్ధచేతనులను, జ్ఞానకుసుమ మార్గమున నడిపించితిరి. సామాన్యులను సైతము భగవదభిముఖుల గావించితిరి. భాష్యకార సమాజమును స్థాపించితిరి. శ్రీరాజ్యలక్ష్మి వేణుగోపాలయ దేవాలయమును నిర్మించితిరి. జ్ఞానసూర్యోదయాద్యనేక భక్తిరస గ్రంథములను రచించితిరి. తద్బోధనములచే పండితపామరుల నుద్ధరించితిరి. భగవద్దివ్యజీవనమును రామాంకితము చేసితిరి.

మీరు ప్రాకృత దేహమునువీడి పరంధామమున కేగునపుడు మీ దివ్యతేజస్సును నాల్గుభాగములుగా పుత్రాకృతిని ప్రజ్వలింప చేసితిరి. మీ తదుపరి కుమారులను భాగవతుల కండదండగా నిలిపి మీరు నిష్క్రమించితిరి. మీచే ప్రారంభింపబడి మీ అమృతహస్తములమీదుగా జరిగిన బ్రహ్మోత్సవములు, మీకుమారులు చేబూని, సర్వతోముఖాభివృద్ధిని సంతరించిరి. మీకుమారులు మితిలేని వ్యయ

ప్రయాసములకోర్చి విష్ణుయాగము నొనరించి, తచ్ఛేషధనముతో దేవాలయ ముఖమంటపము నిర్మించిరి.

అంతట నూరకుండిరా ? భాగవత కాలక్షేపమును గావించె దము రండు - రండని భాగవతుల నాహ్వానించిరి. ఊరిప్రజల వెంట బడి భగవద్గుణానభవమును చేయించిరి. నిస్స్వార్థముగా మహాత్ములు సమాజసేవ కావింతురనుట నింతకన్న నిదర్శన మేమి కావలెను ?

రెండవ అన్నగారు సుధాప్రవాహముగా పద్యమును చదువ గనే పెద్దన్నగారు రమ్యాతిరమ్యముగా, అమృతభోజనముగా తత్ప దార్థ భావములను వాక్యరూపమున శ్రోతల కన్నులకు కట్టునట్లు గాంగఝరీ సదృశముగా నుపన్యసించిరి.

భగవచ్చరితమునకన్నను మిన్నయగు ఆచార్య చరిత్రమును సుధాసింధువునుబోలె మూడవ అన్నగారుపన్యసించిరి. వానిని విను చున్నంతసేపును అనాథ భవతాపముల శాంతింపచేసి, సర్వేంద్రి యములకు శాంతి లభించినది.

ఒకపర్యాయము భారతమును, నింకొకసారి రామాయణమును, మరొకపరి భాగవతమును ప్రవచించి గ్రామప్రజలను కృతార్థులను గావించిరి. వారుకావించిన ఆధ్యాత్మిక జ్ఞానబోధకు ధర్మకుసుమము లతో నభిషేకించినను ఋణము తీరునదికాదు. ఇట్లనేక పురాణకాల క్షేపములు కావించుచు, దేవాలయ కార్యములు తీర్చుచు, సంపూ ర్ణాయురారోగ్యములుకల్గి వర్ధిల్లునట్లు తండ్రిగారి తపశ్శక్తి ఫలముగా చేకూరి రక్షించుగాక.

ఓ మహామహాత్ములారా ! గురుదేవులారా! అగ్రజులారా!

పాండిత్యము కవిత్వము, భగవన్నిష వాక్పటిమ బోధనాశక్తి తేజస్సు గల అప్రతిమ ప్రతిభాప్రభావులు పితృదేవులు శాంతి దాంతి శుచి, శీలము క్షమ మొదలగు ఆత్మగుణములు కలవారు. ఆ లక్షణము లన్నియు నిప్పటి గురుదేవుల నాశ్రయించినవి.

అట్టి లోకోత్తరచరిత్రులైన తండ్రి, అంతటి మహాశయులగు అగ్రజులను సంపదను పరిపూర్ణముగా పొందినవారము మేము. ఏదో ఆనందపారవశ్యమున నాల్గువాక్యములు వ్రాయబూనితిని. విద్యాగంధమధికముగా లేనికారణమున నా దోసంగులను పనివాని వచ్చియు రాని తొక్కుపలుకులుగా మన్నించి యనుగ్రహింతురుగాక.

శ్రీ శ్రియఃపతులకు, అగ్రజుల పాదపద్మములకు, సభాసదు లందఱకును సుమనస్సుమాంజలుల నర్పించుచు విరమించుచుంటిని.

భాగవత పాదరేణువు
తన్నీరు కమలాదేవి

గురుమహారాజ గురుమహారాజ వేంకటాఖ్య సద్గురుమహారాజ

1 కరుణా రసభర కలితేక్షణములు నిరతము మాపై గురియుము
స్వామి ॥గురు॥

2 చీకటిమునిగిన చేతనులకు హరిలోకద్వారము మైకొని తెరచిన
॥గురు॥

3 భగవత్పదయుగ భజనములోవి
సుగుణము దెల్పిన సూరిజనాగ్రణి ॥గురు॥

4 ఓపిపూర్వమున నొనరించిన మా
పాపములెల్లను భస్మము జేయు ॥గురు॥

5 మలినములగు మా మానసభూముల
బలువుగనిల్పుము భక్తిజ్యోతి ॥గురు॥

6 జీవితమంతయు శ్రీశార్పితమును
గావించిన యో కలుషవిరోధి ॥గురు॥

7 హరిపదవాటికి గురుతిచ్చిన మీ
చరణ యుగళమే శరణము మాకు ॥గురు॥

8 పొనరగ నీ యిల పూడివాడలో
జననంబొందిన సన్మునిచంద్ర ॥గురు॥

9 విమలతపంబున విష్ణుదాసుని
శ్రమపడిబ్రోచిన జగదాచార్య ॥గురు॥

గురుమహారాజ గురుమహారాజ వేంకటాఖ్య సద్గురుమహారాజ
కరుణారస భరకలితేక్షణములు నిరతము మాపై గురియుము
స్వామి

మా గురుదేవులు మహిమాన్వితులని
మా గురుచంద్రులు జ్ఞానరూపులని
అజ్ఞులబ్రోవగ అపతరించిరని
అఖిలాండంబుల చాటుదమా
అందరియెడల మీటుదమా
అజ్ఞతిమిరములు అలమిన వేళ
జ్ఞానకిరణములు ప్రసరించుటకై
సంసారాబ్ధితరంగ డోలికల
సుడివడు జనులనుద్ధరించుటకు
మహిమాన్వితులు అవతరించిరని
కోటిగొంతుకల చాటుదమా
మేటి మోదమున ఆడుదమా ॥మా గురు॥

ఘనపురాణ కథలన్నియు దెలిపి
భగవత్తత్వ విధానము నేర్పి
శిష్యసంతతిని దయ వీక్షించెడి
శ్రీనివాస పెరుమాళ్ళు గురూత్తము
పరమ మహాత్వము నుగ్గడింతుమా
పాదపద్మముల మ్రొక్కియుందుమా ॥మా గురు॥

నిత్యము భగవత్కైంకర్యంబును
నెరపుచుండుడని ప్రబోధించుచు
ఛాత్రసంతతుల నేలెడి వేంకటాచలపతి
గురుచంద్రుల గొప్పతనంబును దలచుకొందుమా
చరణపద్మములు గొలిచియుందుమా ॥మా గురు॥

వేదాంతార్థము విపుల మొసర్చి
వీనులవిందుగ భగవద్విషయము
గరపుచు శిష్యుల సంరక్షించెడి
కవిభట్టారక విష్ణుదాస గురు
దేవుల తత్త్వము ప్రస్తుతించుమా
వారిపదద్వయ మాశ్రయింతుమా ॥మాగురు॥

పూడివాడ పురమందున వెలసిన
గోపబాలకుని కూర్మిపదంబులు గొలిచియుండుమా
మాగురుదేవులు మహిమాన్వితులని మాగురుచంద్రులు
జ్ఞానరూపులని

1) జనులార శ్రీరామ జయరామ రఘురామ రామశౌరియని
పలుకుడీమాటా

2) ఘనశాస్త్రములనెల్ల గాలించినను దీనికంటె లేదిక
మంచిబాటా ॥జను॥

3) తేప తేపకు బుద్ధి దిటవుకావించి అనుదినము జేయుము
రామసేవా

4) పాపంబులను మహాప్రబల వారాశి దరిపట్టింపగా దొడ్డనావా
॥జను॥

5) సంసారమును నమ్మి సంపాదనలు చేయ శ్రమలు చేయు
మీరలున్నా

6) కంసారి ఆజ్ఞమై కదలిపోయెడి నాడు కానరాదది వట్టిసున్నా
॥జను॥

7) బ్రతికినన్నాళ్ళు మన భార్యాకుమారులని భ్రమలతో
మీరలమటింపా

8) ముదిమతో మంచాన మూల్గునప్పుడు వారు ముందు
దీయుదురు మీ కొంపా ॥జను॥

9) అత్తరులుపూసి తమ అందమును వీక్షించి అదరి పడనేల
పొగరెత్తి

10) చిత్తమును సూటిగాచేర్చి పరికింపు మిది చేవ లేనట్టి తోల్తిత్తి
॥జను॥

11) కడు దుష్కృతము లెన్నో గావించియును మూటకట్ట
నేమిటికిరా డబ్బా

12) అడుగులోనే మిమ్ము అల్లిబిల్లిగ జేసి అంతుండదది
సీటిమబ్బా ॥జను॥

13) ఇల పూడివాడిలో వెలయు శ్రీవైకుంఠ నిలయుడే
గతి యంచు నమ్మా

14) కలలోననైన మిమ్ము కదిలింపగా రారు కాలకింకరపాళి
బొమ్మా ॥జను॥

15) విష్ణుదాసుని మాటవేగమే ఆలించి విడువు డీ మానసపుమత్తూం

16) కృష్ణగోవింద హరి కేశవ ముకుంద అనికీర్తింప ముక్తి
మీసొత్తూం ॥జను॥

శ్రీరామ

కృష్ణనామము

1) కృష్ణనామము కృష్ణనామము కీర్తనీయము కృష్ణనామము
వైష్ణవత్వము నిచ్చు నీనామం శ్రీకృష్ణనామం

2) పలికినప్పుడె సర్వపాపము పాడుజేయును కృష్ణనామం
తొలగజేయు నెల్లరకు దుర్దశల నీనామం శ్రీకృష్ణనామం

3) ప్రబల రోగములనెడి పర్వత పంక్తి నరుకగ కృష్ణనామం
సబలమగు వజ్రాయుధంబని చాటదగు నీనామం శ్రీకృష్ణనామం

4) ఆదిమునియగు నారదులు కొనియాడుకొన్నది కృష్ణనామం
వేదవిదులగు సుజనులకు సంవేద్య మీనామం శ్రీకృష్ణనామం

5) దుమ్ముజేయును దలచువారల దుఃఖముల నీ కృష్ణనామం
నమ్మికొలిచెడివారలకు రత్నాలనిధి యీనామం శ్రీకృష్ణనామం

6) అందముగ బృందావనంబున నాలమేపిన కృష్ణనామం
నందగోపుని మందిరము నానంద మీనామం శ్రీకృష్ణనామం

7) గొల్లలపిల్లలతోడ చలుదులు గుడిచినట్టిది కృష్ణనామం
అల్లరులు గావించె మును వ్రేపల్లె నీనామం శ్రీకృష్ణనామం

8) కాంతనందుని భార్య రోటికి కట్టివైచిన కృష్ణనామం
వింతగా మద్దులను రెంటిని విరిచె నీనామం శ్రీకృష్ణనామం

9) గోపవనితలమై కోకలు కొల్లలాడిన కృష్ణనామం
పాపరాక్షసి ప్రాణమును పోబాపె నీనామం శ్రీకృష్ణనామం

10) దుష్టకురు సభ బన్న మొందిన ద్రుపదపుత్రికి కృష్టనామం
కష్టములు తొలగించి మానముగాచె నీనామం శ్రీకృష్ణనామం

11) హేలగా గోవర్ధనము పైకెత్తినట్టిది కృష్ణనామం
లీలనింద్రుని దర్పమును దూలించె నీనామం శ్రీకృష్ణనామం

12) పేద బాపని పిడికెడటుకుల ప్రీతిగన్నది కృష్ణనామం
ఖేదమార్చి మహాధనము లొలికించె నీనామం శ్రీకృష్ణనామం

13) మందమతియగు బాణరాక్షసు మదమడంచిన కృష్ణనామం
యిందుధరు గర్వమును హరియించె నీనామం శ్రీకృష్ణనామం

14) పాండురాజకుమారసమితికి నండయైనది కృష్ణనామం
భండనము వలదంచు దౌత్యమునెరపె నీనామం శ్రీకృష్ణనామం

15) గురునిలింపనదీసుతాదుల గొప్పచూడక కృష్ణనామం
గురుతుగా శూద్రాన్నమునె తాగోరె నీనామం శ్రీకృష్ణనామం

16) సకల లోకములకును ప్రభువై సంచరించెడి కృష్ణనామం
ఒకమనుష్యుని రథము తోలగ నొప్పె నీనామం శ్రీకృష్ణనామం

17) ఉభయ సేనావలి తమగు కదనోర్విలోపల కృష్ణనామం
శుభతరంబుగ బలికె గీతాసూక్తులీ నామం శ్రీకృష్ణనామం

18) అతుల చిత్ర విలాసలీలా వితతమైనది కృష్ణనామం
ప్రతిదినము పఠియించు వారికి భాగ్యమీనామం శ్రీకృష్ణనామం

19) పొలుపుగా నిల పూడివాడలో వెలసియున్నది కృష్ణనామం
సిలిచికొలిచెడి వారలకు రత్నాలనిధి ఈనామం శ్రీకృష్ణనామం

20) స్థిర గుణంబులకెల్ల నాలయ సీమయైనది కృష్ణనామం
ధరణిలోపల విష్ణుదాసుని దైవ మీనామం శ్రీకృష్ణనామం

శ్రీరామ

జనులార శ్రీరామ జయరామ రఘురామ శౌరియని
పలుకుడీమాట అను విధము

1) శ్రీరామనామమే మోక్షాధికారమని సరణి దెలియవె
సరసిజాక్షుని సేవ సారమెరిగిన వారిసాక్ష్యమడగవె నీవు మనసా

2) సారంబులకునెల్ల సారమగు రామనామామృతము
గ్రోలవే మనసా
సారహీనంబగు సంసారమందుబడి తాపమందగనేల మనసా

3) పుష్పబాణుని మోహపాశంబులనుగూర్చి పోవద్దు
నామాట వినవే
పుష్పబాణుని తండ్రి పదపద్మముల చెంత భృంగమై
చరియింపచనవే

4) రుచికరంబగు దివ్యరసరాజమున్నదని తెలియునా యిది
నీకు మనసా
రుచిరమూలంబగు శ్రీరామనామమను సుధ త్రాగవే
నీవింక మనసా

5) వరపూడివాడలో గోపాలరూపమున వెలసియున్నది
నిధి మనసా
కోరి కొలిచినవారి కొంగుబంగారమై కామితంబులు
దీర్చు మనసా

6) గోపాలదేవునికి సాకారమగు గొప్ప గురుకులంబున్నదే
తెలుసా
యీ పుణ్యతీర్థమున గురుచంద్రులున్నారు సేవింపవే
నీవు మనసా

7) మొవ్వ వేంకటదాస మేఘుండు గురిసిన కరుణారసంబను
సువృష్టి
అవ్యయంబగు రామనామంబుగలదాని త్రాగితే ఆత్మసంతుష్టి

8) శ్రీనివాసగురుండు సల్పిన బోధనాపటిమ గల్గిన గొప్పరసము
అనితరంబగురీతి విష్ణుదాసగురుండు వ్యాప్తిజేసిన సుధారసము

9) శ్రీ వేంకటాచల సుభగుండు నిరంతరంబు పఠనజేసెడి
మహారసము
పావనంబగు వీరి పాదయుగళంబులకు ప్రణతిజేసిన భక్తిరసము

10) అందరము గూడుకొని ఆ రసంబును ద్రావి
ఆరోగ్యమందుదమురండీ
బంధములు దొలగింప ఔషధంబు గదండి అన్ని వేళల
దొరకునండి

11) గురునికంటెను మించి దైవంబులేడని తెలియవే
యీమంచి మనసా
గురువునే దర్శించి గురువునే స్మరియించి తరియింపవే
నీవు మనసా

12) హరికృష్ణ గోవింద శౌరి విష్ణుముకుంద మాధవాచ్యుత
యనుచు బలుక
దురితములు దొలగించి దుఃఖములు హరియించి శాంతి
గలిగించునే మనసా

13) దివ్యసూరుల సూక్తి యీసూక్తి తలదాల్చి నెరవేర్చు
నాశౌరి మనసా

సవ్యమైనది కల్పితమ్ముగాదిది సత్యమ్ము సుమ్మిది నమ్ముమనసా

14) తత్త్వజ్ఞులగు విష్ణుదాసుని తత్త్వమగు విష్ణునామము యిదే
మనసా

సతము కమలాదేవి వ్రతవిధానంబగు కృష్ణనామము
యిదే మనసా

శ్రీరామనామమే మోక్షాధికారమనిన సరణి దెలియవె
నీవు మనసా

సారసాక్షుని భక్తిభావ మెరిగినవారి సంస్తుతింపవె నీవు మనసా

శ్రీరామ

కృష్ణనామము కృష్ణనామము కీర్తనీయము కృష్ణనామము అనుమాదిరి

రామనామము రామనామము రమ్యమైనది రామనామం
కామితార్థములిచ్చు నీనామం శ్రీరామనామం

అవ్యయుండగు వాయుపుత్రుని తన్మయము గావించు నామం
భవ్యగుణముల నిలయమగు సంసేవ్య మీనామం శ్రీరామనామం

గరిమ గిరిసుత మానసమునకు పరమహితమగు రామనామం
పరమశివునకు ప్రియతమంబగు అభయమీనామం శ్రీరామనామం

ఆదికవి వాల్మీకి వ్రాసిన అక్షరార్ణవ రామనామం
గాధి తనయుని యాగమును గాపాడె నీనామం శ్రీరామనామం

ముదముతో మునిపత్ని శాపము తొలగజేసిన రామనామం
పదములంబడి ముదితజేసిన నతులగొనె నీనామం శ్రీరామనామం

విధినిబోలిన మౌని యానతి మిథిలకేగిన రామనామం
చంద్రచూడుని చాపమునుఖండించె నీనామం శ్రీరామనామం

అందముల అపరంజి సీత వరించినట్టిది రామనామం
ప్రథితుడగు జనకునికి మోదముగూర్చె నీనామం శ్రీరామనామం

శ్రుతిశిరంబుల భాసమందెడి జ్యోతిమైనది రామనామం
అతులితంబగు మహిమగల్గిన మంత్రమీనామం శ్రీరామనామం

కుక్షిజగముల నిల్పి రక్షణజేయునట్టిది రామనామం
పక్షపాతములేని సాక్షిభూతమీ నామం శ్రీరామనామం

విరివిగా యీ నామముండియు పలనండీయమునిదండన
మరమరాయను మాటపలికిన తేటపడు నీనామం
శ్రీరామనామం

బ్రహ్మనిమలగు విష్ణుదాసుని భావమే యీ రామనామం
అహరహంబును రామబాణము మనన మీనామం
శ్రీరామనామం

పుడమియందున ఫ్రాడివాడ నిలయమైనది రామనామం
ఓడపూడిన పురమునే వాంఛించె నీనామం శ్రీరామనామం

రామనామము రామనామము రమ్యమైనది రామనామము
కామితార్థములిచ్చు నీ నామం శ్రీరామనామం

శ్రీరామ

మంగళహారతి

హారతీయిచ్చేదరా అంగజాజనకా యిదే అను నానికి (అనుకరణ)

1) హారతీ యిచ్చేదమురా రఘువీర శుభకర నీకిదే హారతీ
ధారుణి మముగావగా ధరణి సుతతో వెలయు నీకిదే హారతీ ॥

2) పంకజాక్ష నీదుపాద పంకజములను వేడుచు
ప్రాకటంబుగ మమ్ము బ్రోచెడి ప్రభుడవనుచును నీకిదే హారతీ ॥

3) అక్షయంబగు చీరలను జలజాక్షికిచ్చిన నీ దయా
భిక్షగోరిన మమ్ము రక్షణజేయుస్వామివి నీవని హారతీ॥

4) పరమపావన నీ దయామృత వృష్టి మాపై గురియుచు
వరములిచ్చెడి పరమపురుషుడవనుచు నీ పదసన్నిధి హారతీ

5) ఎల్ల వేళల గోపబాలుని యుల్లమందున మరువక
చల్లని శుభవేళ వానికి చెల్లవలె కర్పూరహారతి

6) ఏడుకొండలస్వామి నీకిదె యిచ్చుచుంటిమి హారతీ
తోడుగా సగభాగమగు పద్మావతీ సహితంబుగా హారతీ

7) సర్వశుభములు నీదుచల్లని చూపులు సర్వేశ్వరా
సర్వపాప తాపముల కవితూపులగు కరుణాకరా

8) మత్తిఇందిర నీ పదంబులు చిత్తమున దలపోయుచు
బత్తిముదముల చేతులెత్తిపట్టి నా ముత్యాలహారతి, హారతీ

— లఘుతిరువారాధనక్రమము —

వక్కపట్ల ఉపాద్రిపతి

హరిః ఓం భగవత్సన్నిధిముపగమ్య, విధివత్ ప్రణమ్య
అస్మద్దేశిక మస్మదీయ పరమాచార్యా నశేషాన్ గురూన్
శ్రీమల్లక్ష్మణ యోగిపుంగవ మహాపూర్ణౌమునింయామునమ్
రామం పద్మవిలోచనం మునివరం నాథం శఠద్వేషిణం
సైన్యేశం శ్రియమిందిరా సహచరం నారాయణం సంశ్రయే
ఓం నమో నారాయణాయ,
శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే
శ్రీమతే నారాయణాయనమః
సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః
కౌసల్యా సుప్రజా! రామ ! పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల ! కర్తవ్యం దైవమాహ్నికం
ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ
ఉత్తిష్ఠ కమలాకాన్త ! త్రైలోక్యం మంగళంకురు

[అని 3 సార్లు చప్పట్లుచరచి భగవన్మందిరము తలుపులు తెఱచి, మళ్ళీ నమస్కరించి]

శ్రీభగవదాజ్ఞయా, శ్రీభగవద్భాగవతాచార్య కైంకర్యరూపం
ఆరాధనం కరిష్యే

[అని సంకల్పించి, నిర్మాల్యము తీసివేసి, ఆచార్య ఆరాధన పాత్రను తీసుకొని జలముతో నింపి, తులసీదళమునుంచి ఆచార్య దివ్య నామమును సంధానం చేయవలెను.]

శ్రీరంగరాజ చరణాంబుజ మూలదాసం
శ్రీకాంచి పూర్వవరదరాజ పదాబ్జ భృంగమ్
శ్రీవేంకటేశ పదకం జమరాళరాజం
శ్రీవిష్ణుదాస గురుపుంగవ మానతోఽస్మి
శ్రీమద్రామాయణామ్నాయ స్వరూపాయ మహాత్మనే
రామభక్తి ప్రబోధాయ కృష్ణదాసాయతే నమః
నారాయణాంఘ్రి నవనీరజ మత్తభృంగం
భక్తిప్రపత్తి సరసీచర రాజహంసమ్
పౌరాణిక ప్రథమ ముత్తమ తత్త్వబోధం
శ్రీశ్రీనివాస గురుపుంగవ మాశ్రయేఽహమ్
గోవిందసుందర పదాంబుజ మగ్నచిత్తో
మందాకినీ తులిత మంజుల వాక్ప్రవృత్త్యా
లోకం సమస్తమ కరోదవ ధూతపాపం
తం వేంకటాఖ్య గురుమాత్మని భావయామః
సంసారతాపానల దగ్ధభావా
స్సమాగతా యావవలోక్య సద్యః
భవంతిబోధామృత సేకహృష్టా
స్తామేగ తిర్వేంకట దేశికాంఘ్రీ
ధ్యాయామి, ఆవాహయామి
రత్నసింహాసనం సమర్పయామి
హస్తయోః అర్ఘ్యం సమర్పయామి
పాదయోః పాద్యం సమర్పయామి
ముఖే ఆచమనీయం సమర్పయామి
స్నానం సమర్పయామి
స్నానానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి
[ఉద్ధరిణతో చూపించిన జలమును పతద్గ్రిహ పాత్రయందుంచవలెను.]

ప్లోతవ స్త్రేణ సంమృజ్య, పీతాంబర వస్త్రయుగ్మం సమర్ప యామి, ఊర్ధ్వపుండ్రాన్ సమర్పయామి, పుష్పాణి సమర్పయామి, శ్రీగంధం సమర్పయామి, స్వాచార్య శ్రీహస్తేన భగవన్నారా యణా రాధనాభి ముఖోభవేయం

[అని భగవంతుని ప్రార్థించి, పూర్ణకుంభమందు గంధపుష్ప తులసీదళములను పరిమళద్రవ్యములను ఉంచి]

ఓం నమో నారాయణాయ ఇత్యభిమంత్ర్య ఆగ్నేయాది కోణములయందు అర్ఘ్య, పాద్య, ఆచమన, స్నాన పాత్రలనుంచి మధ్య శుద్ధ జలపాత్రనుఉంచి పూర్ణకుంభంలోని తీర్థముతో ఆపాత్ర లను నింపి, ప్రతిపాత్రయందును ఉద్ధరిణితో కొద్దికొద్దిగా తీర్థమును తీసికొని "శ్రీమతే నారాయణాయనమః" అని తనను భగవంతుని యాగభూమిని పూజాద్రవ్యములను ప్రోక్షించి

ఓం సమస్త పరివారాయ సర్వమంగళశాలి విగ్రహాయ
శ్రీమతే నారాయణాయనమః ధ్యాయామి, ఆవాహయామి
రత్నసింహాసనం సమర్పయామి
హస్తయోః అర్ఘ్యం సమర్పయామి
పాదయోః పాద్యం సమర్పయామి
ముఖే ఆచమనీయం సమర్పయామి
స్నానం సమర్పయామి
స్నానానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి
ప్లోతవ స్త్రేణ సంమృజ్య పీతాంబర వస్త్రయుగ్మం సమర్పయామి
ఊర్ధ్వపుండ్రాన్ సమర్పయామి, దివ్య శ్రీచందనం సమర్పయామి
సర్వాణ్యలంకారాణి సమర్పయామి తులసీదళైశ్చ పుష్పైశ్చ
పూజయామి

ఓం కేశవాయనమః	ఓం శ్రీధరాయ నమః
ఓం పురుషోత్తమాయనమః	,, నారాయణాయ ,,
,, హృషీకేశాయ ,,	,, అధోక్షజాయ ,,
,, మాధవాయ ,,	,, పద్మనాభాయ ,,
,, నారసింహాయ ,,	,, గోవిందాయ ,,
,, దామోదరాయ ,,	,, అచ్యుతాయ ,,
,, విష్ణవే ,,	,, సంకర్షణాయ ,,
,, జనార్ధనాయ ,,	,, మధుసూదనాయ ,,
,, ప్రద్యుమ్నాయ ,,	,, హరయే ,,
,, త్రివిక్రమాయ ,,	,, అనిరుద్ధాయ ,,
,, శ్రీకృష్ణాయ ,,	,, వామనాయ ,,

ఓం సమస్త పరివారాయ దివ్యమంగళశాలి విగ్రహాయ శ్రీమతే నారాయణాయ నమః, ధూపమాఘ్రాపయామి, దీపం దర్శయామి ధూపదీపానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి

శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవమ్
యతీంద్ర ప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్
లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమామ్
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్

మాతా పితాయుత యస్తనయా విభూతి
స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్
ఆద్యస్యనః కులపతేర్వ కుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామిమూర్ధ్నా

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసారకులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మినిత్యమ్

యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహత స్తదిత రాణి తృణాయ మేనే
అస్మద్గురోర్భగవ తోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే-

మహానివేదనము సమస్తపరివారాయ సర్వదివ్యమంగళ శాలి విగ్రహాయ శ్రీమతే నారాయణాయనమః అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి-

[స్థలమును శుద్ధిజేసి ఆరగింపుజేసెడి పదార్థములను భగవంతుని యెదుటనుంచి జలముతో ప్రోక్షించి]

ఓం నమోనారాయణాయ
శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే శ్రీమతేనారాయణాయనమః
ఓంఓంఓం సమస్త పరివారాయ సర్వదివ్యమంగళ శాలివిగ్రహాయ
శ్రీమతే నారాయణాయనమః మహానైవేద్యం సమర్పయామి
మధ్యేమధ్యే పానీయం సమర్పయామి, ఉత్తరాపోశనం సమర్పయామి
అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి

సమస్త పరివారాయ సర్వదివ్యమంగళ శాలివిగ్రహాయ
శ్రీమతే నారాయణాయ నమః తాంబూలం సమర్పయామి

[తరువాత కర్పూరం వెలిగించి హారతి ఇవ్వాలి]

శ్రియః కాంతాయకల్యాణ నిధయే నిధయేర్థి నామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్
స్వోచ్ఛిష్ట మాలికాసక్త గంధ బంధుర జిష్ణవే
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్
మంగళా శాసనపరైః మదాచార్య పురోగమైః
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్
సమస్త పరివారాయ సర్వదివ్యమంగళ శాలివిగ్రహాయ
శ్రీమతే నారాయణాయనమః సువర్ణమంత్ర పుష్పం సమర్పయామి

పాత్రలలో మిగిలిన నీటిని పటికపాత్రలోనింపి తీర్థవినియోగం చేయవలెను.

సర్వదేశ దశాకాలేష్వ వ్యాహిత పరాక్రమా, రామానుజార్య
దివ్యాజ్ఞా వర్ధతామభి వర్ధతామ్
శ్రీశైలేశ దయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవమ్
యతీంద్ర ప్రవణం వందే రమ్య జామాతరం మునిమ్
సమస్త పరివారాయ సర్వదివ్యమంగళ శాలి విగ్రహాయ
శ్రీమతే నారాయణాయనమః పర్యంకాసనం సమర్పయామి

సాష్టాంగ నమస్కారంచేసి తీర్థం తీసుకొని తలుపులు మూయవలెను.

ఉపచారాపదేశేన కృతానహరహస్మయా
అపచారా నిమాన్ సర్వాన్ క్షమ స్వపురుషోత్తమ

లఘు తిరువారాధన సమాప్తమ్



కూర్చున్నవారు :

మొవ్వ రంగరాజు పెరుమాళ్ళు

తన్నీరు కమలాదేవి (రచయిత్రి)

సుధాకర్ (రచయిత్రి ద్వితీయ జామాత)

నిలుచున్నవారు :

1. మొవ్వ విజయలక్ష్మి (రంగరాజ పెరుమాళ్ళ ధర్మపత్ని)
2. తన్నీరు రాజమిహిరాక్ష ప్రసాదు (రచయిత్రి కుమారుడు)
3. రచయిత్రి కోడలు








కీ.శే.పద్యాల కుటుంబయ్య-బసవపున్నమ్మ
దంపతులు



